తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 12.05.2025 | సంపుటి :11 సంచిక : 293 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

పాక్ భారత్‌ను ఓడించింది

కాల్పుల విరమణ ప్రకటన అనంతరం దేశప్రజలనుద్దేశించి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అనుచిత వ్యాఖ్యలు



ఇస్లామాబాద్(జనంసాక్షి): సరిహద్దుల్లో మూడు రోజులుగా జరుగుతున్న భీకర పోరులో అమెరికా మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్తాన్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పాకిస్తాన్ తన వక్రబుద్ధిని చాటుకుంటూ రెచ్చగొట్టే విధంగా సరిహద్దులో కాల్పులు జరిపింది. అంతటితో ఆగకుండా.. పాక్ ప్రధాని విచిత్రంగా తమదే గెలుపు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత షెహబాజ్ షరీఫ్ పాకిక్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా షరీఫ్

మిగతా 2లో..

పుల్వామా దాడి మా పనే..

పాకిస్తాన్ వాయుసేన అధికారి అంగీకారం

వార్త 2లో

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్‌లు పాల్గొననున్నారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్ డీజీఎంవోతో పాకిస్థాన్ డీజీఎంవో హాట్ లైన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదించి.. వెంటనే అమలు చేద్దామని కోరారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ తరపున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. మరోవైపు కాల్పుల విరమణ ప్రకటించిన కొన్నిగంటల్లోనే పాక్ సైన్యం ఉల్లంఘించింది.

పాక్‌కు మా మద్దతు కొనసాగుతుంది:చైనా

పాక్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలి

బలూచ్ లిబరేషన్ ఆర్మీ కీలక ప్రకటన

2లో

కాశ్మీర్‌పై ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు

పీవోకే అయితే మట్లాడతాం • అంతకుమించి వేరే మార్గం లేదు

- కశ్మీర్ విషయంలో మాకు స్పష్టమైన వైఖరి ఉంది
- పాక్‌ను సైనికంగా, రాజకీయంగా, మానసికంగా దెబ్బకొట్టాం
- ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు: భారత సైన్యం వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కశ్మీర్ విషయంలో తమకు స్పష్టమైన వైఖరి ఉందని భారత్ మరోసారి స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ తిరిగి రావడమనే ఒకే ఒక్క విషయం మిగిలి ఉందని తేల్చి చెప్పింది. ఈ మేరకు భారత ప్రభుత్వ వర్గాలు మీడియాకు సమాచారం ఇచ్చాయి.

మిగతా 2లో..

మళ్లీ తూటా పేలితే ధీటైన సమాధానమిస్తాం

పాక్ భారత్‌పై దాడిచేస్తే.. ప్రతిస్పందన వినాశకరంగా ఉంటుంది

దాడులు చేయకుంటే మేము కూడా సంయమనం పాటిస్తాం

అమెరికా ఉపాధ్యక్షుడు జ్రేడీ వాన్స్‌తో స్పష్టం చేసిన మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వీటికి ముగింపు పలికేందుకు తాము మధ్యవర్తిత్వం వహిస్తామంటూ అమెరికా ముందుకొస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల సంప్రదింపులు జరిపారనే వార్తలు వచ్చాయి. ఆ క్రమంలో పాకిస్థాన్ ఒకవేళ దాడి చేస్తే ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుందని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది.ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చితే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుందని ప్రధాని మోదీతో జేడీ వాన్స్ పేర్కొన్నట్లు తెలిసింది. దీనికి మోదీ బదులిస్తూ..

మిగతా 2లో..

లష్కరే తోయిబా స్థావరాలపైనే దాడి

శాటిలైట్‌చిత్రాలను విడుదలచేసిన భారత సైన్యం

న్యూఢిల్లీ(జనంసాక్షి): అమాయక ప్రజలు, ప్రార్థనామందిరాలపై భారత్ బాంబుల వర్షం కురిపించిందంటూ.. పాక్ ఎన్ని కబుర్లు చెప్పినా మురీద్కేలోని ఉగ్రపాములను దాచలేకపోతోంది.అక్కడి మర్కజ్

మిగతా 2లో..

ట్రంప్ కొత్తపల్లవి

భారత్-పాక్ మధ్య కాశ్మీర్ విషయంలో చర్చలకు సిద్ధమంటూ ఆసక్తికర వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం అమెరికా మధ్యవర్తిత్వంతో సద్దుమణిగింది. ప్రస్తుతం ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి.రంగంలోకి దిగిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుదేశాల నేతలతో చర్చించి కాల్పుల విరమణకు వచ్చేలా చేశారు. అయితే, భారత్-పాక్ అంశంపై తాజాగా ట్రంప్ మరోసారి స్పందించారు. ఈసారి కశ్మీర్ అంశం ప్రస్తావించి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్విట్టర్ వేదికగా ట్రుత్‌తో స్పందిస్తూ..'కశ్మీర్ సమస్య పరిష్కారానికి భారత్-పాక్‌తో కలిసి పనిచేస్తాం. కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నాను. వెయ్యి సంవత్సరాల కశ్మీర్ విషయంలో ఒక పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నాను. అలాగే, భారత్, పాకిస్తాన్‌ను చూసి నేను గర్వపడుతున్నాను. ప్రజల మరణానికి, నాశనానికి దారి తీసే ప్రస్తుత యుద్ధాన్ని ఆపాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ విషయం పూర్తిగా అర్థం చేసుకునే శక్తి, జ్ఞానం, ధైర్యాన్ని రెండు దేశాలు కలిగి ఉన్నాయి. అచంచలమైన శక్తివంతమైన నాయకత్వం రెండు దేశాలకు ఉందని కితాబిచ్చారు.యుద్ధం కారణంగా లక్షలాది మంది అమాయక ప్రజలు చనిపోయే అవకాశం ఉంది!. మీ ధైర్యవంతమైన చర్యల ద్వారా మీ వారసత్వం బాగా మెరుగుపడింది. ఈ చారిత్రాత్మక, వీరోచిత నిర్ణయం తీసుకోవడంలో అమెరికా మీకు సాయం చేయగలిగినందుకు నేను గర్విస్తున్నాను. ఇలాంటి చారిత్రక నిర్ణయంలో అమెరికా సాయపడటం గర్వంగా ఉంది. ఈ రెండు గొప్ప దేశాలతో నేను వాణిజ్యాన్ని గణనీయంగా పెంచబోతున్నాను' అని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న

మిగతా 2లో..

కాల్పుల విరమణపై ట్రంప్ పెత్తనమేంటి?

- అందుకు మీరు ఎందుకు అంగీకరించారు?
- కశ్మీర్ మన దేశ సమస్య దాన్ని అంతర్జాతీయ సమస్యగా చేయడం సరైంది కాదు
- ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే,రాహుల్ లేఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల ఒప్పందంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ , ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పీవోకేను పాకిస్థాన్ ఖాళీ చేయాలని కోరుతూ..1994లో లోక్‌సభ, రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదించబడిన తీర్మానం గురించి వారు పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఆ పార్టీ తప్పుబట్టింది.మన దేశ సమస్య అయిన కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని వ్యతిరేకించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా

మిగతా 2లో..

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే వచ్చాయి.మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్ చంద్రకు మొదటి ర్యాంకు, నంద్యాల జిల్లా కోనాపురం వాసి ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డికి రెండో ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్‌కు మూడో ర్యాంకు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించింది. మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (మాదాపూర్)కు ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్‌రెడ్డి (మాదాపూర్) ఆరో ర్యాంకు, రష్మిత్ బండారి (మాదాపూర్) ఏడో ర్యాంకు, బనిబ్రత మాజీ (బడంగ్‌పేట్)కు ఎనిమిదో ర్యాంకు, కొత్త ధనుష్‌రెడ్డి (హైదరాబాద్)కు తొమ్మిదో ర్యాంకు, కొమ్మ కార్తీక్ (మేడ్చల్)కు పదో ర్యాంకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అగ్రికల్చర్-ఫార్మా ఫలితాల్లో మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డికి మొదటి ర్యాంకు వచ్చింది. కరీంనగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్)కు రెండో ర్యాంకు, వరంగల్‌కు చెందిన అక్షిత్‌కు

మిగతా 2లో..

శ్రీలంకలో ఘోర ప్రమాదం

లోయలో పడ్డ బస్సు..

21 మంది ప్రయాణికులు దుర్మరణం

కొలంబో(జనంసాక్షి): శ్రీలంకలో పెను విషాదం చోటు చేసుకుంది. కోట్మాలేలోని కరండీ ఎల్లా ప్రాంతం నుంచి 78 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలో పడింది.ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో 21 మంది ప్రయాణికులు మరణించగా.. 30 మందికి పైగా తీవ్రంగా గాయ పడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు,రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడ్డ క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.మరోవైపు,పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించ వల్లే ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడం,

మిగతా 2లో..

చర్చలకు సిద్ధం

ప్రకటించిన రష్యా,ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్,జెలెన్‌స్కీ

మాస్కో,కీవ్(జనంసాక్షి): రష్యా అధినేత పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇస్తాంబుల్ వేదికగా చర్చలకు పుతిన్ ఆహ్వానాన్ని నేరుగా ఆయన ప్రస్తావించలేదు. కానీ, "ఎట్టకేలకు రష్యా యుద్ధం ముగించే విషయాన్ని పరిశీలిస్తోంది" అని పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి ఇందుకోసమే ప్రపంచం మొత్తం ఎదురు చూస్తోందన్నారు. యుద్ధం ముగింపులో మొదటి అడుగు కాల్పుల విరమణే అని పేర్కొన్నారు. ఈ మారణకాండను ఒక్కరోజు కూడా కొనసాగించడంలో అర్థం లేదు. రష్యా కాల్పుల విరమణ ధ్రువీకరణ కోసం ఎదురు చూస్తున్నాం. రష్యా ప్రతినిధులను కలిసేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు. సోమవారం నుంచి మొదలయ్యే 30 రోజుల కాల్పుల విరమణను రష్యా ఉల్లంఘిస్తే.. మరిన్ని ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బ్రిటన్ ప్రధాని స్టార్మర్ సహా పలువురు ఐరోపా నాయకులు వెల్లడించారు.

మిగతా 2లో..

ఉగ్రశక్తులకు భారత్ ధీటుగా బదులిస్తోంది

- ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదు
- ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనం
- పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లోనూ 'భారత సేన గర్జించింది'
- ఉత్తర్‌ప్రదేశ్‌లో బ్రహోస్ క్షిపణులు తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్

లక్నో(జనంసాక్షి): ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు .ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. భారత సైన్యం పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కేంద్రమున్న రావల్పిండిలోనూ గర్జించిందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన ఉగ్ర శక్తులకు భారత్ దీటుగా బదులిస్తుందన్నారు. ఈ ఆపరేషన్ ఉగ్రవాదంపై పోరులో దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తి సామర్థ్యాలను చాటిచెప్పిందన్నారు. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరిందన్నారు. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదని, కానీ, దాయాది మాత్రం పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసిందన్నారు.

బ్రహ్మోస్ దెబ్బకు.. పాక్ విలవిల

వార్త 2లో

దాయాదిపై దాడుల్లో అత్యాధునిక ఆయుధాన్ని వినియోగించిన భారత్!

షేక్ హసీనాకు బిగ్ షాక్

బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పార్టీపై నిషేధం

ఢాకా/న్యూఢిల్లీ(జనంసాక్షి): బంగ్లాదేశ్‌లో ముహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీని నిషేధించింది. ఉగ్రవ్యతిరేక చట్టం నిబంధనల ప్రకారం అవామీ లీగ్‌ను నిషేధించినట్లు శనివారం సాయంత్రం అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. సలహాదారుల మండలి(కేబినెట్) నిర్ణయం మేరకే నిషేధం విధించామని, నిషేధానికి సంబంధించిన గెజిట్

మిగతా 2లో..

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

మూడో ర్యాంకు లభించాయి. సాయినాథ్ (కొత్తకోట, వనపర్తి)కు నాలుగో ర్యాంకు, బ్రాహ్మణి (మాదాపూర్)కి ఐదో ర్యాంకు, గుమ్మడిదల తేజస్ (కూకట్‌పల్లి)కు ఆరో ర్యాంకు, అఖిరానందన్‌రెడ్డి (నిజాంపేట)కు ఏడో ర్యాంకు, భానుప్రకాశ్‌రెడ్డి (సరూర్‌నగర్)కి ఎనిమిదో ర్యాంకు, శామ్యూల్ సాత్విక్ (హైదర్‌గూడ)కు తొమ్మిదో ర్యాంకు, అద్దుల శశికరణ్‌రెడ్డి (బాలాపూర్)కి పదో ర్యాంకు వచ్చాయి.

పుల్వామా దాడి మా పనే

అంగీకరించిన పాక్ వాయుసేనాధికారి

ఇస్లామాబాద్(జనంసాక్షి):కశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది పారామిలిటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబుదాడి వెనుక తమ హస్తం ఉందని పాక్ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ ప్రెస్‌మీట్‌లో అంగీకరించారు. దీంతో ఉగ్రవాదంతో తమకు సంబంధం లేదని ఇస్లామాబాద్‌లోని నేతలు చెబుతున్నవి మొత్తం కాకమ్మ కబుర్లే అని తేలిపోయింది.ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో డీజీఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదురి, నేవీ ప్రతినిధితో కలిసి ఔరంగజేబ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ''పాక్‌కు చెందిన గగనతలం, భూభాగం, జల సరిహద్దులకు లేదా ప్రజలకు ముప్పుగా పరిణమిస్తే.. వాటిని ఎదుర్కొనేందుకు మేం రాజీ పడబోం. దానిని పట్టించుకోకుండా ఉండలేం.. మా దేశానికి కట్టుబడి ఉంటాం. మా దేశ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో.. మేము ఎప్పుడూ దానిని నిలబెట్టుకుంటాం. పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించాం. మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించాం'' అని వ్యాఖ్యానించారు.ఔరంగజేబ్ అహ్మద్ వ్యాఖ్యలతో పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందన్న విషయం మరోసారి స్పష్టమైంది. నాడు పుల్వామా దాడితో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ ఎంత బుకాయించినా .. తాజాగా వాయుసేనాధికారి వ్యాఖ్యలతో వాస్తవం బయటకు వచ్చింది. తాజాగా పహల్గాం దాడిపై కూడా ఇలానే స్పందిస్తోంది.

పాక్‌కు మా మద్దతు కొనసాగుతుంది

చైనా కీలక ప్రకటన.. పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలి

దయాది ఉగ్రస్థావరాలపై దాడులకు భారత్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తాం

- పాక్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీ కీలక ప్రకటన

బీజింగ్(జనంసాక్షి): పాకిస్తాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, జాతీయ స్వాతంత్ర్యం కోసం తమ మద్దతు కొనసాగుతుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టంచేశారు.పాక్‌కు అండగా ఉంటామని ఉద్ఘాటించారు. ఆయన శనివారం పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాఖ్ దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, తాజా పరిణామాలను ఇషాఖ్ దార్ వివరించారు.ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లోనూ పాకిస్తాన్ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వాంగ్ యీ ప్రశంసించారు. పాక్ సంయమన ధోరణిని కొనియాడారు. మిత్రదేశమైన పాక్‌కు తమ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్, తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌తోనూ ఇషాఖ్ దార్ ఫోన్‌లో మాట్లాడారు.

పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలి: బలూచ్ లిబరేషన్ ఆర్మీ

ఇస్లామాబాద్(జనంసాక్షి):మాంగోచార్ తమకు స్వతంత్ర దేశం కావాలని ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్న బలూచ్ తిరుగుబాటు దారులు.. మరోసారి కీలక ప్రకటన చేశారు. పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలంటూ డిమాండ్ చేశారు.అదే సమయంలో పాక్ ఉగ్రస్థావరాలపై దాడులకు దిగిన భారత్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామంటూ ప్రకటించారు. పాకిస్తాన్‌పై భారత్ సైనిక చర్య తీసుకుంటే, పశ్చిమ సరిహద్దుల నుంచి పాక్‌పై తిరుగుబాటు చేస్తామన్నారు. భారత్‌కు సైనిక శక్తిగా నిలుస్తామంటూ ప్రకటించారు.పాకిస్తాన్‌లో 40 శాతం భూభాగం తమదేనని, తమకు ప్రత్యేక దేశం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలుపెట్టారు. అవకాశం దొరికినప్పుడల్లా పాకిస్తాన్‌కు నిద్ర పట్టకుండా చేస్తూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉగ్రవాదులు ఏరివేతే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టగా, అందుకు బలూచ్ తిరుగుబాటుదారులు సైతం మద్దతు తెలుపుతున్నారు. పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇళ్లకు అప్పుడే రావొద్దు..

సరిహద్దు గ్రామాల ప్రజలకు అడ్వైజరీ

శ్రీనగర్: భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్మూకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిన సరిహద్దు గ్రామాల ప్రజలకు కీలక అడ్వైజరీ జారీ చేశారు. ప్రజలు అప్పుడే తిరిగి తమ ఇళ్లకు తిరిగి రావొద్దని.. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని కోరారు. పాకిస్థాన్ ప్రయోగించిన ఫిరంగి గుండ్లు (షెల్స్)నుంచి ఈ ప్రాంతాలను గుర్తించి శానిటైజ్ చేయాల్సి ఉందని తెలిపారు. పాక్ దాడుల తీవ్రతకు అధికంగా నష్టపోయే అవకాశం ఉండటంతో బారాముల్లా, బందిపొరా, కుప్వారా జిల్లాల్లోని నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలకు చెందిన దాదాపు 1.25లక్షల మందికి పైగా ప్రజలను భద్రతా సిబ్బంది ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెలిసిందే. అయితే, సరిహద్దు ప్రాంతాల్లో తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడే తమ నివాసాలకు వెళ్లొద్దని కోరుతున్నారు. దాడుల సమయంలో పాక్ ప్రయోగించిన షెల్స్ (ఫిరంగి గుండ్లు) చెల్లాచెదురుగా పడి ఉండటం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభావిత ప్రాంతాలకు బాంబు నిర్వీర్య బృందాలను పంపి గ్రామాల్లో ప్రజల ప్రాణ నష్టానికి కారణమయ్యే ఫిరంగి గుండ్లను గుర్తించి, శానిటైజ్ చేస్తామని తెలిపారు. మరోవైపు, 2023లో ఎల్‌వోసీ సమీపంలో ఇలా మిగిలిపోయిన షెల్స్ పేలుడుతో 41మంది ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం నింపింది.

మళ్లీ తూటా పేలితే దీటైన సమాధానమిస్తాం

పాకిస్థాన్ ఎటువంటి దాడులు చేయకుంటే తాము కూడా సంయమనం పాటిస్తామని చెప్పినట్లు సమాచారం. "ఒకవేళ పాకిస్థాన్ ఏదైనా చేస్తే.. ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుంది" అని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. అయితే, అదే రోజు రాత్రి భారత్‌లోని 26 ప్రదేశాలలపై పాకిస్థాన్ దాడులు చేయగా.. వాటన్నింటినీ భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. అనంతరం పాక్ వైమానిక కేంద్రాలపైనా భారత్ విరుచుకుపడింది. దీంతో కాల్పుల విరమణకు సిద్ధమంటూ పాక్ సైన్యం కోరడంతో తాత్కాలిక విరమణకు భారత్ అంగీకరించింది.తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించిన కొద్ది గంటల్లోనే పాక్ మళ్లీ దాడులకు తెగబడటం.. అనంతర పరిణామాలపై త్రివిధ దళాలతో ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ స్థాయిలో మే 12న చర్చలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి కీలక స్పందన వచ్చింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పంగించడం మినహా మరో విషయంపై మాట్లాడేది లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదుల అప్పగింతపై పాక్ మాట్లాడితే తాము మాట్లాడుతామని తెలిపాయి. అయితే, ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని, అటువంటి అవసరమూ లేదని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది.

భారత్‌పై పాక్ విజయం సాధించింది

- దేశప్రజలనుద్దేశించి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అనుచిత వ్యాఖ్యలు

మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధంలో తాము విజయం సాధించినట్టు పేర్కొన్నారు. తమ దేశాన్ని, తమ పౌరులను రక్షించుకోవడానికి తాము ఏది చేయడానికైనా వెనుదిరిగేది లేదన్నారు. పాక్‌ను ఎవరైనా సవాల్ చేస్తే వారిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని వెల్లడించారు. భారత్ తమ దేశంలోని మసీదులు, సామాన్య పౌరులపై డ్రోన్స్, మిస్సైల్స్ తో దాడులు చేసిందని.. అనేకమంది సాధారణ పౌరుల చావుకు భారత్ కారణమైందని మండిపడ్డారు. తమదేశంపై నిరాధార ఆరోపణలు కూడా చేస్తుందని.. భారత్‌కు తగిన బుద్ధి చెప్పామని.. తమ జోలికి వస్తే ఏదైనా చేయగలమని చూపించామంటూ ఓవరాక్షన్ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

లష్కరే తోయిబా స్థావరాలపైనే దాడి

తయ్యబా భవనం వివిధ రకాల ఉగ్రమూకలను సాకే కేంద్రంగా నిలిచిందని పశ్చిమ దేశాల మీడియా సంస్థలు కోడై కూస్తున్నాయి. తాజాగా స్కైన్యూస్ బృందం వివిధ సోషల్ మీడియా వేదికల నుంచి సేకరించిన వీడియోలు, ఫొటోలు, కామెంట్లను విశ్లేషించి.. మురీద్కేలో భారత్ దాడి చేసింది లష్కరే ఉగ్రపుట్టపైనే అని తేల్చింది. దీనికి తోడు ఈ దాడి తర్వాత అల్‌ఖైదా ఉపఖండం శాఖ భారత్‌ను తప్పుపట్టడాన్ని కూడా చూపించింది.మురీద్కేలోని మర్కజ్ తయ్యబాకు సంబంధించి టిక్‌టాక్, యూట్యూబ్, గూగుల్‌లలో పోస్టు చేసిన వీడియోలను స్కైన్యూస్ సేకరించింది. వాటిల్లో లష్కరే తయ్యబాకు మద్దతుగా చాలా క్లిప్స్ ఉన్నాయి. అత్యధికంగా '313' అనే గ్రూపు పోస్టు చేసిన వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ వీడియోల జియోలోకేషన్లు చూడగా వాటిల్లో చాలా వరకు లష్కరే, 313 అనే క్యాప్షన్లు వచ్చాయి.వీధుల్లో తుపాకులతో తిరుగుతున్న వ్యక్తులను ఓ వీడియోలో చూపించారు. దీనికి లష్కరే తయ్యబా, ముజాహిద్ ఫోర్స్, 313, మర్కజ్ తయ్యబా మురీద్కే అనే క్యాప్షన్లు ఉన్నాయి. మరో దానిలో పిల్లలు ఆయుధాలు వాడుతున్నట్లు చూపారు. అక్కడ కూడా '313 జిహాద్' అనే క్యాప్షన్ ఇచ్చారు. వీటిలో చాలా ఖాతాలకు పరస్పర సంబంధాలున్నాయి.ఇక టెర్రరిజం రీసెర్చి అండ్ అనాలిసస్ కన్సార్టియంకు చెందిన ముస్కాన్ సంగ్వాన్ స్పందిస్తూ.. 'బ్రిగేడ్ 313 అనేది పాక్‌లోని అల్ ఖైదా విభాగం. దీని ఛత్రం కింద తాలిబన్, లష్కరే జంగ్వీ, హర్కత్ ఉల్‌జిహాద్ అల్ ఇస్లామీ, జైషే మొహమ్మద్, లష్కరే తయ్యబా, జుందుల్లా సంస్థలు ఉంటాయి. బ్యాటిల్ ఆఫ్ బద్ర్‌కు గుర్తుగా 313 పేరు పెట్టుకున్నారు. వీరిలో అత్యధిక మంది టిక్‌టాక్‌నే వినియోగిస్తారు' అని చెప్పారు.ఇక స్కైన్యూస్ భారత్ దాడికి ముందు, తర్వాత ఇక్కడ లొకేషన్లను విశ్లేషించగా.. యూజర్ పేరులో 313 అని ఉన్న ఒకరు భారత్ దాడి తర్వాత దెబ్బతిన్న భవనాల వీడియోను పోస్టు చేశారు. మురీద్కేలోని ఈ ఉగ్రవాదులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ.. రిక్రూట్‌మెంట్‌కు మరింత మందిని ఆకర్షిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంశంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్‌ను స్కైన్యూస్ ప్రశ్నించగా.. ఈ టిక్‌టాక్ వీడియోలను నమ్మకమైన ఆధారాలుగా పరిగణిస్తానంటే లక్షలు చూపిస్తానంటూ మాట్లాడారు.

కాశ్మీర్‌పై ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదు

ఈ నెల 7న పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన తర్వాత పాక్ డీజీఎంవోకు సమాచారం ఇచ్చామని, చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పామని వెల్లడించాయి. అయితే, పాకిస్థాన్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదని తెలిపాయి. ఇరుదేశాల మధ్య కాల్పులు తీవ్ర స్థాయికి చేరుకున్న తర్వాత మే 10న పాకిస్థాన్ నుంచి చర్చలకు ప్రతిపాదన వచ్చినట్లు పేర్కొన్నాయి. భారత్ జరిపిన దాడుల్లో రహిమ్యార్‌ఖాన్ వైమానిక స్థావరం రన్‌వే నేలమట్టమైనట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిలేదని స్పష్టం చేశాయి. " బహావల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేశాం. పాకిస్థాన్‌ను బలంగా, భారీగా, అత్యంత సుదూర ప్రాంతాల్లో దెబ్బతీశాం. అటువైపు నుంచి బుల్లెట్లతో దాడి చేస్తే.. మనం బాంబులతో సమాధానం ఇచ్చాం. బహవల్‌పూర్‌తోపాటు మురుద్కే, ముజఫర్‌బాద్ ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశాం. మే 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్ని వర్షం కురిపించాం. మొత్తం 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశాం" అని ప్రభుత్వ వర్గాలు మీడియాకు వెల్లడించాయి.. "కశ్మీర్ విషయంలో భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పంగించడం మినహా మరో విషయం లేదు. అంతకుమించి మాట్లాడేది లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడుతాం. మరో విషయంపై మాట్లాడే ఉద్దేశం

మాకు లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు. ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరమూ లేదు" అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ మూడు లక్ష్యాలను సాధించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సైనికంగా, రాజకీయంగా, మానసికంగా పాక్‌ను దెబ్బకొట్టినట్లు తెలిపాయి. ప్రతి రౌండ్‌లోనూ పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారిందని, భారత్ చేతిలో ఓటమి పాలైందని వెల్లడించింది. పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేయగా.. ఇక పోరాడలేమని దాయాది దేశం తెలుసుకున్నట్లు పేర్కొన్నాయి.

పాక్ విమానాలను కూల్చేశాం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ను పాక్ సైన్యం దాటలేదని భారత త్రివిధ దళాలు స్పష్టంచేశాయి. ఆపరేషన్ సమయంలో లక్ష్యాలను ఛేదించడంపైనే గురి ఉంటుందని పేర్కొన్నాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారని, అమర జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరచిపోదని తెలిపాయి.ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన కొన్ని అత్యాధునిక విమానాలను కూల్చేశామని ఎయిర్ మార్షల్ ఏకే భారతీ వెల్లడించారు. భారత యుద్ధ విమానాలను పాకిస్థాన్ నిర్బంధించినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. భారత పైలట్లందరూ సురక్షితంగా తిరిగి వచ్చారని చెప్పారు. మన స్థావరాలపై దాడి చేసేందుకు వారు చేసిన ప్రయత్నాలను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని అన్నారు.

సంసిద్ధంగా నౌకాదళం

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళం కూడా పూర్తి సంసిద్ధతతో ఉందని ఇండియన్ నేవీ వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత వెంటనే అప్రమత్తమయ్యామని, బలగాలతో పాటు సబ్‌మెరైన్లను సముద్రంలో మోహరించామని తెలిపింది. అవసరమైతే కరాచీ పోర్టు కూడా తమ లక్ష్యాల్లో ఒకటని పేర్కొంది. తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో పాకిస్థాన్ నేవీ, ఎయిర్‌బేస్‌లపై నిఘా పెట్టామని.. ఈసారి పాక్ ఉల్లంఘనలకు పాల్పడితే భారత్ ఏం చేయనుందో వారికి తెలుసునని వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ పేర్కొన్నారు.

ట్రంప్ కొత్తపల్లవి

ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని చంపేశారు. దాంతో భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసింది. ఆ తర్వాత ప్రతీకారం అంటూ పాకిస్తాన్.. భారత్‌పై సైనిక చర్యకు దిగింది. సరిహద్దు వెంబడి కాల్పులకు తెగబడుతూ, సాధారణ పౌరులు, సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడికి తెగబడింది. భారత్ డిఫెన్స్ సిస్టమ్ వాటిని అడ్డుకోవడంతో పాటు పాక్‌పై ప్రతిదాడి చేసింది. దీంతో రెండు దేశాల మధ్య యుద్ధ వాతావరణం చోటు చేసుకుంది. పరిస్థితి మరింత తీవ్రమవుతున్న క్రమంలో అమెరికా జోక్యం చేసుకొని కాల్పుల విరమణకు రెండు దేశాలను ఒప్పించింది.

ఉగ్రవాదులు ఏమూల దాక్కున్నా సరే.. తప్పించుకోలేరని చూపించాం: హిమంత

గువాహటి: ఉగ్రవాదులు ఏమూలన దాక్కున్నా సరే.. వారిని గుర్తించి నిర్మూలిస్తామని 'ఆపరేషన్ సిందూర్ ద్వారా 'న్యూ ఇండియా' రుజువు చేసిందని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ(న్నారు.ఈ ఆపరేషన్ సమయంలో పాకిస్థాన్ ఉగ్రవాదులను నిర్మూలించి, వారి స్థావరాల్ని దెబ్బతీసిన భారత సైన్యం పరాక్రమాన్ని ఆయన ప్రశంసించారు.ఆదివారం సాయంత్రం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) మీడియా సమావేశాన్ని వీక్షించిన అనంతరం సీఎం స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీకి, పాక్ దుశ్చర్యలను వీరోచితంగా తిప్పికొట్టిన సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా 100 మందికి పైగా పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, కీలక సైనిక కేంద్రాలు, ఉగ్రవాదుల స్థావరాల్ని నేల మట్టం చేసి తిరుగులేని ఆధారాలతో నిరూపించిందన్నారు. అన్నింటికన్నా మించి ఉగ్రవాదులను ట్రాక్ చేసి.. వారు ఎక్కడ దాక్కున్నా సరే వదిలిపెట్టబోమనే బలమైన సందేశాన్ని 'నవ భారత్' ఇచ్చిందని పేర్కొన్నారు.

వేదికపైనే సొమ్మసిల్లి పడిపోయిన విశాల్

అందాల పోటీల వేదికపై నటుడు విశాల్ స్పృహ కోల్పోయారు. తమిళనాడులోని విల్లుపురంలో ఆదివారం నిర్వహించిన ట్రాన్స్‌జెండర్ అందాల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైకి వచ్చిన విశాల్ అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయారు. సంబంధిత దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

కాల్పుల విరమణపై ట్రంప్ పెత్తనమేంటి?

అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిని కోరారు. భవిష్యత్తులో రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి.. భారత ప్రజల సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశంగా మారుతుందని రాహుల్ అన్నారు. కాల్పుల విరమణ నిర్ణయం తీసుకోవడానికి భారత్‌కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చిందని ప్రశ్నించారు.ప్రతిపక్ష నేతగా ఖర్గే కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రత్యేక సమావేశంలో తమకు తెలియజేయాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ..పీవోకే ఎప్పటికీ భారత్ భూభాగమే అని..దానిని మనం వెనక్కి తీసుకోవాలని అన్నారు. 1994 ఫిబ్రవరి 22న దేశంలో జరిగిన ఉగ్రదాడుల అనంతరం దేశంలో జమ్మూ కశ్మీర్ అంతర్భాగంగా ఉంటుందని లోక్‌సభ, రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించాయని సచిన్ గుర్తు చేశారు. అందులో జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో పాక్ అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను తప్పనిసరిగా వదిలి పెట్టాలని డిమాండ్ చేశామన్నారు. ఈ తీర్మానాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కాల్పుల విరమణ గురించి పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో ఫోన్‌లో మాట్లాడారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తోనూ రూబియో ఫోన్‌లో మాట్లాడారు. భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఆచితూచి వ్యవహరించిందని, అదే తీరును కొనసాగిస్తుందని జైశంకర్ ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఇరుదేశాలతో తాము జరిపిన దౌత్య చర్చల వల్ల భారత్- పాక్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత భారత్ ఈ విషయాన్ని వెల్లడించింది.

ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదిలిస్తుంది

ఉక్రెయిన్‌తో మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి కీవ్‌తో ప్రత్యక్ష చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఈ చర్చలు ఇరుదేశాల్లో శాశ్వత శాంతిని నెలకొల్పేలా ఉండాలన్నారు. ఈ మేరకు ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల చర్చలకు ఆయన ప్రతిపాదించారు. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా కీవ్ ప్రత్యక్ష చర్చలను తిరిగి ప్రారంభించాలని తాము కోరుతున్నట్లు పుతిన్ ఆదివారం ప్రకటించారు.గురువారం ఇస్తాంబుల్ వేదికగా చర్చలు జరపాలని ఉక్రెయిన్ అధికారులను పుతిన్ కోరారు. ఈ విషయంపై తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో మాట్లాడతానని అన్నారు. ఈ చర్చల ద్వారా పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని, ఈస్టర్ కాల్పుల విరమణ, 'విక్టరీ డే' కాల్పుల విరమణ వంటివి ప్రకటించామని చెప్పారు. అయినప్పటికీ ఆ సమయాల్లో ఉక్రెయిన్ ఈ ఒప్పందాలను ఉల్లంఘించి.. 524 వైమానిక డ్రోన్‌లు, 45 సముద్ర డ్రోన్‌లు, అనేక పాశ్చాత్య క్షిపణులతో రష్యాపై దాడి చేసిందని ఆరోపించారు. తమ సైన్యం కీవ్ దాడులను తిప్పి కొట్టిందని తెలిపారు.కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటే ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం ఆలోచనలను విరమించుకోవాలని, తాము ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాల నుంచి వారి బలగాలను ఉపసంహరించుకోవాలని పుతిన్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో ఇరు దేశాలు సంధి కోసం ముసాయిదా ఒప్పందాన్ని చేసుకున్నాయి. నాటి ఒప్పందం గురించి పుతిన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అప్పట్లో సంధి చర్చలు విరమించుకుంది తాము కాదని..ఉక్రెయిన్ వాటి నుంచి వైదొలిగిందన్నారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు ప్రయత్నాలు చేసినందుకుగాను అమెరికా, భారత్ చైనా, బ్రెజిల్, ఇతర మధ్యప్రాచ్య, ఆఫ్రికన్ దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రయత్నాలను కొనియాడారు.కాగా..రష్యాతో పూర్తిస్థాయి, బేషరతు కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్, దాని మిత్రపక్ష దేశాలు శనివారం వెల్లడించాయి. సోమవారం నుంచి కనీసం 30 రోజులు కాల్పుల విరమణను పాటించేలా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, బ్రిటన్ దేశాల అధినేతలు సమావేశమై చర్చలు జరిపారు. సంధికి అంగీకరించి, శాంతి చర్చల ప్రక్రియ ప్రారంభమయ్యేలా రష్యాపైనా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ మేరకు నాలుగు దేశాల నేతలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

శ్రీలంకలో ఘోర ప్రమాదం

కోట్మాలే ప్రాంతంలో బస్సు అదుపు తప్పి లోయలో పడినట్లు సమాచారం. దుర్ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు ప్రమాదానికి గల కారణాల్ని అన్వేషిస్తున్నారు.

చర్చలకు సిద్ధం

మరోవైపు కీవ్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటిం చారు. ఈ మేరకు ఇస్తాంబుల్‌ను చర్చల వేదికగా ప్రకటించారు. ఈ చర్చల ద్వారా పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని, ఈస్టర్ కాల్పుల విరమణ, 'విక్టరీ డే' కాల్పుల విరమణ వంటివి ప్రకటించామని చెప్పారు.

షేక్ హసీనాకు బిగ్ షాక్

నోటిఫికేషన

బిసి చైతన్య వేదిక తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్‌గా వంగ అరుణ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ (జనంసాక్షి) : బిసి చైతన్య వేదిక తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్‌గా వంగ అరుణ్ కుమార్ గౌడ్ నియమించినట్లు బిసి. చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాదులో బిసి సాధికారత సంస్థ భవన్‌లో బిసి చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బిసి చైతన్య వేదిక స్టేట్ ప్రెసిడెంట్ వంగ అరుణ్ కుమార్ గౌడ్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బి.సీ. లను చైతన్య పరచి బలమైన బిసి ఉద్యమం నిర్మిస్తామన్నారు. మన ఉద్యమాల ద్వారనే హక్కులు, ఆత్మ గౌరవం స్వయం పాలన సాధ్యమౌతుందని బిసీలు సామాజికంగా విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలల్లో అభివృద్ధి చెందాలని అందుకోసం ఐఖ్యత ఉద్యమాల ద్వారనే సాధ్యమని ఆయన తెలిపారు. ఇటీవల ఎప్రియల్ 30వ తేదీన కేంద్ర ప్రభుత్వం జనగణనలో బిసి కుల గణన చేస్తామని ప్రకటించడాన్ని బిసి చైతన్య వేదిక స్వాగతిస్తుంది. అలాగే కులగణనకు సంబంధించి స్పష్టమైన రూట్ మ్యాప్ విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య, ఉద్యోగ స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చి పార్లమెంటులో బి.సి.ల కోసం 42% రిజర్వేషన్ చట్టం వెంటనే చేయాలని కోరారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఇ. ఇ.డబ్ల్యూ. . ఎస్. రిజర్వేషన్ తెలంగాణ రాష్ట్రంలో రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కోసంఅసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపించి చేతులు దులుపుకోకుండా 42% రిజర్వేషన్ తోనే స్థానిక సంస్థలలో ఎన్నికలు నిర్వహించాలి, అలాగే ప్రభుత్వ కాంట్రాక్ట్స్ వర్కో కూడా 42% రిజర్వేషన్ బి.సి.లకు చట్టం చేయాలి. కాంగ్రెస్ పార్టి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బి.సి. లకు బడ్జెట్లో 42% నిధులు కేటాయించి, అలాగే అన్ని నామినేటెడ్ పదవులలో బి.సి.లకు 42% ఇచ్చి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సభలలో మహిళలకు 33% రిజర్వేషన్ చట్టం చేసింది. అందులో కూడా బి.సి. మహిళలకు సబెకోటాకావాలని కేంద్ర ప్రభుత్వనాకి డిమాండ్ చేశారు. ఇటీవల మహాత్మ జ్యోతిబా పూలే సినిమా వస్తే సెన్సార్ పేరుతో అడ్డుకోవడం ఆక్షేపనియం, బహుజనులందరు కుటుంబ సమేతంగా మహాత్మ పూలే సినిమాను వీక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బి.సి. చైతన్య వేదిక స్టేట్ ప్రెసిడెంట్ గా నన్ను నియమించిన జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ గారికి ఆయన కృతజ్ఞత తెలిపారు ఈ కార్యక్రమంలో బి.సి. చైతన్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శులు సింధూ నాగేశ్వర రావు యాదవ్, తన్నీరు రమణయ్య, కుడిపుడి ఉమామహేశ్వర రావు, బి.సి. మేధావుల వేదిక నాయకులు అక్కల బాబు గౌడ్, ప్రజా కవి జన జ్వాలా రాధా కృష్ణ, బి.సి.సి.ఇ. కార్యదర్శి ఇంద్రవెల్లి రమేశ్ బి.ఎస్.ఐ. నాయకులుడివివి సత్య నారాయణ, లాలు నాయక్, రేణుక, దీపాదేవి, ధనుజయ చారి, వాసంశెట్టి శ్రీనివాస్,వల్లేపు వెంకటేష్, కొప్పుశెట్టి వెంకటేశ్వర రావు, వీరంకి ఆంజనేయులు గౌడ్, బి.సి. చైతన్య వేదిక నాయకులు ఆంజనేయులు గౌడ్, సోమ భాస్కర్, విద్యార్థి నాయకులు ఎలగాని వెంకటేష్, రాజశేఖర్ గౌడ్, సురేష్ గౌడ్, మరియు తదీతరులు పాల్గొన్నారు.

నెమ్మదిగా సరస్వతి పుష్కరాల పనులు

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 11 (జనంసాక్షి) : పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం కాళేశ్వరంలో విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జ్ఞానతీర్థం, నదిలో భక్తుల స్నానమాచరించు ప్రదేశం, టెంట్ సిటీ తదితర అంశాలను పరిశీలించారు. అనతరం టెంట్ సిటీలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేయు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని అధికారులు మీరే జవాబు చెప్పాలని అన్నారు. గ్రామం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలని 12 రోజులు పండుగ వాతావరణం చేయాలని సూచించారు. సరస్వతి మాత విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరణ చేయాలని తెలిపారు. పిండ ప్రధాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్ళడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటుతో పాటు క్వియర్ మాట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నదిలో 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు నాటుపడవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాలు సందర్భంగా మొట్టమొదటిసారిగా కాళేశ్వరం లో టెంట్ సిటి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమాలు సజావుగా, సక్రమంగా పకడ్బందీగా జరిగేందుకు మినిట్ టు మినిట్ కార్యక్రమం తయారు చేయాలని సూచించారు. హారతి కార్యక్రమం పర్యవేక్షణకు దేవాదాయ శాఖ నుండి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి వస్తున్నారని అలాగే తదుపరి రోజుల్లో గవర్నర్, రాష్ట్ర మంత్రులు వచ్చే ఆవకాశం ఉన్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. మహదేవ పూర్ నుండి వీధిదీపాలు ఏర్పాటుతో పాటు డివైడర్లు మధ్యలో స్ట్రిప్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ కు సూచించారు. రహదారులకు మరమ్మత్తులు నిర్వహించాలని ఎక్కడ గుంతలు ఉండొద్దని ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద తాత్కాలిక లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం చాలా ముఖ్యమని పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశుభ్రత పాటించేందుకు ప్రతి 30 నిమిషాలకు పరిశుభ్రం చేసే విధంగా పర్యవేక్షకులను నియమించాలని ఆయన ఆదేశించారు. పనులు పర్యవేక్షణకు నియమించిన నోడల్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పనులలో నాణ్యత పాటించాలని నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని మంత్రి కాంట్రాక్టర్లు ను హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు స్థానికంగా ఉండి పనులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే తదుపరి చర్యలకు ఆరు 125 కేవీ జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. దేవాలయం, 100 గదుల సత్రంలో జనరేటర్లు ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. భక్తులకు ప్రతి రోజు అన్నదానం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. భక్తులు నదిలోకి వెళ్ళు సందర్భంలో ఎండకు కాళ్లు కాలకుండా మ్యాట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రంగులు వేసేందుకు ప్రత్యేకంగా జె ఎన్ టి యు నుంచి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రవాణా సౌకర్యం కల్పనకు క్యాబ్స్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ ప్లాన్ ప్రక్కగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌కు భారీగా తెలంగాణ వాసులు

- మరో వంద మంది వచ్చే ఛాన్స్?

న్యూఢిల్లీ (జనంసాక్షి) : భారత్-పాక్ యుద్ధం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణకు చెందిన విద్యార్థులు, పౌరులు పెద్ద సంఖ్యలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటి వరకు 86 మంది తెలంగాణవాసులు ఢిల్లీ తెలంగాణ భవన్‌కు చేరుకోగా, వారిలో 26 మందిని రాష్ట్రానికి వెళ్ళేందుకు అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించి స్వగ్రామాలకు పంపించారు. ఇంకా దాదాపు 100 మందికిపైగా తెలంగాణ భవన్‌కు చేరుకునే అవకాశం ఉందన్న సమాచారం మేరకు అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాట్లను రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ ఆదివారం నాడు స్వయంగా సమీక్షించారు. తెలంగాణభవన్ సిబ్బందితో కలిసి భోజన వసతి, వైద్య, రవాణా తదితర ఏర్పాట్లను పరిశీలిస్తూ తగిన సూచనలు చేశారు. ఈ సమయంలో తెలంగాణ భవన్‌కు చేరుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అన్ని విధాల సహాయాన్ని అందిచనుందని డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

మత్స్యకారులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ చేపల పెంపక కేంద్రాన్ని సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని వృత్తిదారుల సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడలోగల చేపల పెంపకం కేంద్రం సుమారు 60 ఏండ్ల క్రితం నిర్మించినప్పటికీ దానిని పట్టించుకోవటంలో విఫలమైన కాంగ్రెస్ నేడు పూర్తిగా కూల్చివేయటం దారుణమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 32 చేపల పెంపక కేంద్రాలను పూర్తిగా నిరూపయోగంగా ఉంచటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని చేపల పెంపక కేంద్రాలను శిథిలావస్థలో ఉంచి ఆంధ్రా నుంచి ఎగుమతి చేసుకోవటం కాంగ్రెస్ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుందని విమర్శించారు. మత్స్యకారులు తమ సొసైటీల ద్వారా చేపపిల్లలు పెంచుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. చేపల పెంపకానికి సంబంధించిన డబ్బులను నేరుగా సొసైటీల ఖాతాల్లో జమచేయాలని కోరారు. ఈనెల 15న మత్స్యకారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ధర్నాకు సీపీఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, జగన్, మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, నాయకులు గోరెంకల నర్సింహ, చెనమోని శంకర్, సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, మత్స్యకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏడు పదుల వయస్సులో..

- వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖైరతాబాద్, మే 11 (జనంసాక్షి) : అందరు విశ్రాంత ఉద్యోగులు.. ఉపాధ్యాయులు.. వ్యాపారులే. ఏడు పదుల వయస్సులో ఒక చోటకు చేరారు. మనవళ్లు.. మనవరాండ్లతో వచ్చిన ఆ పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆదివారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో నల్గొండ జిల్లాలోని మల్టీపర్పస్ హైస్కూల్ 1970 బ్యాచ్‌కు చెందిన 12వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా సాగింది. సుమారు 55 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారందరూ ఆరు పదుల వయస్సు దాటిన వారే. వయసును మరిచి అరేయ్ ఎలా ఉన్నావురా అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్నప్పటి రోజులు, గురువులు, వారి బోధనలను గుర్తు చేసుకున్నారు. అప్పటి చదువులకు ఇప్పటికీ చాలా తేడా ఉందని, నాడు గురువులను గౌరవించుకునేవారంటూ విశ్రాంత పోస్టల్ ఉద్యోగి వెంకన్న గుర్తు చేశారు. నాటి గురువులు నేర్పిన చదువు, సంస్కారం వల్లే తాను ఉన్నత స్థానాలకు చేరకున్నానని మరో పూర్వ విద్యార్థి వినోద్ అన్నారు. ఏ సెక్షన్ నుంచి జీ సెక్షన్ వరకు సుమారు 400 మంది విద్యార్థులుండే వారని, ప్రస్తుతం 81 మంది మాత్రమే వచ్చారంటూ వ్యాపారి మంచుకొండ ప్రకాశం విచారం వ్యక్తం చేశారు. వెంటనే ఓ వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేసి ప్రతి ఏడాది ఈ వేడుకను నిర్వహించకుండామంటూ తీర్మానించారు.

మహేశ్‌ను ఇండియాకు రప్పించే బాధ్యత తీసుకుంటా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల (జనంసాక్షి) : బాధ పడుకుర్రి.. మహేశ్‌ను ఇండియాకు రప్పించి.. అన్ని విధాలా ఆదుకొనే బాధ్యత నేను తీసుకుంటా అని అతని కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. జీవనోపాధి కోసం గల్ఫ్ దేశం పోయి, అక్కడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మండేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మంద మహేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. సౌదీ అరేబియా దేశంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడి, అధైర్య పడొద్దని, అండగా నేనుంటా అంటూ మహేశ్‌కు ధైర్యం చెప్పారు. మనోళ్ళను పంపించి నీకు అండగా ఉండే విధంగా అన్ని రకాలుగా చూస్తానని మహేశ్‌కు కేటీఆర్ తెలిపారు. సొంత ఖర్చులతో ఇండియాకు రప్పిస్తానని మహేశ్‌కు భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చుల పరంగా మహేశ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోడానికి ముందుంటానని హామీ ఇచ్చారు కేటీఆర్.

అమ్మ రుణం కోటి జన్మలెత్తిన తీర్చలేనిది

- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కడ్తాల్ (జనంసాక్షి): ప్రపంచంలో అమ్మలేని గ్రామం, దేశం లేదని, సృష్టికి మూలం అమ్మ అని మాజీ ఐపీయస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్ అన్నారు. ఆదివారం మాతృదినోత్సవాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ అధ్యక్షతన , ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కడ్తాల్ పట్టణంలోని అంగన్‌వాడీ సబ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గర్భిణులకు న్యూట్రీషన్ , మెడికల్ కిట్లను తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అమ్మతనం మాటాల్లో వర్ణించలేమని, అమ్మ ప్రేమ అక్షరాల్లో రాయలేమని అన్నారు. ఈ సృష్టిలో తియ్యని పదం అమ్మ . వెలకట్టలేనిది అమ్మ ప్రేమ అని పేర్కొన్నారు. అమ్మ చూపే అప్యాయతలో ఇంకేవారు సాటిరారన్నారు. జీవన ప్రయాణంలో అనునిత్యం దీవిస్తూ ప్రేమించే మా అమ్మ అని వర్ణించారు. ప్రస్తుత తరుణంలో యువత చెడు ఆలవాట్లకు బానిసై అమ్మతనాన్ని మరిచి కొంతపుంతలు తొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఆ దైవమే రక్షించాలని అన్నారు. భారతదేశం సంస్కృతీ సాంప్రదాయలకు నిలయమని, మాతృమూర్తి గొప్పతనం ఆనాడే సమాజానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా 240 గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సతీమణి మంజుల, కుమారుడు , కోడలు అనిల్, భావన, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, సీనియర్ నాయకులు చంద్రమౌళి, లచ్చిరాం, నర్సింహ్మ, సాయిలు, లక్ష్మీనర్సింహ్మ రెడ్డి, జ్యోతయ్య, గోపాల్, గంప వెంకటేష్, శంకర్, కొమ్ము శ్రీనివాస్, గోపాల్, సురేష్, శ్రీకాంత్, గణేష్, మహేష్, రంగయ్య, రమేష్, సాయిలు, జంగయ్య, రామకృష్ణ, యాదయ్య, రమేష్, మహేష్, లాయక్ అలీ, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలసంస్కార్‌తో విద్యార్థుల్లో నైతిక విలువలు

పర్వతగిరి, మే11 (జనం సాక్షి) : పర్వతగిరి మండలంలోని కల్లెడలో శ్రీ కొలను వెంకటేశ్వర స్వామి సన్నిధిలో 15 రోజుల నుండి నిర్వహిస్తున్న బాల సంస్కార్ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ వాస్తవ్యులు సౌమిత్ర లక్ష్మణాచార్యులు తొర్రూరు వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు వందేమాతరం రవీందర్రావు గారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. సోమిత్ర లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడానికి బాల సంస్కార్ కార్యక్రమాన్ని పర్వతగిరి శ్రీ రామకృష్ణ సేవా సమితి మరియు సహృదయ సేవాసమితి కల్లెడ కొలను వెంకటేశ్వర స్వామి సేవక బృందం ఆలయ నిర్వాహక బృందం ఆధ్వర్యంలో గత 15 రోజుల నుండి నిర్వహిస్తుండడం గమనార్హం అని అన్నారు. విద్యార్థులలో త్రికరణశుద్ధిని పెంపొందించుకొని అన్ని రంగాలలో ముందు ఉండాలని సూచించారు. దేశభక్తి ఏకాగ్రతను పెంపొందించుకొని విధంగా తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు నీతి కథలతో పాటు దేశభక్తి నినాదాలను చేయించారు. ఆ తదుపరి వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు మాట్లాడుతూ మొక్కై వంగనిది మానై వంగునా అని అన్నారు .తల్లిదండ్రుల కు విద్యార్థులచే పాదాభివందనాన్ని చేయించారు . మనిషి జీవనాన్ని కొనసాగించడం అంటే లేనప్పుడు కూడా వారి గురించి మాట్లాడినప్పుడే నిజమైన జీవితాన్ని అనుభవించినట్లుని చెప్పారు స్వామి వివేకానంద గూర్చి చెబుతూ 1500 సంవత్సరాలకు సరిపడా జ్ఞానం ని అందించినట్లు గుర్తు చేశారు. వారి బ్రతికి లేకపోయినా వారి జీవితం అందరికీ ఆదర్శనీయం ప్రతి ఒక్కరూ వివేకనందని ఆదర్శ జీవితాన్ని పఠించాలని సూచించారు శ్రీ రామకృష్ణ ప్రభ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లే విధంగా చూడాలని సేవాసమితి సభ్యులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఎఫ్ కళాశాల ప్రిన్సిపల్ జనార్దన్ శ్రీ రామకృష్ణ సేవాసమితి బాధ్యులు చింతపట్ల సురేందర్రావు చిదురాల వేణుగోపాల్ జూపూడి రఘు కూడా అతిథులుగా ఉన్నారు. పాల సంస్కార్ ప్రోగ్రాం ని విజయవంతం చేయడానికి సహకరించిన సహృదయ సేవాసమితి సభ్యులు ప్రాణా ప్రతాప్ అనిల్ వినీత్ కొలను వెంకటేశ్వర స్వామి నిర్వాహక బృందం అజయ్ పర్వతగిరి శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు వడ్లకొండ దయాకర్ సారంగపాణి భాస్కర్ చిదురాల చంద్రశేఖర్ ప్రేమ్ జంగప్రసాద్ విష్ణు దేవేందర్ రామకృష్ణ తదితరులు విజయవంతం చేయడంలో కీలకపాత్రను పోషించారు.

కరాచీ బేకరీలు భారత బిడ్డలవే..

- బీజేపీ చిల్లర పనులు మానుకోవాలి : మంత్రి సీతక్క

హైదరాబాద్ (జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కరాచీ బేకరీపై భజరంగ్‌దళ్ నాయకులు దాడులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ దాడిని మంత్రి సీతక్క ఖండించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కరాచీ బేకరీలు ఈ దేశ బిడ్డలవి అని అన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సొంత రాష్ట్రమైన గుజరాత్ సహా అనేక ప్రాంతాల్లో కరాచీ బేకరీలు ఉన్నాయని గుర్తుచేశారు. కరాచీ బేకరీలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రజల మధ్య విభజన తీసుకొచ్చే చిల్లర పనులు బీజేపీ మానుకోవాలని సీతక్క హితవు పలికారు. కాగా, జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ - పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. భారత్ - పాక్ మధ్య యుద్ధం జరుగుతోన్న వేళ పాక్‌కు సంబంధించిన వ్యాపారాలు ఏవీ ఇక్కడ ఉండొద్దని బీజేపీ, భజరంగ్‌దళ్ నేతలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్కడికక్కడ కరాచీ బేకరీలపై దాడులకు పాల్పడుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12 మే 2025
తెలంగాణ

యుద్ధం ముగిసింది- రాజకీయ చర్చలే తరువాయి

అమెరికా ప్రపంచ పెద్దన్న పాత్రను పాకిస్తాన్ భారతదేశాల మధ్య తలెత్తిన యుద్ధ వాతావరణం నివారించుటకు పెద్దన్న పాత్ర పోషించిందని చెప్పాలి. యుద్ధం ఇరుదేశాలకు నష్టమే. ముఖ్యంగా భారతదేశం శాంతియుత విధానాన్ని అనుసరించే దేశంగా పేరు గలది. కాబట్టి యుద్ధానికి సన్నతమైన భారతదేశం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచనల మేరకు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించిందని చెప్పాలి. ఏది ఏమైనా ఇరుదేశాలు రాజకీయ చర్చలు జరపడం శ్రేయస్కరమని భావిస్తాం.

భారతదేశం పాకిస్తాన్ మధ్య మే 7వ తేదీన ప్రారంభమైన యుద్ధం 11వ తేదీ 5 గంటలకు ముగిసింది. పాకిస్తాన్ తన శక్తిని అంచనా వేసుకోకుండా చరిత్ర నుండి గుణపాటాలు నేర్చుకోకుండా భారతదేశంపై కపింపు చర్యలకు పాల్పడింది. భారతదేశం ఎప్పుడు సమన్వయం శాంతి యుత వాతావరణంలో జాతీయ భావాలకు ప్రపంచ నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్న దేశం ఒక భారతదేశం అనే చెప్పాలి. అయితే పాకిస్తాన్ నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కాల్పులు జరపడం అంతేకాకుండా సరిహద్దు గ్రామాల పైన విచక్షణారహితంగా కాల్పులు జరిపి అమాయక ప్రజలను భారత సైన్యంపై కాల్పులు జరిపి కొంతమందిని పొట్టన పెట్టుకున్న విషయం తెలిసిందే. పాకిస్తాన్ అనుసరిస్తున్న విధానం భారత దేశంలోని ప్రజలందరికీ నరనరానా నెత్తురు ఉడుకుతుంది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద శిబిరాలను నిర్వహిస్తూ భారతదేశంపై అమాయక ప్రజలను చంపేసే విధంగా చేపడుతున్న చర్యలు భారతదేశంలోని ప్రతి పౌరుడు ప్రజాస్వామిక వాది తీవ్రంగా ఖండిస్తున్నారు. పాకిస్తాన్ అనుసరిస్తున్న విధానం భారత ప్రజలలో ఐక్యత భావాన్ని పెంపొందించింది అనే చెప్పాలి. 140 కోట్ల జనాభా గలిగిన భారతదేశ ప్రతి పౌరుడు దేశ సమైక్యత భావాన్ని వినిపిస్తున్నారు. ప్రతి వ్యక్తి తమ దేశం కోసం ప్రాణాలు అర్పించడానికి అయిన సిద్ధమైన అని ముందుకొస్తున్నారు. ఇండియా ఆపరేషన్ సింధూర్ పేరుతో మే ఏడో తేదీన పహాల్గం హత్యాకాండ కు నిరసనగా 9 ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసి వంద మంది ఉగ్రవాదులను చంపేసిన సంఘటన భారతీయులందరూ స్వాగతించారు. అమాయకులైన టూరిస్టులపై పాకుపేరేపిత ఉగ్రవాదుల ముఠా దాడి చేసి 26 మందిని పొట్టను పెట్టుకుంది. ఎంతోమంది ఆడవారి నుదుటి సింధూరాన్ని తుడిసి వేసింది. ఇది భరించని భారతీయులు పాకిస్తాన్ పై ప్రతీ కార్య చర్యలు చేపట్టాల్సిందేనని దేశానికి ఇటువంటి గతి పట్టిస్తున్న వ్యవస్థను కూకట్వేలతో పీకి వేయాలని భారత ప్రజలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. పాకిస్తాన్ చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోకుండా భారత్ పై యుద్ధం ప్రకటించడం అవేకమైన చర్యాని అంటున్నారు. తన శక్తిని తాను గుర్తించకపోవడం భారత్ దగ్గర ఉన్న అత్యంత ఆధునికమైన టెక్నాలజీ ఆయుధ సంపత్తి తో పాకిస్తాన్ ను మట్టి కనిపించాలని భావిస్తుంది. భారతదేశంలో ప్రజలందరూ ఒకతాటిపై నిలబడి పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. భారత సైన్యానికి భారత ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నారు. త్రివిధ దళాలు అనుసరిస్తున్న విధానానికి భారత ప్రజలు జేజేలు కొడుతున్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ పూర్తిగా నాశనం కాకముందే రాజనీతిని ప్రదర్శించి రాజకీయ చర్చలకు ముందుకు వస్తే అప్పుడు భారతదేశం ఆలోచిస్తుంది. ఇప్పటికే అనేకసార్లు భారతదేశం పాకిస్తాన్ ను హెచ్చరించిన ఖాతరు చేయలేదని చెప్పవచ్చు. ప్రపంచ ఉగ్రవాద సంస్థల్ని నిర్వహిస్తున్న వ్యక్తుల పైన తగు చర్యలు తీసుకోవాలని భారతీయులు ఎన్నిసార్లు హెచ్చరించిన పట్టించుకోని పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే వచ్చింది. ఏది ఏమైనా భారత్తో పాకిస్తాన్ యుద్ధం చేయడం పాకిస్తాన్ కి తీవ్రంగా నష్టం జరుగుతుంది. ముఖ్యంగా ఆర్థికంగా నష్టపోతుంది ఇప్పటికే పాకిస్తాన్ ప్రజలు కొనుగోలు శక్తి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఇది గమనించి సంధి చర్చలకు ముందుకు వచ్చిందని చెప్పాలి.

భారత్-పాకిస్తాన్ కాల్పుల విరమణ పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలో భారత దళాల బలం కనిపించింది, ఆపరేషన్ సిందూర్ గురించి రాజ్‌నాథ్ చెప్పారు.కాశ్మీర్ లోయలో రాత్రిపూట ఎటువంటి ఉల్లంఘనలు నివేదించబడలేదుబీ భవిష్యత్తులో జరిగే ప్రతి ఉద్రిక్తతకు నిర్ణయాత్మక ప్రతిస్పందన అవసరం అని ప్రభుత్వం చెబుతోంది. 11, 2025న న్యూఢిల్లీలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వర్చువల్‌గా హాజరయ్యారు.

మూడు రోజుల పాటు జరిగిన తీవ్ర సైనిక ఘర్షణల తర్వాత, భారతదేశం, పాకిస్తాన్ "సైనిక చర్య"ను నిలిపివేయడం "కాల్పులు" జరపడం గురించి "అవగాహన" కు చేరుకున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం (మే 10, 2025) ప్రకటించారు. భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య కాల్పులు, సైనిక చర్యలను శనివారం (మే 10, 2025) సాయంత్రం నిలిపివేసినట్లు ప్రకటించిన వెంటనే, జమ్మూ సరిహద్దులోని అనేక ప్రదేశాలలో పాకిస్తాన్ నుండి సరిహద్దు కాల్పులు జరిగాయని సరిహద్దు భద్రతా దళం అధికారి ఒకరు తెలిపారు. "రాత్రి 7.30 గంటల వరకు భారీ కాల్పులు జరిగాయి, దానికి తగిన ప్రతిస్పందన ఇవ్వబడింది" అని అధికారి తెలిపారు.

మే 10, 2025 నాటి భారతదేశం-పాకిస్తాన్ కాల్పులు.

సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం భారతదేశం, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షికంగా అంగీకరించబడిందని, ఈ "అవగాహన" ప్రారంభించడం ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని భారతదేశం ఇటీవల తీసుకున్న అనేక శిక్షాత్మక నిర్ణయాలను ప్రభావితం చేయదని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

పాకిస్తాన్ చేసే ప్రతి దుస్సాహసానికి బలం చేకూరింది, భవిష్యత్తులో జరిగే ప్రతి ఉద్రిక్తత నిర్ణయాత్మక ప్రతిస్పందనను ఆహ్వానిస్తుంది, భారతదేశం , పాకిస్తాన్ తక్షణ "కాల్పుల విరమణ"కు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు సోషల్ మీడియాలో ప్రకటించిన కొద్దిసేపటికే, రెండు దేశాల డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ రెండు వైపులా "అన్ని కాల్పులు , సైనిక చర్యలను నిలిపివేస్తామని" అంగీకరించినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించిన కొద్దిసేపటికే కమోడోర్ రఘు ఆర్. నాయర్ శనివారం ఒక ప్రత్యేక విలేకరుల సమావేశంలో అన్నారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం భారతదేశం యొక్క సైనిక ప్రతిస్పందనను ఎలా అంచనా వేస్తారు? ఆదివారం ఉదయం చిన్న సైరన్ మోగిన తర్వాత పౌరులు సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించవచ్చని పంజాబ్ అమృత్‌సర్ డిసి తెలిపారు.

ప్రత్యక్ష నవీకరణల కోసం ఇక్కడ అనుసరించండి:

ఆపరేషన్లు ఇంకా కొనసాగుతున్నాయి, ధృవీకరించని సమాచారం యొక్క ఊహాగానాలు, వ్యాప్తికి దూరంగా భారత వైమానిక దళం కాశ్మీర్ లోయలో రాత్రిపూట కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని అమృత్‌సర్ విమానాశ్రయం ఏసిపి తెలిపారు. పహల్గామ్ దాడిపై చర్చించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని రాహుల్, ఖర్గే డిమాండ్ చేశారు

పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్.

అంతకుముందు రోజు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "కాల్పుల విరమణ" సాధించడంలో భారతదేశం, పాకిస్తాన్ చూపిన "బలమైన, అచంచ లమైన శక్తివంతమైన" నాయకత్వాన్ని ప్రశంసించారు. జమ్మూ మరియు కాశ్మీర్ సమస్యపై, ట్రంప్ మాట్లాడుతూ, 'వెయ్యి సంవత్సరాల' తర్వాత, కాశ్మీర్ విషయంలో ఒక పరిష్కారం లభిస్తుందో లేదో చూడటానికి నేను మీతో (భారతదేశం ,పాకిస్తాన్) కలిసి పని చేస్తాను" అని అన్నారు.శనివారం నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారతదేశం, పాకిస్తాన్ "ద్వైపాక్షిక అవగాహనహొకుదుర్చుకున్నాయిహొఅయితే, భారతదేశం "కాల్పుల విరమణ" ప్రకటించిన కొన్ని గంటల తర్వాత భారతదేశంలోని కొన్ని ప్రాంతా ల్లో డ్రోన్లు కనిపించడంతో పాకిస్తాన్ "అవగాహన"ను ఉల్లంఘించిందని భారతదేశం ఆరోపించింది.

కాల్పుల విరమణ లేదా 'ద్వైపాక్షిక అవగాహన'

భారతదేశం, పాకిస్తాన్ మధ్య వివాదం తీవ్రతరం అవుతున్నట్లు ప్రకటించేటప్పుడు భారతదేశం "కాల్పుల విరమణ" అనే పదాన్ని ఉపయోగించలేదు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శనివారం మాట్లాడుతూ, "కాల్పులను నిలిపివేయడం, సైనిక చర్యపై భారతదేశం పాకిస్తాన్ ఈ రోజు ఒక అవగాహనను కుదుర్చుకున్నాయి" అని అన్నారు.భారతదేశం, పాకిస్తాన్ మధ్య శత్రుత్వాలను నిలిపివేయడం అనేది యుద్ధం కాదని, అది "కాల్పుల విరమణ" కాదని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ వివరించారు. కాల్పుల విరమణ అంటే ప్రతి వైపు సైనిక చర్యలను నిలిపివేయడానికి, తరచుగా మూడవ పక్షం మధ్యవర్తిత్వం కారణంగా కాల్పులను నిలిపివేయడానికి అంగీకరించే పరిస్థితి."దేశంలోని సామాన్య ప్రజల జీవితాలు, ఆస్తుల భద్రత మనందరి బాధ్యత. భద్రత, సేవ మా ప్రధాన బాధ్యతలు. అందువల్ల, పౌర రక్షణ సంస్థలలో స్వచ్ఛంద సేవకులుగా చేరాలని నేను అందరు ప్రజలకు, ముఖ్యంగా యువతకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఒక వీడియో సందేశంలో అన్నారు.

ఇండియా పాకిస్తాన్ కాల్పుల విరమణ ప్రత్యక్ష ప్రసారం: కాంగ్రెస్ నాయకుడు వి హనుమంత రావు మాట్లాడుతూ, పాకిస్తాన్ మళ్ళీ భారతదేశంపై దాడి చేయడం అంటే ఆ దేశం "సంధిపై ఆసక్తి చూపడం లేదు" అని అన్నారు.

3.2025 ఏప్రిల్ 23న, భారతదేశం,పాకిస్తాన్ మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది ఇది జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన 2025 పహల్గామ్ దాడి ,25మంది హిందూ పర్యాటకులు, ఒక క్రైస్తవ పర్యాటకుడు , ఒక స్థానిక ముస్లింతో సహా 27 మంది మృతి చెందడంతో పాటు 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడికి రెసిస్టెన్స్ ఫ్రంట్ మొదట బాధ్యత వహించింది. భారతదేశం పాకిస్తాన్ మధ్య ఏప్రిల్ 24న ప్రారంభమైన నియంత్రణ రేఖ (ఎల్వోసి) వెంబడి సాయుధ ఘర్షణలు జరిగాయని , ఇది రెండు అణ్వాయుధ పొరుగు దేశాల మధ్య మరింత తీవ్రమవుతుందనే భయాలను పెంచింది.భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య జరిగిన ఒప్పందం తర్వాత 2025 మే 10, నుండి కాల్పుల విరమణ ప్రకటించబడింది. 2025 మే 7న, భారతదేశం పాకిస్తాన్‌పై క్షిపణి దాడులను ప్రారంభించింది, దీనికి ఆపరేషన్ సిందూర్ అనే కోడ్‌నేమ్ ఉంది. భారతదేశం ప్రకారం, క్షిపణి దాడులు జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా ఉగ్రవాద గ్రూపులను లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్తాన్ ప్రకారం, భారత దాడులు మసీదులు సహా పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నాయి, దీని వలన 31 మంది పాకిస్తానీ పౌరులు మరణించారు. ప్రతిగా, పాకిస్తాన్ వారు అనేక భారతీయ జెట్‌లను కూల్చివేసి, భారత మౌలిక సదుపాయాలను దెబ్బతీశారని తెలిపింది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

జయహో నాయకా..!

జోహారు జోహారు నాయకా..
జయహో జయహో మురళీ నాయకా..
జన్మ భూమికై మీది ప్రాణార్పణం....
ధీరత్వానికి అదే అంకురార్పణం....
మీ శరీరానికే కదా మరణం ...
మీ ఆత్మ సదా వెలుగుల ప్రసరణం ....
ఉరకలెత్తించే మీ రుధిర ధారణం..
నేటి యువతకయ్యే రణ సింధూరం..
దేశ జనతకూ అదే నిత్య ప్రేరణం..
భారతావని.. మదికీ సదా స్మరణం ..
ఆసేతు భారతం జనగణమనమంటుందీ...
మీ శౌర్యం మ్రోగే ఘనఘనఘన గంటందీ....
పాకీ ముష్కరుల గుండె అదిరి చెదిరె
భలభలమని..
నిప్పు ఖనికలై మీరు ఎగసినారు ఫెళఫెళమని...
తెలుగు వారి సూర్య పుత్ర మీరెలే ..
మిము కన్న మాతృభూమి ప్రాణ ధారలే ....
జన జాగృత వీర జవాన్మీరయా...
జయ భారత స్థైర్య హవా మీరయా...
భరతమాత ముద్దు బిడ్డలేనయా..
మాతృభూమి ఋణం తీర్చినారయా..
మరువలేము మేము మీ త్యాగమూ...
సదా కీర్తి శిఖరమే మీ యాగమూ...

(పాకీ ముష్కరులతో యుద్ధంలో అమరులైన మురళీ నాయక్ సహచర జవానులకు వినమ్ర కవితాంజలి..)

పాల్వంచ హరికిషన్
రామన్నపేట
9502451780

అసహనంతో అనర్థాలు

మనిషికి కోపం
అసహనం ఆవరిస్తే
అక్రోశం ఆందోళన
ముంచెత్తుతుంది
అసహనానికి
గురౌతే పరిస్థితులు
మారుతాయను
కోవడం భ్రమ
రోడ్డుపై ట్రాఫిక్‌లో
చిక్కుకున్న మనం
అరిచినంత
మాత్రాన
వాహనాలు వేగంగా
ముందుకు కదలవు
పదే పదే తిట్టడం
వల్ల మన కుటుంబ
సభ్యుల ప్రవర్తన
మారదుజి
గృహంలో శాంతి
లోపిస్తుంది
ప్రేమ అనురాగాలు
బలహీనమౌతాయి
మనం కోపం వ్యక్తం
చేసినంత మాత్రాన
టేకాఫ్ జరుగదు
అనవసరంగా
వాదనకు దిగినా
అసహనానికి గురైనా
ప్రయోజనం శూన్యం
ప్రశాంతంగా ఉందాం
ప్రత్యామ్నాయ
పరిష్కార మార్గాలపై
దృష్టి పెడుదాం
నీతి నిజాయితీగా
ఉందాం
ఇచ్చిన మాట
నిలుపుకుందాం
విశ్వసనీయతను
పెంచుదాం
ప్రతి విషయానికి
విశ్వసనీయత
తగ్గుతుంది
విమానం
రైలు ఆలస్యమైనపుడు
అతిగా స్పందించ
వద్దు
మానసిక ఆరోగ్యం
బాగుండాలంటే
కొన్ని విషయాలను
పట్టించుకోకూడదు
ఇతరుల వ్యక్తి గత
విషయాల్లో జోక్యం
వద్దు
మారని వ్యక్తులను
మార్చాలని
ప్రయత్నించడం
మన అవివేకతకు
అద్దం పడుతుంది
ఆధ్యాత్మిక చింతన
ఆందోళన పై అదుపు
ఆరోగ్య జీవనశైలికి
మలుపు
ఆనందానికి
మేలు కొలుపు

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు, తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్, 9440245771

ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం ఇదే

యుద్ధం కాదు, ప్రజల సంఘీభావం, సామాజిక సామరస్యం ఉగ్రవాదాన్ని ఓడించగలవు. 2025 మే 8న జరిగిన అఖిల పక్ష సమావేశంలో, ప్రభుత్వం తన "తీవ్రతరం కాని" సైనిక దాడి యొక్క "ఉద్దేశ్యం మరియు లక్ష్యాలను" నిస్సందేహంగా సాధించినట్లు ప్రకటించింది. ప్రభుత్వానికి "పరిస్థితిని తీవ్రతరం చేయడంలో ఆసక్తి లేదు" అని కూడా నివేదించబడింది. కానీ, ప్రస్తుతానికి, పాకిస్తాన్ మరియు భారతదేశాల మధ్య "తీవ్రతరం కాని దాడులు" పూర్తి స్థాయి యుద్ధంగా మారే దిశగా ఉన్నాయి. ఇది ప్రతి యుద్ధం యొక్క స్వాభావిక తర్కం, అంటే, యుద్ధాన్ని ప్రారంభించేవారు దానిని ఆపలేరు.

ఇప్పుడు జమ్మూ, కాశ్మీర్ ప్రజలు తీవ్రంగా ప్రభావితమైనప్పటికీ, పాకిస్తాన్ సరిహద్దులోని అన్ని రాష్ట్రాలు తీవ్రవాద భారాన్ని మోస్తున్నాయి. ప్రధానంగా జమ్మూ, కాశ్మీర్‌లో ఉన్న ప్రజలకు ప్రాణనష్టం మరియు చెప్పలేని దుఃఖంతో పాటు, అనుషంగిక నష్టాలు ఇతర ప్రదేశాలకు కూడా వ్యాపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో పరిస్థితి మరింత భయంకరంగా ఉండవచ్చు. తరచుగా 'సైనిక రాజ్యం' మరియు 'విఫల రాజ్యం' అని పిలువబడే పాకిస్తాన్, ఇప్పటికే సైన్యానికి నిర్ణయాలు తీసుకునే పూర్తి అధికారాలను ఇచ్చింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తరువాత, "ప్రజాస్వామ్య మాత" అని పిలువబడే భారతదేశంలోని పాలన కూడా దాడులకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఇది 'సైనికవాదం' యొక్క ఆమోదం.. అది కూడా మానవ చరిత్రలో ఈ సమయంలో, ఉగ్రవాదం సహా మానవాళి ఎదుర్కొంటున్న ఏ సమస్యలకూ సైనిక పరిష్కారం లేదు. వీటి బదులుగా, రాజకీయ పరిష్కారమే ఏకైక ఎంపిక చేసుకోవాల్సిన మార్గం!

ఇంతలో, యుద్ధం అధికారికంగా ప్రకటించబడనప్పటికీ, గోడీ మీడియా (ఆర్ఎస్ఎస్, నరేంద్ర మోడీ అనుకూల ప్రచార యంత్రాంగం) మరియు కార్పొరేట్ యాజమాన్యంలోని టీవీ ఛానెల్‌లు యుద్ధానికి ప్రజా మోద సమ్మతిని తయారు చేయడానికి ఓవర్ టైం పనిచేస్తున్నాయి. కార్పొరేట్ మీడియా ప్రచారం చేసే నకిలీ వార్తలు, యుద్ధోన్మాదం మరియు యుద్ధోన్మాదాన్ని నియంత్రించడానికి అధికారిక జోక్యం లేనప్పటికీ, స్వతంత్ర అభిప్రాయాలను సమర్థిస్తున్న వెబ్ మ్యాగజైన్‌లు/పోర్టల్‌లను సెన్సార్ చేయడానికి/నిరోధించడానికి రాజ్యం నిఘా పూర్తి స్థాయిలో ఉంది. భిన్నాభిప్రాయాలను మరియు విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారి నోరులను మూయించేటట్లుగా, మౌనంగా ఉండేటట్లుగా చేస్తారుబీ దాడి చేస్తారుబీ మరియు జైలులో పెడతారు. అదే సమయంలో, ముస్లింలు మరియు కాశ్మీరీ ప్రజలపై విద్యార్థులు సహా పరాయీకరణ, కళంకం మరియు ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి దారుణమైన ఫాసిస్ట్ ఎత్తుగడలు భారతదేశం అంతటా జోరుగా సాగుతున్నాయి.

ఆహారం, వైద్యం మరియు ఆశ్రయం వంటి కనీస జీవనోపాధి కూడా లేని, ఎక్కువ మంది కార్మికులు మరియు అణచివేతకు గురవుతున్న ప్రజలు ముందుకు వచ్చి 'యుద్ధం వద్దు' అని దృఢంగా చెప్పాల్సిన సమయం ఇది. యుద్ధం అనేది అన్ని పాలక ప్రభుత్వాలకు ప్రజల దృష్టిని వారి నిజ జీవితం నుండి మళ్లించడానికి ఒక అవకాశం. భారతదేశం మరియు పాకిస్తాన్ వంటి దేశాలు ఆయుధాల కోసం ఆధారపడిన అమెరికా మరియు చైనా వంటి సామ్రాజ్యవాద శక్తుల సైనిక-పారిశ్రామిక సముదాయాలు తమ లాభాలను పెంచుకోవడానికి యుద్ధం ఒక వరం లాంటి అవకాశం. మరియు మొత్తం భారం యుద్ధ-ఆధారిత వనరుల సమీకరణ ముసుగులో పెరుగుతున్న ధరలు, పన్నులు, సామాజిక భద్రతలో కోత మొదలైన వాటి రూపంలో ప్రజల భుజాలపై ఉంటుంది.

కాబట్టి, ఈ ఉద్రిక్తతను ఆపడానికి తక్షణ దౌత్యపరమైన చర్యలు మరియు అర్థవంతమైన సంభాషణలు అవసరం. అయితే, నేటి నయా ఫాసిస్ట్ పరిస్థితులలో, సుదీర్ఘమైన ఉక్రెయిన్ యుద్ధం మరియు పాలస్తీనాపై జియోనిస్ట్ దురాక్రమణ విషయంలో మనం చూసినట్లుగా, అంతర్జాతీయ సమాజం నుండి అర్థవంతమైన మరియు నిజమైన చొరవ లేకపోవడం , వాక్చాతుర్యాన్ని తప్ప, అంతర్జాతీయ సమాజం నుండి అర్థవంతమైన మరియు నిజమైన చొరవ లేదు. అందువల్ల, దేశంలోని అన్ని ప్రగతిశీల-ప్రజాస్వామ్య శక్తులతో కలిసి, ప్రజల విధి ఏమిటంటే, పాలనను తక్షణ ఉద్రిక్తత నుండి ఉపశమనం పొందేలా మరియు శాంతి కోసం కృషి చేయమని బలవంతం చేయడం అందరి బాధ్యత. ప్రజల సంఘీభావం మరియు సామాజిక సామరస్యం ద్వారా మాత్రమే ఉగ్రవాదాన్ని నిర్మూలించవచ్చు. యుద్ధ వ్యతిరేక ప్రజా ఉద్యమం ఈ సమయంలో అవసరం, ఇది మాత్రమే యుద్ధాన్ని నిరోధించగలదుబీ మరియు నేడు అదే శాంతిని తీసుకురాగలదు!

పి జె జేమ్స్
జనరల్ సెక్రటరీ,
సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్
న్యూ ఢిల్లీ

తెలుగు వెలుగుకు ఉద్యమిద్దాం

తెలుగు అధికార భాషగా ఉన్న రాష్ట్రంలో ఇంటర్ లో తమపై బలవంతంగా తెలుగును రుద్ద వద్దంటూ కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు తమ విద్యార్థులతో తల్లిదండ్రులతో కలిసి ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయించటం దురదృష్టకరం. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత మన భాషా సంస్కృతులు ఏ విధంగా ప్రభావితం అవుతున్నాయో ఈ సంఘటన నిరూపిస్తున్నది. స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విచిత్ర పరిస్థితి మన దగ్గర నెలకొని ఉన్నది. ఒకనాడు హైదరాబాదులో జరిగిన సభలో తెలంగి-బేడంగి అంటూ అవహేళనకు గురైన భాషకు మళ్ళీ ఈ నాడు అదే పరిస్థితి దాపురించడం శోచనీయం.

ఈ నేపథ్యంలో తెలుగు భాష చరిత్ర, సంస్కృతుల పునరుద్ధరణ లో భాగంగా శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం, రాజరాజ నరేంద్ర ఆంధ్రభాష నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలైన సంస్థలు ఏర్పడి ఇక్కడి భాషా సంస్కృతులను పరిరక్షించాయి. చివరకు మన దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల కాలంలో మెకంజీ కాల్డ్వెల్, సి.పి.బ్రౌన్, క్యాంబెల్ మొదలైన అధికారులు మన భాషా చరిత్ర సంస్కృతుల గొప్పతనాన్ని గుర్తించి వాటిని పరిరక్షించే ప్రయత్నం చేశారు. ఇటీవల 2017 లో తెలంగాణలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో అప్పటి ముఖ్యమంత్రి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేస్తామంటూ ప్రకటించి ఆ తర్వాత దానిని కొంతమంది ధార్మిక ప్రవక్తల మూలంగా పదో తరగతి వరకే పరిమితం చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎక్కడా సంస్కృత భాషకు సంబంధించి శబ్దాలు ధాతువులు చదవకుండా ఒక్కసారిగా ఇంటర్లో సంస్కృతాన్ని తీసుకొని దానిని తెలుగులోనో ఇంగ్లీషులోనూ రాస్తూ నూటికి 99 మార్కులు తెచ్చుకోవడం ఈనాడు మనం గమనిస్తున్నాం. తెలుగును తెలుగులో, ఇంగ్లీషును ఇంగ్లీషులో, హిందీని హిందీలో రాస్తున్నా సంస్కృతాన్ని తీసుకున్న విద్యార్థులు మాత్రం దానిని దాని మాతృక అయిన దేవనాగర లిపిలో కాకుండా తెలుగులోనో, ఇంగ్లీషులోనో రాసే వెసులుబాటు ఉండటం నిలువరించాలి. వారు భాషపై భక్తితో కాకుండా మార్కుల పై భక్తితో కార్పొరేట్ కళాశాలలు రెండు నెలల్లో మొక్కుబడిగా సంస్కృతాన్ని బోధిస్తూ ఈ ఘన చరిత్రను సాధిస్తున్నాయి. ఇలా రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు సంస్కృతాన్ని అభ్యసిస్తుండగా తెలుగును అందులో ముఖ్యంగా ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలలో రెండు లక్షల మంది మాత్రమే అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో ద్వితీయ అధికార భాష అయిన ఉర్దూ కంటే అరబిక్ ను ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఈ నేపథ్యంలో తేదీ 8.4.2025న ఇంటర్ బోర్డ్ అధికారులు జూనియర్ కళాశాలలో రెండవ భాషగా తెలుగు కాకుండా సంస్కృతం తీసుకునే అధ్యాపకుల నియామకానికి సంబంధించి సమాచారం కోరారు. దాంతో సహజంగానే తెలుగు వాళ్లలో ఆందోళన, అలజడి చెలరేగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో కూడా తెలుగు స్థానంలో సంస్కృతాన్ని ప్రవేశపెడుతున్న నేపథ్యంలో



కేంద్రీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖలు స్పందించి ప్రాతినిధ్యం వహించాయి. అలాగే వెల్దండి శ్రీధర్ మొదలైన వారు పత్రికలలో వ్యాసాలు రాశారు. ప్రభుత్వ వైఖరిని వెల్లడిస్తూ వివిధ పత్రికలలో వార్తలు వచ్చాయి. తేదీ 3.5.2025న తెలంగాణ తెలుగు భాషాభిమానులు పాలమూరు వేదిక అధ్యక్షులు శ్రీ ఎం.రాఘవాచారి సారధ్యంలో తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషకు అవమానం ఎందుకు? రెండవ భాషగా కూడా తెలుగును తొలగిస్తారా? ఏం జరుగుచున్నది? ఏం జరగాలి?

అంటూ సమాలోచన సభ జరిగింది. ప్రముఖ సాహిత్య విమర్శకులు శ్రీ మోత్కూరు నరహరి అధ్యక్షతన జరిగిన సదస్సులో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా చర్చను ప్రారంభించగా ఆచార్య జి. హర గోపాల్, గోరేటి వెంకన్న, డి.చంద్రశేఖర్ రెడ్డి, కె.శ్రీనివాస్, నందిని సిధా రెడ్డి, అల్లం నారాయణ, పిల్లలమర్రి రాములు, సిల్మా నాయక్, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు మొదలైన వారు చర్చలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో సభ్యులు హాజరు కావడం విషయ ప్రాధ

కురుమ సంఘాన్ని అభివృద్ధిపరిచేందుకు శాయశక్తుల కృషి

శంకర్‌పల్లి, మే 11 (జనంసాక్షి) : కురుమ సంఘాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు శాయశక్తులకు చేస్తానని శంకర్‌పల్లి మండల కురుమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య పేర్కొన్నారు. మండల కురుమ సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమ కులస్తుల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వంపై పోరాటం చేసి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కురుమల అభివృద్ధికి వారి సంక్షేమానికి కురుమ సంఘ సభ్యులందరూ ఐకమత్యంగా ప్రభుత్వంపై పోరాటం చేసి హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన కురుమ కులస్తులకు దక్కేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు కిష్టగోని సదానందం, జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు రాపోలు నర్సింలు తదితరులు పాల్గొన్నారు. తదనంతరం మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

మండల కురుమ సంఘం అధ్యక్షులుగా బండమీది వెంకటయ్య (మోకిలా) ఉపాధ్యక్షులుగా మోత్కుపల్లి అశోక్ (జన్వాడ) ధరణి రాజు (పిల్లిగుండ్ల) గంగ్యాడ శ్రీశైలం (మాసానిగూడ) జానంపేట మల్లేశం(సింగపూర్) ప్రధాన కార్యదర్శిగా మోత్కుపల్లి మహిపాల్ (కొండకల్) సంయుక్త కార్యదర్శులుగా చీర శ్రీనివాస్ (శేరిగూడెం) నర్సింలు (గాజులగూడెం) కుర్మా గణేష్ (కొండకల్) చీర సాయి (గోపులారం) కోశాధికారిగా మొండ్యాగు వెంకటేశం (పర్వేద) కార్యదర్శులుగా శేఖర్ (సంకేపల్లి) నారే వెంకటేశం (టంగుటూరు) మంగళవారం చంద్రశేఖర్ (మహాలింగాపురం) సలహాదారులుగా రామచంద్రయ్య (పొద్దుటూరు) బీర్ల నర్సింలు మాజీ ఎంపీపీ శంకర్పల్లి (జన్వాడ) కురుమ వెంకటేష్ (మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శంకర్పల్లి జన్వాడ) కంకంటి జంగయ్య (బుల్కాపూర్) మొండ్యాగు చెన్నయ్య (కొత్తపల్లి) (రిటైర్డ్ సీఈవో మెదక్ జిల్లా) బాలరాజ్ (హుస్సేన్పూర్) ధరణి నరసింహులు (పిలిగుండ్ల) కాట్నం నర్సింహ (జన్వాడ) ఈశ్వరయ్య (బుల్కాపూర్) బచ్చగొల్ల శ్రీశైలం (శంకరపల్లి) రాజమౌళి (ఎల్వర్తి) ధరణి ఐలయ్య పిల్లిగుండ్ల తదితరులు ఎన్నికయ్యారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు, మే 11 (జనంసాక్షి) : మానవసేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. తాండూర్ పట్టణంలో ఆదివారం ఏ ఎస్ జి ఎం కె ట్రస్టును చైర్మన్ ఆయన ప్రారంభించారు. యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉచిత వైద్య, కంటి పరీక్షల శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సంపాదించడం కాదు సంపదనలో కొంత నిరుపేదలు, అభాగ్యులు దురదృష్టం కొద్దీ ఆపదలో ఉన్న పేదలను ఆదుకునే సేవాభావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఇటీవల కాలంలో తాండూరులో సేవా భావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముజీబ్ ఖాన్‌ను ఆయన అభినందించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దైవభక్తి, ప్రభుభక్తి భావంతో విశ్వమానవ కళ్యాణం కోసం తపించాలని ఆయన సూచించారు. ముజీబ్ ఖాన్ మాట్లాడుతూ అనవసర విమర్శలు ఆరోపణలు తదితరులు వదిలి మానవ సేవ కోసం నిస్వార్థంగా ప్రతి ఒక్కరు ఆలోచించాలని తెలిపారు. తాండూరులో గత మూడు దశాబ్దాలుగా నిస్వార్థంగా ప్రతి పేదలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న మహేందర్ రెడ్డిని ఆయన అభినందించారు. మహేందర్

రెడ్డి సహకారంతో తాండూరులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. సీనియర్ నాయకుడు పిసిసి నేత కరణం పురుషోత్తం రావు మాట్లాడుతూ అభినందనీయమని వివరించారు. అబ్దుల్ రఫ్ మాట్లాడుతూ శివ కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. డాక్టర్ సంపత్ మాట్లాడుతూ మరింత నిర్వహించేందుకు తాము సహకరిస్తామని అన్నారు. అబ్దుల్ రఫ్, గడ్డల రవి, భగవాన్, బీర్కుట్ రఘు, శివానంద్, అగనూరు సంకేత్, తేల్ అబ్దుల్లా, మసూద్, గఫూర్ పాషా తదితరులు ఆయనతో ఉన్నారు.

కరాచీ బేకరీ పేరు మార్చాలంటూ శంషాబాద్‌లో నిరసన

- సిటీలో పాకిస్తాన్ ఆనవాళ్లు ఉండొద్దంటూ నినాదాలు

శంషాబాద్, మే 11 (జనంసాక్షి) : శంషాబాద్‌ను కరాచీ బేకరీపై శనివారం స్థానికులు, బీజేపీ నాయకులు దాడి చేశారు. నేమ్ బోర్డు ధ్వంసం చేశారు. వెంటనే బేకరీ పేరును మార్చాలని డిమాండ్ చేశారు. సిటీలో పాకిస్తాన్ ఆనవాళు ఉండకూడదని, అక్కడి సిటీ పేరు అయిన కరాచీని తొలగించాలన్నారు. బార్డర్లో దేశం కోసం సైనికులు పోరాడుతుంటే శత్రుదేశానికి సంబంధించిన పేరును బేకరీకి ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. పాకిస్తాన్ ముర్దాబాద్.. హిందుస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. బేకరీకి జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఎయిర్ పోర్టు పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. రేపటిలోగా బోర్డును తొలగింపజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బేకరీ పేరు మార్చకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆ తర్వాత బేకరీ యాజమాన్యం నేమ్ బోర్డు నల్లటి కవర్లతో కప్పేశారు.

జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులు

ఇబ్రహీంపట్నం, మే 11 (జనం సాక్షి) : అమర సైనికా మీకు పాదాబి వందనాలు , పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ , వీరమరణం పొందిన మీకు పాదాభివందనాలు, జై జవాన్ అంటూ ఇబ్రహీంపట్నం లోని ఏ బీ సీ డీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి, క్రొవ్వోతులను వెలిగించి జై జవాన్ , జై జవాన్ అంటూ మౌనం పాటించారు. దేశ భద్రత విషయంలో తన ప్రాణాలను పణంగా పెట్టిన మీ సేవలు ఎప్పటికి మరువలేమంటూ, మురళి నాయక్ , సచిన్ యాదవ్ రావ్ వనాంజే ల త్యాగాలను మరిలలేమంటూ , భారత దేశ రక్షణ లో ఆర్మీ దే ముఖ్య పాత్ర అంటూ యుద్ధం లో వీరమరణం పొందిన జవానులకు డ్యాన్స్ అకాడమీ విద్యార్థులూ సలా చేస్తూ , నినాదాలు ఇస్తూ నివాళులు అర్పించి, మృతి చెందిన మురళి నాయక్ ల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ , అన్నం పెట్టే రైతన్న

ను, దేశాన్ని కాపాడే ఆర్మీ అధికారులకు అందరికీ పాదభివందనం చేస్తూ ఇలాంటి వారికి , వారి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డ్యాన్స్ అకాడమీ మాస్టర్ ముత్యం అన్నారు. ఈ కార్యక్రమం లో డ్యాన్స్ మాస్టర్ సురేశ్, బన్నీ, తార తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు

మల్కాజిగిరి, ఏప్రిల్ 11 (జనంసాక్షి) : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు స్వామివారి కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం స్థానిక కమిటీ సభ్యులు రమణారెడ్డి, మేకల రాము యాదవ్, జేఏసీ వెంకన్న, నర్సింగ్ రావు, కిట్టు, రామచెర్ల నర్సింగ్, మల్లేష్, రాజా, ఏపీ ప్రసాద్, సుధాకర్ మరియు రాజేష్ ఆలయ అర్చకులు రఘు కిరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

శామీర్‌పేట్, మే 11 (జనంసాక్షి) : లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయా నిధి చెక్కులను టిపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పంపిణి చేశారు. ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ చెందిన తలగామ గోపాల్‌కి 32,500 రూపాయలు,బాబ గూడ చెందిన దాసరి బల్వంత్ రెడ్డి కి 43,000 రూపాయలు మంజూరు అయిన ముఖ్య మంత్రి సహాయా నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి తో పాటు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోగుల నర్సింహ రెడ్డి ,తూంకుంట మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూధన్ రెడ్డి ,రామాలయం ధర్మకర్త గుడిసేని హరికృష్ణ ,నాయకులు బాణాల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ అమృతం లాంటిది

కుత్బుల్లాపూర్, మే 11 (జనంసాక్షి) : సృష్టిలో అమ్మ ప్రేమ అమృతం లాంటిదని జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్తా అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవం పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘ భవనంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 108 మంది మాతృమూర్తులకు వారి కుమారులు పాద పూజలు చేశారు. శ్రీ వాసవి మాత కు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ గుప్తా మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఏ లోటు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కుమారులు, కూతుర్లపై ఉంటుందన్నారు.తల్లిని ఎంత పూజించినా రుణము తీర్చుకోలేమని అంత గొప్ప మనస్సు తల్లిదన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా,కోశాధికారి దొంతుల అన్నయ్య గుప్తా,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వ్యవస్థాపక చైర్మన్ రేగూరి ప్రవీణ్ గుప్తా, వైశ్య సంఘం మాజీ అధ్యక్షులు ఎం. సత్తయ్య గుప్తా,కే.కైలాసం గుప్తా,వై.గౌరయ్య గుప్తా, సభ్యులు గోలి రాజయ్య గుప్తా, దొంతుల భాస్కర్ గుప్తా, మహిళా విభాగం నాయకురాళ్లు కొత్తూరు రజిని, దొంతుల మేఘమాల,జయశ్రీ, లత,యూత్ విభాగం నాయకులు పబ్బా నరేష్ కుమార్,లింగ వేణుగోపాల్, వాసా రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎన్ మెడికల్ షాప్ ప్రారంభోత్సవం

హయత్‌నగర్, మే 11 (జనం సాక్షి) : హయత్‌నగర్‌లోని ఉషోదయకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ ఎన్ మెడికల్ షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. మెడికల్ షాప్ యాజమాన్యం కళ్యాణ్, నరేష్ గౌడ్ లు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ బండారి భాస్కర్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈర్లపల్లి శివారులో రోడ్డు ప్రమాదం

- కారు అదుపు తప్పి స్తంభానికి ఢీ
- సురక్షితంగా బయట పడిన ఇద్దరు వ్యక్తులు

బొంరాస్‌పేట, మే 11 (జనం సాక్షి) : దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రము రోడ్డు ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈర్లపల్లి గ్రామ శివారులోని మూలమలుపు దగ్గర కారు అదుపుతప్పి ప్రమాదవశాత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. అప్రమత్తమైన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు.బొంరాస్ పేట మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు.

ఘనంగా లక్ష్మి నరసింహస్వామి జయంతి

శివ్వంపేట, మే 11 (జనంసాక్షి) : శివ్వంపేట మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో స్వయంభుగా వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జయంతి, స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రత్యేక పూజారి ధనుంజయ్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు,ప్రత్యేక పూజలు, శ్రీ సుదర్శన నరసింహస్వామి వారి హోమము ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా సత్యనారాయణ స్వామి మండపంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శశిధర్ గుప్తా, ఆలయ అసిస్టెంట్ నరసింహారెడ్డి, అర్చకులు విద్యాకర చారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

యాచారం, మే 11 (జనం సాక్షి) : గ్రామీణ క్రీడాకారులు, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని పిఆర్టి యు మ్యాగ్జిన్ సబ్ ఎడిటర్ బెల్లి జగన్మోహన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలో చింతపట్ల గ్రామములో నంచర్ల శ్రీనివాస్ బాబు జ్ఞాపకార్థంగా, ఆర్గనైజర్లు మారగోని సుధాకర్, పెండ్యాల శ్రీనివాస్, పొగాకు రమేష్, సూరం పురుషోత్తం రెడ్డి, సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ గ్రామస్థాయిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని ఆరోగ్యకరంగా జీవించాలని కోరారు. యువకులు, విద్యార్థులు చెడు వ్యసరాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేటి నుండి ఈ నెల 27 వరకు 8 జట్లతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ అతిథులుగా హాజరైన వారికి శాలువతో ఆర్గనైజర్లు సన్మానించారు. క్రీడాకారులకు టీ షర్ట్స్, టోపీలు పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉండటం వలన ఉదయం 6:30 నుండి 11 గంటల వరకు టీం జట్లకు టోర్నమెంట్ ఆడిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు సమయాన్ని దృష్టిలో పెట్టుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఎస్ మహేందర్ రెడ్డి,

పిఆర్టియు మండల అధ్యక్షుడు తిరుమలేష్, కార్యదర్శి యాదగిరి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, నంచర్ల రమేష్ బాబు, హరి ప్రసాద్, జనార్దన్ రెడ్డి, వేణు, హనుమంతరావు, మాజీ ఎంపిటిసి మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ జాంగిర్, దేశిడి రమేష్, మహమ్మద్ జావిద్, కాకులారం గణేష్, నవీన్, నేర్లకంటి నరేష్, మహేష్, వెంకటేష్, యాదగిరి, సురేష్, పి ఈ టి మహమ్మద్ సాబేరు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభివృద్ధి చేయాలి

- రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్
- ఘనంగా ముగిసిన పివిఆర్ క్రికెట్ టోర్నమెంట్

మొయినాబాద్, మే 11 (జనం సాక్షి) : క్రీడలు ఆడటం వలన శరీర ధారగానికి ఎంతో ఆరోగ్యాన్ని కలిగిస్తాయని రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ మోహినబాద్ మున్సిపల్ కమిషనర్ కాజా మహేష్ జద్దిన్ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డిలు అన్నారు. ఆదివారము మండల పరిధిలోని మున్సిపల్ పరిధిలోగల అజిత్ నగర్ లో పివిఆర్ పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి అధికారులు పాల్గొని గెలుపొందిన రెడ్డిపల్లి టీంకు నగదు బహుమతి లక్ష రూపాయలు రన్నర్గా నిలిచిన అజిత్ నగర్ టీంకు 50 వేల నగదును అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజంగా తీసుకొని కలిసిమెలిసి క్రీడలను ఆడినప్పుడే సంతోషాన్ని ఇస్తాయని అన్నారు పట్లల్ల వెంకట్రెడ్డి పట్ల మల్లారెడ్డి పేరుతో నిర్వహిస్తున్న ఈ క్రీడలు జిల్లా స్థాయిలో ఎంతో ఆదర్శంగా నిలిచాయని అన్నారు నిర్వహించడం ఒకే అయితే వారికి కృషి చేయడం మరొక వ్యక్తి అని సూచించారు వారం రోజులపాటు క్రీడలను సజావుగా దగ్గర ఉంటే

నిర్వహిస్తున్న బిందు రెడ్డి చెన్నారెడ్డి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు ఈ క్రీడల వల్ల గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ స్నేహ సంబంధాలతో పాటు ఎంతో ప్రేమ అనురాగాలు పొందుతారని వారన్నారు ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ మన శ్రీనివాస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో, మే 11 (జనం సాక్షి) : మహిళలు, యువతులు,బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు.విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలుతీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో, కాలనీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లకు గురైనా,ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తా మని ఎస్పీ తెలిపారు. షీటీ మ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగు తుందని, జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్,వాట్సాప్,ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రత కు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నేరుగా సంప్ర దించలేని వారు 871267 0398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

● మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్

సదాశివపేట, మే 11 (జనం సాక్షి) : కాంగ్రెస్ నాయకుడు మునిపల్లి సత్యనారాయణ తనపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ మున్సిపల్ వైస్ చర్మన్ చింతా గోపాల్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ తనపై చేసిన తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టారు.కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలలో ఎలాంటి వాస్తవాలు లేవని అన్నారు. తాను నిర్మిస్తున్న భవనానికి సెట్ బ్యాక్ లేదు అనడం సరికాదని, లేనిపోని కక్షల వల్ల, లేనిపోని ఆరోపణల వల్ల ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించొద్దన్నారు. ఆ రకంగా ఏదైనా ఉంటే అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని అన్నారు. తనకున్న ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రస్తుతం తాను ఉంటున్న ఇంటికి తాత్కాలికంగా లిఫ్ట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, అది కూడా రోడ్డులో ఉంది అనడం సరికాదని అన్నారు. తన ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నందున, తాను ప్రస్తుతం ఉన్న ఇంటికి తాత్కాలికంగా లిఫ్ట్ ఏర్పాటు కోసం స్థానిక మున్సిపల్ అధికారులకు అనుమతి కోరడం జరిగిందన్నారు. అధికార పార్టీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టి లబ్ధి పొందడం నిజం కాదా అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారం మదంతో ఎమ్మెల్యే పై, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్, మాజీ కౌన్సిలర్ లు ఇంద్ర మోహన్ గౌడ్ ,విద్యాసాగర్ రెడ్డి ,చౌదరి ప్రకాష్ ,పిఆకుల శివ, శ్రీనివాస, సాతాని శ్రీశైలం, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కోడూరు అంజయ్య ,ఖలీమ్ పటేల్, బిఆర్ఎస్ నాయకులు మోబీన్, సమీ, నసీర్, నాగుల విజయ్, బరాడి శివ, మక్సుద్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొంది జాతీయస్థాయికి ఎదగాలి

● డిఎంఎచ్ఓ జయ చంద్రమోహన్

నారాయణపేట జిల్లా ప్రతినిధి, మే 11 (జనం సాక్షి) : క్రీడాకారులు క్రికెట్ శిక్షణ పొంది జాతీయ స్థాయికి ఎదగాలని నారాయణపేట జిల్లా వైద్య అధికారి జయ చంద్రమోహన్ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మిని స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు ప్రభుత్వం ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.మంచి శిక్షణ పొంది రాష్ట్ర,జాతీయ స్థాయి లో రాణించి ఈ ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోచ్ లు రమణ,అజయ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం

మక్తల్, మే 11 (జనంసాక్షి) : గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైందని ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. మక్తల్ పట్టణ కేంద్రంలోని కాటన్ మిల్ సమీపంలో ఉన్న సంగంబండ లెఫ్ట్ కెనాల్ కాలువలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని మహిళ శవం గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. కెనాల్ కాలువలో మహిళ పడి రెండు మూడు రోజులు అయి ఉంటుందని తెలిపారు. మహిళ వయసు దాదాపు 35 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉంటుందని శరీరంపై పింక్ కలర్ జాకెట్ బ్లాక్ లంగా మెడలో మూడు తాయితలు ఉన్నాయని తెలిపారు. మహిళ మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో ఉందని, ఆనవాళ్ళను బట్టి గుర్తిస్తే మఖ్తల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

శ్రీరంగాపూర్, మే 11 (జనం సాక్షి) : శ్రీరంగాపూర్ మండల పరిధిలోని నగరాల గ్రామం నుండి నమ్మదగిన సమాచారంతో నాగారల శివారులో తెల్లవారుజామున రెండు ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నాయి, అన్న సమాచారం మేరకు పోలీస్ వారు వెళ్లి చూడగా రెండు ట్రాక్టర్లు ఒకటి బుసిరెడ్డిపల్లి రంగస్వామి రెండవది నాగరాలకు చెందిన బలరాం రెండు ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా నింపుకొని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేయడమైనది. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను చిజ్ చేస్తామని ఎస్సై రామకృష్ణ ట్రాక్టర్లను యజమానులకు తెలియజేశారు.

ముగిసిన ఉచిత పాలిసెట్ శిక్షణ

నంగునూరు, మే 11 (జనం సాక్షి) : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో వారం రోజులుగా జరుగుతున్న పాలిసెట్-2025 స్వల్పకాల ఉచిత శిక్షణ ఆదివారం ముగిసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పాలిటెక్నిక్ లో ఆ కళాశాల అధ్యాపకులు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పాలిసెట్ పరీక్ష విధానం వివరించారు. ప్రశ్నల సరళిని అర్థమయ్యేలా చెప్పారు. పాలిసెట్ పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీసు చేయించారు. పాలిసెట్ నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ కళాశాల చుట్టుపక్కల గ్రామాలలోని పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు సిద్దిపేట, గజ్వేల్, గంభీరావుపేట తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరై ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. వేసవికాలం కావడం వల్ల ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులకు మజ్జిగ, పళ్ళను అందించారు. పరీక్షకు సంబంధించి వివిధ సబ్జెక్టుల మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ పాలిసెట్-2025 కు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. శిక్షణ నిర్వహించిన భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు కవిత, ఇతర సిబ్బందిని అభినందించారు.

అంబులెన్స్, ట్రాక్టర్ ఢీ

● అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలు

మల్దకల్, మే 11 (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని అమరవాయి గ్రామ సమీపంలో మూల మలుపు దగ్గర ఆదివారం తెల్లవారుజామున 108 అంబులెన్స్,ట్రాక్టర్ ఢీకొనగా అంబులెన్స్ డ్రైవర్ శ్రీనుకు గాయలయ్యాయి.ఈ ఘటనలో ఆంబులెన్స్ వాహనం నుజ్జునుజ్జు అయింది.అంబులెన్స్ గద్వాల్ నుండిమల్దకల్ కు వెళుతుండగా సద్దలోనిపల్లి నుండి గద్వాల్ వైపువరిగడ్డి కోసం వెళుతూ ట్రాక్టర్, అంబులెన్స్ ఎదురెదురుగా వస్తుండగా రెండు ఢీకున్నాయి.ట్రాక్టర్ లో ఉన్న కొంతమంది భయపడి వెళ్లిపోయారు.సంఘటన స్థలానికి మల్దకల్ పోలీసులు వచ్చి పంచనామా చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఆర్ అండ్ బి అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మలుపు దగ్గర ముండ్ల పొదలు ఉండడంతో వచ్చి పోయే వాహనాలు కనబడడం లేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.

శ్రీరాముడు ప్రపంచానికే ఆదర్శనీయుడు

నంగునూరు, మే 11 (జనం సాక్షి) : శ్రీరాముడు యావత్ ప్రపంచానికే ఆదర్శ పూజనీయుడని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలో దేవుని నర్మెటగా ప్రసిద్ధి చెందిన నర్మెట గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం పాల్గొన్నారు. సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ళబండి వెంకటరమణాచారి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీకి స్వాగతం పలికారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఎంపీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం అర్చకులు ఎంపీకి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ రఘు నందన్ రావు మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు మానవునిగా జన్మించి ఉత్తమమైన మానవ, కుటుంబ విలువలు పాటించాడని తెలిపారు. పెద్దల పట్ల గౌరవంతో మెదిలి లోకానికి ఆదర్శప్రాయుడైన పాలకుడిగా మిగిలారన్నారు. తండ్రి మాట జవ దాటకుండా, గురువుల మాట గౌరవించి రాక్షస సంహారం చేసి దేవునిగా నిలిచాడని చెప్పారు. రామాయణం కుటుంబ విలువలతో పాటు, అన్నదమ్ముల అనుబంధం తెలుపుతుందని చెప్పారు. నాడు సీతమ్మ కన్నీళ్లు రావణ సంహారానికి కారణమైందన్నారు. నేడు పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడిలో నుదుటి సింధూరాన్ని కోల్పోయిన 26 మంది మహిళల కన్నీరు ఉగ్రవాదం నిర్మూలనకు కారణమవుతుందని చెప్పారు. శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత సైన్యం పాకిస్తాన్ ముష్కరులకు సరైన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నారు. నర్మెట లోని శ్రీ లక్ష్మణ సమేత సీతారామచంద్ర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, మండలఅధ్యక్షుడు.వెంకట్రామిరెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, బీజేపీ నాయకులు వాసరి యాదమల్లు, పరకాల తిరుపతిరెడ్డి, చౌదుచర్ల వెంకటరామిరెడ్డి, పప్పు సురేందర్ రెడ్డి, కరుణాకర్, తిరుపతి రెడ్డి, రజనీకర్ రెడ్డి, కిషోర్, ఎల్లయ్య, అనిల్, నరేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పుప్పాల నారాయణ, శనిగరం బాబు, మాజీ సర్పంచులు నార్ల పురం శ్రీనివాస్, నాయిని రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాళ్లబండి వెంకట రమణాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ రఘునందన్ రావును సన్మానించారు.

సామాజిక సంబంధాల్లో క్రీడల పాత్ర కీలకం

బిజినేపల్లి, మే 11 (జనం సాక్షి) : యువతలో సామాజిక సంబంధాలు మెరుగుపర్చడంలో క్రీడ పోటీలు కీలక పాత్ర వహిస్తాయని బీసీ జన చైతన్య జాతీయ అధ్యక్షుడు జయ్ కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ గంగనమోని కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనే యువతకు మానసిక, శారీరక ఆరోగ్యతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సమ వయస్కుల పరిచయంతో నూతన విషయాల పట్ల అవగాహన పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు బాటలు పరుచుకుం మారని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానం తీసుకొని క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. క్రీడల్లో, చదువుల్లో ఎదురయ్యే ఓటముల చూసి కుంగిపోకుం డా పట్టుదలతో పోరాడితే విజయం సాధిస్తామన్నా స్ఫూర్తి పొందాలని కోరారు. అంతకు ముందు ఆపరేషన్ సింధూర్లో భాగంగా పాకిస్తాన్ జరిపిన దాడుల్లో దేశ రక్షణకై వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈపోటీల్లో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.50 వేల నగదు, ట్రోఫీ, రెండవ బహుమతిగా రూ.25 వేల నగదు, ట్రోఫీ, ప్రతిమ్యాచ్కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు, బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ కీపర్ వంటి ప్రత్యేక ప్రోత్సహాక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వహాకులు నరేందర్ గౌడ్, అజీమ్, జహంగీర్, అనిల్ గౌడ్ తెలి పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయినోళ్ల బాల్ రాజు గౌడ్, జిల్లా మాజీ విద్యశాఖ అధికారి విజయ్ కుమార్, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ ముడావత్ రాము నాయక్, ఇండ్ల శ్రీనివాసులు, గొవిందు నాగరాజు, బొట్క చంద్రశేఖర్, బాలరాజు, సత్యశీల సాగర్, ఊర్కొండ రఘుబాబు, ఆనమోని శ్రీశైలం, వేముల సత్యం తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జడ్చర్ల, మే 11 (జనం సాక్షి) : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బిఆర్ఎస్ యువ నాయకులు చించోడ్ అభిమన్యు రెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణం డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన శ్రీ దత్త అవధూత భగవాన్ శ్రీ రామదూత స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ వేణు దత్త సువర్ణ లక్ష్మి, అష్టలక్ష్మి కలశపూజ సిద్ధి వ్రత దీక్ష విరమణ కార్యక్రమంలో అభిమన్యు రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అభిమన్య రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికత క్రమశిక్షణ, నిజాయితీగా జీవించడానికి అలవాటు నేర్పిస్తుందన్నారు. శ్రీ వేణు దత్త స్వామి అష్టలక్ష్మి అమ్మవార్ల దయతో భగవాన్ శ్రీ రామదూత స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంత్ రెడ్డి, నందకిషోర్ గౌడ్, నాయకులు రామ్మోహన్, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

● అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు

హైదరాబాద్ సిటీ, మే 11 (జనంసాక్షి) : జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపు లో శిక్షణ పొందుతున్న పిల్లలకు క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు అన్నారు. ఆదివారం సమ్మర్ కోచింగ్ సందర్భంగా సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, కూకట్పల్లి జోన్ల పార్ట్ టైమ్ కోచ్లు మరియు కోచ్లతో పాటు సంబంధిత గేమ్స్ ఇన్స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోచ్ల వారీగా పనితీరును సమీక్షించి, సభ్యత్వ ఆదాయాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. పిజెఆర్ స్టేడియంలో ఇందిరా పార్క్లో రోలర్ స్కేటింగ్ పార్ట్ టైమ్ కోచ్గా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన నూర్ మొహమ్మద్, కరాటే కోచ్ లక్ష్మణ్ను, విజేతలుగా శ్రావణ, పూజితలను అభినందించారు. జిహెచ్ఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంపులను ఉపయోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించలన్నారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఒక చక్కని అవకాశంమని వారు కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి కూడా ఈ శిబిరాలు సహాయపడతాయని అడిషనల్ కమిషనర్ పేర్కొన్నారు.

కన్నుల పండుగగా కూర్మ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవం

తూప్రాన్, మే 11 (జనం సాక్షి) : తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని రామాలయం సమీపంలో కూర్మ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు కనుల పండుగగా జరిగాయి శనివారం సుదర్శన హోమం ఆదివారం వేదమంత్రాల వేద పండితుల సమక్షంలో ఉదయం సుదర్శన హోమం స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.. ఆలయ కమిటీ నిర్వాహకులు మామిండ్ల జ్యోతి కృష్ణ, కంటాయపాలెం వేణుగోపాల్, ప్రవీణ్ లు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు అర్చన అభిషేకాలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.. కళ్యాణ మహోత్సవంలో మహిళలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కౌన్సిలర్ నారాయణ గుప్తా, పల్లెర్ల రవీందర్ గుప్తా, ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీచూర్ణం విద్యాసాగర్, డాక్టర్ ప్రదీప్ సింహ, అహోబిలం శ్రీనివాస్, నాగేష్, చందు ,యాదగిరి స్వామి విష్ణు, లక్ష్మణ్, మాలే కుమార్ గుప్తా నాగులు మహేష్ యాదవ్ , రమేష్ గుప్తా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రోకు మరో అరుదైన గౌరవం

హైదరాబాద్ (జనంసాక్షి)

: హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మరో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుపై హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయన పత్రం ప్రచురించింది. మొన్న ఐ.ఎస్.బి, నిన్న స్టాన్ ఫర్డ్, నేడు హార్వర్డ్ యూనివర్సిటీలు అధ్యయనం చేయడం పట్ల మెట్రో యాజమాన్యం హర్షం వ్యక్తంచేస్తోంది. అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మేనేజ్మెంట్ విద్యాలయాలు హైదరాబాద్ మెట్రో రైల్ విజయగాథను తమ విద్యార్థుల అధ్యయనానికి పరిశోధనా పత్రాలుగా ప్రచురించినట్లు మెట్రో వెల్లడించింది. హైదరాబాద్ మెట్రోకు అరుదైన గౌరవం : ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో మెట్రో రైల్ వ్యవస్థ ఒక ప్రముఖ రవాణా వ్యవస్థగానే కాకుండా మౌలిక వసతుల కల్పనలో ఒక నూతన ఒరవడిని ప్రదర్శించి, పీపీపీ విధానంలో ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రాజెక్టుగా అవతరించిందని హార్వర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన పరిశోధనాపత్రంలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు అనేక సవాళ్లను అధిగమిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు తీసుకెళ్తున్న ఆయన నైపుణ్య శైలిని, నాయకత్వ లక్షణాలను ఈ పత్రంలో

ప్రస్తావించారు. హైదరాబాద్లో ఉన్న ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు, పరిశోధకులు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు స్థాపనకు అనుసరించిన ఆలోచనలు, దానిని అమలు చేసిన తీరుపై ఇప్పటికే అధ్యయనం చేశారు. దీనిని హైదరాబాద్ 'మెట్రో %-% ఆలోచన నుంచి అమలువరకు' పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్లో ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్ అనే ఇతివృత్తంతో పరిశోధనా పత్రం రూపొందించింది. హార్వర్డ్ బిజినెస్ జర్నల్లో చోటు : హార్వర్డ్ విశ్వవిద్యాలయం దీనిని ఒక కేస్ స్టడీగా ఎన్నుకొని తమ ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ బిజినెస్ జర్నల్లో ప్రచురించిందని మెట్రో అధికారులు తెలిపారు. భూసేకరణ సమస్యలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆమోదాలు, రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లు లాంటి అనేక సమస్యలను ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సమర్థ నాయకత్వంతో అధిగమించారు. 'సమర్థమైన ప్రణాళికలు, సున్నితమైన చర్చల ద్వారా హైదరాబాద్ మెట్రోను ప్రపంచస్థాయి అభివృద్ధికి తీసుకువచ్చారని, ప్రతిభాపూర్వకమైన, ధైర్యమైన నిర్ణయాలు, పాలనలో చైతన్యం ద్వారా భారతదేశపు అత్యుత్తమ మెట్రో వ్యవస్థగా హైదరాబాద్ మెట్రో నిలిచింది' అని హార్వర్డ్ వర్సిటీ ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయడానికి ఆయన అనుసరించిన విధానం అపూర్వమైనదిగా నిలిచిందని అధ్యయన పత్రం తెలిపింది. విలక్షణమైన ప్రణాళికా తీరు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక విషయాలపై లోతైన అవగాహన, సమస్యలను అధిగమించే నాయకత్వ సామర్థ్యం ఈ ప్రాజెక్టును చరిత్రలో నిలిచిపోయేలా చేశాయని హార్వర్డ్ ప్రచురణ స్పష్టం చేసింది. అతి క్లిష్టమైన పీపీపీ విధానం ద్వారా అమలు చేసిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ పెను సవాళ్లను ఎదుర్కొని నిలదొక్కుకోగలిగిందని ఈ అధ్యయన పత్రం తెలిపింది.

మౌలిక వసతుల కల్పనపై మంత్రికి వినతి

రాయికల్ మే 11(జనం సాక్షి):

రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిని సి.హెచ్.సి నుండి గత 8 సంవత్సరాల క్రితం వైద్య విధాన పరిషత్ పరిధిలోకి చేర్చినప్పటికీ అందుకు తగ్గ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు కావలసిన సదుపాయాలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి సమక్షంలో జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్ లో రాయికల్ పట్టణ,మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం వినతి పత్రాన్ని అందించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత,సిబ్బంది కేటాయింపు, పరికరాల ఏర్పాటు ,భవన సదుపాయం,మౌలిక వసతుల మరమ్మత్తులు వంటి సమస్యలపై మంత్రికి వివరించారు.రాయికల్ మున్సిపల్,మండల పరిధిలో పెరిగిన జనాభాకను గుణంగా వైద్య సేవలు అందలేక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వైద్య విధాన పరిషత్ పరిధి స్థాయికి తగ్గ హోదా,వైద్య సేవలతోపాటు ఆస్పత్రికి నిధుల కేటాయింపు, ఆధునీకరణ చేపట్టాలని మంత్రికి తెలిపారు.ఆస్పత్రి పై ప్రత్యేక దృష్టి కేటాయించి సమస్యను పరిష్కరిస్తానని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నరసింహ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్,కొయ్యేడి మహిపాల్ రెడ్డి,బాపురపు నర్సయ్య,బత్తిని భూమయ్య,తలారి రాజేష్,కడకుంట్ల నరేష్,రాకేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు

నాలుగు సంవత్సరాల బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు

హైదరాబాద్ (జనంసాక్షి) :

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం – ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ విశ్వ విద్యాలయం సంయుక్తంగా నాలుగు సంవత్సరాల బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు ప్రారంభించనుందని ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. విద్యార్థులు నాలుగు సంవత్సరాల కోర్సు వ్యవధిలో మూడు సంవత్సరాలు పీజేటీఏయూలోనూ ఒక ఏడాది వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయంలోనూ విద్య అభ్యసిస్తారని అన్నారు. ఈ కోర్సు వల్ల రెండు విశ్వవిద్యాలయా ల్లోనూ విద్యనభ్యసించే అవకాశం విద్యార్థులకి కలుగుతుందని తెలిపారు.అదే విధంగా విద్యార్థులు ఎమ్మెస్సీ కూడా చదవాలని భావిస్తే మరో ఏడాది వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయంలో చదువవలసి ఉంటుందని అన్నారు. వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాల యంలో పీహెచ్డీ కూడా చేయదలచుకుంటే ఎటువంటి రుసుములు లేకుండా స్కాలర్ షిప్ సాయంతో పీహెచ్డీ పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ అంశాలపై రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరే ప్రక్రియ తుది దశలో ఉందని పీజేటీయేయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తెలిపారు. ఈ వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం అందించే అన్ని వ్యవసాయ కోర్సులకి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక కోర్సుల ప్రవేశాల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జానయ్య తెలిపారు.

అరచేతి నుంచే జీహెచ్ఎంసీ సేవలు

మై జీహెచ్ఎంసీ మొబైల్ యాప్ ద్వారా అనేక సేవలు

హైదరాబాద్ (జనంసాక్షి)

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజలకు వివిధ సేవలను మై జీహెచ్ఎంసీ మొబైల్ యాప్ ద్వారా అందిస్తున్నట్టు బల్దియా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. ప్రజలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మొబైల్ ఫోన్ నుంచే బల్దియా సేవలను పొందాలని పిలుపునిచ్చారు. యాప్ ద్వారా పారిశుద్ధ్యం, ఆరోగ్యం, వీధి దీపాలు, ఇంజినీరింగ్, మురుగు నీటి సమస్య, రహదారులను ఊడ్చటం వంటి సమస్యలపై ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో తీసి సమస్య ఉన్న ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయాలని కమిషనర్ పౌరులకు సూచించారు.

నేరుగా జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్

వాటిని జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ పరిశీలిస్తుందని, యాప్‌లో ఫిర్యాదు నమోదైన ప్రాంతానికి సంబంధిత అధికారులను పంపిస్తామని ఆయన వెల్లడించారు. అదే సమయంలో ఫిర్యాదుదారుకు మొబైల్‌కు కంప్లైంట్ నంబరు, సంబంధిత అధికారి ఫోన్ నెంబర్లతో స్వల్ప సందేశం వెళ్తుంది. యాప్‌లో మీ ఫిర్యాదు పరిష్కారమైందా? లేదా? అని కూడా క్రాస్ చెక్ చేసుకోవచ్చు. పరిష్కారం కాకపోయినా, అయినట్టు చూపించే అధికారులపై నేరుగా జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ 040 – 2111 1111కు ఫిర్యాదు చేయొచ్చని బల్దియా కార్యాలయం వెల్లడించింది.

ఫీజులను ఆన్లైన్లో చెల్లించవచ్చు

ఆస్తిపన్ను మదింపు, ట్రేడ్ లైసెన్సు దరఖాస్తు, పెంపుడు శునకానికి లైసెన్సు
తీసుకోవడం, నిర్మాణ వ్యర్థాల తరలింపునకు వాహనాన్ని బుక్ చేసుకోవడంతోపాటు దోమల సమస్య, రోడ్లపై గుంతలు, వీధి కుక్కలు, వీధి దీపాల ఏర్పాటు, ఆహార కల్తీ, తదితర సమస్యలపై యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ట్రేడ్ లైసెన్సు, ఆస్తిపన్ను, ఇతరత్రా ఫీజులను డెబిట్ కార్డు, ఆన్లైన్లో యుపీఐ ద్వారా చెల్లించవచ్చు.

ప్రజల కోసం సులభతరంగా..

జీహెచ్ఎంసీ కార్యాలయాలు, వార్డు ఆఫీసులు, ప్రజా శౌచాలయాలు, వాతావరణ సమాచారం, ఇంకా చాలా రకాలకు సంబంధించిన అవసరమైన సేవలను పొందవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజల సౌకర్యం కోసం ఈ యాప్‌ను మరింత సులభతరంగా మార్చామని, ప్రజలు యాప్‌ను ఉపయోగించుకుని వ్యక్తిగత, సమాజ సమస్యల పరిష్కారం వెంటనే పొందవచ్చని ఆర్.వి కర్ణన్ పేర్కొన్నారు.

లైక్స్ కోసం ప్రాణాలతో చెలగాటమా..?

సజ్జనార్ సీరియస్

హైదరాబాద్ (జనంసాక్షి)

సోషల్‌మీడియాలో లైక్స్, వ్యూస్ పెంచుకొనేందుకు ఎంత పిచ్చి పని చేయడానికైనా.. వెనుకాడటం లేదు కొందరు నెటిజన్లు. లైక్స్, వ్యూస్ మోజులో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చాలానే జరిగాయి. లైక్స్ కోసం సాహసాలు చేయవద్దని చెప్పినా.. కొందరు ఆ మాటలను పెడచెవిన పెడుతున్నారు. తాజాగా ఇలాంటి ఓ వీడియోని ఆర్టిసి ఎండి సజ్జనార్ 'ఎక్స్' పోస్ట్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియోలో ఓ యువకుడు ట్రైన్ వస్తుండగా.. పట్టాల మధ్యలో పడుకొని ఆ రైలు వెళ్లిపోయాక లేస్తాడు. పైకి లేచి ఏదో ఘన కార్యం సాధించిన వాడిలా కేకలు వస్తాడు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీన్ని షేర్ చేసిన సజ్జనార్ "ఫేమస్ కోసం ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడటం పిచ్చితనం! సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టాలా!? ఏదో ఘనకార్యం వెలగబెట్టినట్లు ఆ పట్టరాని సంతోషం ఎందుకు.. ఇలాంటివి మీకు సరదాగా అనిపించొచ్చు.. కానీ జరగరాని ప్రమాదం జరిగితే ఏమవుతుందో ఆలోచించండి" అంటూ పోస్ట్ చేశారు.

ఈఏపీసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో.. బీసీ గురుకుల విద్యార్థులు ర్యాంకుల పంట

విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ (జనంసాక్షి)

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో అడ్మిషన్లకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 29వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు టీజీ ఈఏపీసెట్ పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్–ఫార్మసీ విభాగం పరీక్షలు నిర్వహించగా, మే 2, 3, 4 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగంలో66 మంది విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. వీరిలో పదివేల లోపు ర్యాంకులు 18 మంది విద్యార్థులు సాధించారు. టి. ప్రణయ, 496 ర్యాంక్(ఎంపిసి) , టి. సాకేత్, 1562 ర్యాంక్ (ఎంపిసి), కె. మనీష, 1814 ర్యాంక్ (ఎంపిసి), అగ్రికల్చర్ – ఫార్మసీ విభాగంలో 35 మంది విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. పదివేలలోపు ర్యాంకులు 23 మంది విద్యార్థులు సాధించారు. రాంచరణ్, 2962 ర్యాంక్ (బైపిసి).బీసీ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, భోజన వసతులు ఉపయోగి ంచుకుని ఉన్నత విద్యావంతులు కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. విద్య ద్వారానే తమ జీవితాలను మార్చుకునే అవకాశం ఉందన్నారు.

ఇంజనీ రింగ్, మెడికల్ కోర్సుల ప్రవేశపరీక్షలకు అవసర మైన శిక్షణ ఇచ్చేందుకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని సిఓఇ లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తామని ఆయన తెలిపారు. అత్యధిక మార్కు లతో ర్యాంకులు సాధించి ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సులో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులను, కార్యదర్శి శ్రీధర్, ఎంజేపీ సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, ఐఎఫ్ఎస్ అభినందించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాస్ లు నిర్వహించి, ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించి మంచి ర్యాంకులు రావడానికి కృషి చేసిన బోధన సిబ్బందిని అభినందించారు.

హైదరాబాద్‌కు గర్వకారణం

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి)

విజన్ ఐఏఎస్ సెమినార్‌లో ఆశావహులకు స్ఫూర్తినిచ్చిన యుపిఎస్ సి టాపర్ ఎన్ చేతన రెడ్డి

విజన్ ఐఏఎస్ హైదరాబాద్ ఒక స్ఫూర్తిదాయకమైన సెమినార్‌ను నిర్వహించింది. విజయవంతమైన యుపిఎస్సి ఆశావహులను వారి ప్రయాణాలు, వ్యూహాలను పంచుకోవడానికి ఒకచోట చేర్చింది. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ పరీక్ష 2024లో ఆకట్టుకునే రీతిలో ఆల్ ఇండియా ర్యాంక్ (ఏఐఆర్) 110ని సాధించిన ఎన్ చేతన రెడ్డి వీరిలో ఒకరు. తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన చేతన రెడ్డి, బిట్స్ పిలాని, హైదరాబాద్ క్యాంపస్ (2018) నుండి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బి టెక్ గ్రాడ్యుయేట్ చేశారు. ఆమె యుపిఎస్సి ప్రయాణ ప్రారంభానికి ముందు, ఆమె ప్రముఖ టెక్ సంస్థలు క్వాల్కామ్, ఎన్విదియలో 2.5 సంవత్సరాల వృత్తిపరమైన అనుభవాన్ని పొందారు. చేతన తన ఐచ్ఛిక అంశంగా సోషియాలజీని ఎంచుకున్నారు. విజన్ ఐఏఎస్ లో తరగతి గది విద్యార్థిని. ఆమె విజయం ఆమె అచంచలమైన అంకితభావం, వ్యూహాత్మక సంసిద్ధత, ప్రజాసేవ పట్ల లోతైన నిబద్ధతకు నిదర్శనం. ఈ సెమినార్‌లో ఆమె మాట్లాడుతూ, తన నాలుగు ప్రయత్నాల ప్రయాణంలో స్థిరత్వం, స్వీయ–క్రమశిక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి విజన్ ఐఏఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ కృష్ణ సింగ్ అధ్యక్షత వహించారు. "చేతన రెడ్డి సాధించిన విజయానికి మేము గర్వపడు తున్నాము. తమ విద్యార్థు లలో పెంపొం దించాలని లక్ష్యంగా పెట్టుకున్న శ్రేష్ఠత, సంకల్పాన్ని ఆమె సూచిస్తుంది. ఆమె ప్రయాణం ఆశావహ సివిల్ సర్వెంట్లకు ప్రేరణగా నిలుస్తుంది" అని శ్రీ సింగ్ అన్నారు. ఈ సెమినార్‌లో ప్రభావవంతమైన సంసిద్ధత వ్యూహాలు, సమాధానాల రాసే పద్ధతులు,
మానసిక ఆరోగ్యం గురించి పరిజ్ఞానం గురించి వెల్లడించారు. "జిఎస్ ఫౌండేషన్ కోర్సు" అంతకు మించిన అంశాలలో చేరిన విద్యార్థులకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించారు.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ మే 11 (జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ వ్యాపార వ్యవస్థగా మారడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యని అందించాలని, నిబంధనలు ఉన్న వాటి అమలు మాత్రం నేటికీ శూన్యం తెలంగాణ రాష్ట్రంలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కార్పొరేట్ మాఫియా దోపిడిని అరికట్టడంలో నేటికీ ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకునే అవకాశం ఈ తెలంగాణ రాష్ట్రంలో లేకుండా పోయిందని ఆయన అన్నారు. అడ్మిషన్ల పేరిట పెద్ద మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి డబ్బులు వసూలు చేయడమే కాక పాఠశాల ఫీజులు అత్యధికంగా ఉండడం వలన పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాల విద్యకి నోచుకోలేని పరిస్థితి ఏర్పడ్డదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈసారైనా పేద విద్యార్థుల పక్షాన ఆలోచన చేసి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25% పేద విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకొని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే అని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను చదివించాలి అంటే తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లల్ని చదివించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని ఆయన అన్నారు. విద్యని వ్యాపారం చేసి లక్షల రూపాయలు దోచుకుంటున్న యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే మాత్రం ప్రభుత్వంపై ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, మురళీ యాదవ్, ఉపేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడికి ఆత్మహత్య

ఆర్మూర్, మే 11 (జనంసాక్షి) :

అప్పుల బాధలు తాళలేక యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన ఆర్మూర్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని రాజారాం నగర్ కాలనీకి చెందిన గుడ్ల ప్రవీణ్ (35) వ్యాపారం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.ఈ క్రమంలో వ్యాపారంలో నష్టం వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. శనివారం సాయంత్రం అప్పుల బాధలు ఎక్కువవైనవని, చనిపోతానని భార్యకు చెప్పి ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం నుండి కుటుంబ సభ్యులు వెతుక సాగగా అదే కాలనీలోని స్మశాన వాటికలో వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని మరణించాడు.భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిర్మల్‌లో ఘోర రోడ్డుప్రమాదం

తండ్రీకూతురు దుర్మరణం

హైదరాబాద్ (జనంసాక్షి) :

నిర్మల్ జిల్లా నీలాయిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారు జామున నీలాయిపేట వద్ద డీసీఎం, కారు ఢీకొన్నాయి. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతోపాటు వెనుక టైర్ ఊడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తండ్రీ కూతురు అశోక్ (45), కృతిక (20) అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రుని దవాఖానకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12 మే 2025

రామాలయం కరగట్టపై ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గ్రామపంచాయతీ అధికారులు.
- చెత్త పొగతో శ్రీరాముడికి ధూపం వేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు.
- సిపిఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్లను ఆపి ఆందోళన చేస్తున్న ప్రజలు

భద్రాచలం, మే 11 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం రామాలయం కు కూతవేటు దూరంలో కరకట్ట పై పోస్తున్న చెత్త డంపింగ్ ను పట్టణ శివారుకు తరలించాలని, ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సిపిఎం ఆధ్వర్యంలో ముదిరాజ్ బజారు, సప్తా దిగువ, రామాలయం పరిసర ప్రాంతాల ప్రజలు కరకట్ట పైకి చెత్తను తరలిస్తున్న పంచాయితీ వాహనాలను అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం. బి. నర్సారెడ్డి లు మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తను కరకట్టపై పోసి తగలబెట్టడంతో పొగ కమ్ముకుని రామాలయం వైపు, కాలనీ వైపు పొగ వ్యాప్తి చెందడంతో రామాలయం వచ్చే భక్తులతో పాటుగా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కాలనీ ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారన్నారు. నిత్యం డంపింగ్ చేస్తున్న చెత్త వల్ల వస్తున్న దుర్వాసన, పొగ కాలుష్యం కారణంగా పరిసర ప్రాంత ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, లివర్, కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, ప్రజల ప్రాణాలు తీసుకున్న డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా ఇక్కడి నుంచి తరలించాలన్నారు. గతంలో సిపిఎం నిర్వహించిన పోరాట ఫలితంగా సుందరయ్య కాలనీలో చెత్త డంపింగ్ యార్డ్ ను నిర్మించారని, దాన్ని అట్టహాసంగా ప్రారంభించామని చెప్పుతున్న మంత్రులు అధికారులు స్థానిక ఎమ్మెల్యే పట్టణంలో సేకరించిన చెత్తను కరకట్ట పైన తీసుకొచ్చి ఎందుకు పోస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భద్రాచల శ్రీరాముల వారికి గ్రామపంచాయతీ చెత్త పొగతో నిత్యం ధూపం పడుతున్నారని విమర్శించారు. ఈ సమస్య పట్ల జిల్లా కలెక్టర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఐటీడీఏ పీవో స్పందించాలని కోరారు. ప్రజల ప్రాణాల పట్ల గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే చెత్త డంపింగ్ యార్డ్ ను పట్టణ శివారుకు తరలించాలని లేనియెడల ప్రజా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు చుక్కా మాధవరావు, శాఖ కార్యదర్శి ధనలక్ష్మి, స్థానిక ప్రజలు సీత, హైమావతి, రామలక్ష్మి, రమణ, సీతామహాలక్ష్మి, రమేష్, రాంబాబు, పిలక రెడ్డి, ఏసు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రికి పోటెత్తిన భక్తజనం

యాదగిరిగుట్ట, మే 11 (జనంసాక్షి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ఆదివారం భక్తజనంతో పోటెత్తింది. వేసవి సెలవులు, స్వాతి నక్షత్రం కావడంతో స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. భక్తుల రద్దీతో యాదగిరి కొండపై ఎటుచూసినా భక్తులే కనిపించారు. స్వామివారి దర్శనం క్యాలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయాలు, కొండపైకి వెళ్లే దారుల్లో భక్తులు సందడి చేశారు. తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. అనంతరం ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన పూజలలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శీఘ్రదర్శనం 5 గంటలు, అతిశీఘ్రదర్శనం 4 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదాద్రి కొండపైన దర్శన క్యూలైన్లతో పాటు ప్రసాద విక్రయ కేంద్రం, శివాలయం, పలు కూడళ్లలో భక్తుల సందడి నెలకొంది. యాదగిరిగుట్ట కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం యాదగిరిగుట్ట అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు దర్శించుకొని తరించారు.

నేడు అందాల బామలు రాక

- భారీ బందోబస్తు ఏర్పాటు
- పోలీసుల ఆధీనంలో బుద్ధవనం

నల్లగొండ బ్యూరో, మే 11 (జనం సాక్షి) : మిస్వరల్డ్ 2025 పోటీలకు వచ్చిన ప్రపంచ అందగత్తెలు నాగార్జున సాగర్, బుద్ధవనం తదితర పర్యటక ప్రాంతాలను నేడు సందర్శించనున్నారు.ఈ మేరకు నాగార్జున సాగర్,బుద్ధవనం తదితర పర్యటక ప్రాంతాలను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. సాగర్ పట్టణాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు సాగర్ లో విస్తృత బందోబస్తు చర్యలను తీసుకున్నారు.

సాగర్‌లో విస్తృత తనిఖీలు...

ప్రపంచ అందగత్తెల భద్రతా దృష్ట్యా పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏరియా డామినేషన్ బృందాల చేత అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాగార్జునసాగర్ లో దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రపంచ సుందరీమణులు బుద్ధ వనాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో డ్రోన్ల సంచారంపై పోలీసులు నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నాగార్జునసాగర్ వెళ్లే ప్రధాన రహదారితో పాటు సాగర్ లోని పలు పర్యాటక ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ లతో అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంచనీయా సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ప్రపంచ సుందరీమణుల బుద్ధవనం సందర్శన ప్రాంతాలలో డ్రోన్లపై నిషేధం ఆజ్ఞలు జారి చేశారు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.

అటవీ ప్రాంతంలో కుళ్ళిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

నార్సింగి, మే 11 (జనం సాక్షి) : మండల పరిధి లోని నర్సంపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి శవం కుళ్లిన స్థితి లో లభ్యమైంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నర్సంపల్లి గ్రామానికి చెందిన జెగ్గరి చంద్రం వ్యవసాయ వృతి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనులు లేనప్పుడు సమీపంలోని అటవీ ప్రాంతంలో బీడీల కొరకు తునికి ఆకును తెంపి తెచ్చుకుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8 గం లకు గ్రామానికి చెందిన బొమ్మగారి ప్రభాకర్, బొమ్మగారి స్వామి తో పాటు తునికి ఆకు కొరకు గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతానికి బయలుదేరారు. మధ్యాహ్నం 3 గం లకు వారికి గుర్తు తెలియని వ్యక్తి శవం కుళ్లిన స్థితి లో కనబడింది. విషయాన్ని స్థానిక పోలీసులకు తెలుపగా స్థానిక ఎస్ఐ సిబ్బంది తో పాటు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరీక్షించారు. లభించిన గుర్తు తెలియని శవం పురుషుడిది అని, పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని, మతి స్థిమితం లేక అటవీ ప్రాంతంలో సంచరిస్తూ అనారోగ్యం తో దాదాపు నెల క్రితం చనిపోయినట్లు తెలుస్తుందని అన్నారు. మృతుని వయస్సు 50 నుంచి 60 సం ఉంటుందని, నీలి రంగు, ఎర్ర డబ్బాల డిజైన్ తో ఫుల్ షర్ట్, ఆకుపచ్చ రంగు లుంగీ, లేత గులాబి రంగు బనీను ధరించి ఉన్నాడని, నడుము కు రెండు వరుసల నల్లని రంగు మొలతాడు ఉందని, తల వెంట్రుకలు నలుపు తెలుపు రంగులో ఉండగా, తెల్ల వెంట్రుకల గడ్డం మీసాలు తో శవం ఉందని తెలిపారు. జెగ్గరి చంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ కోరారు.

13 నుండి ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగతులు

నల్గొండ బ్యూరో, మే 11 (జనం సాక్షి) : ఈ నెల 13 నుండి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు డీఈవో బిక్షపతి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు తొలివిడత శిక్షణ శిబిరాలు13వ తేదీ నుండి 17వ తేదీ వరకు, రెండవ విడత శిక్షణ శిబిరాలు 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు, మూడో విడత శిక్షణ శిబిరాలు 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన తెలిపారు.శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందు 12వ తేదీన సంసిద్ధత సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.జిల్లాస్థాయిలో ఉపాధ్యాయుల మొదటి విడత శిక్షణకు స్కూల్ అసిస్టెంట్,ఇంగ్లీష్, గణితం,సోషల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు,రిసోర్స్ పర్సన్లు, జిల్లాలోని ఉర్దూ మీడియం ప్రైమరీ టీచర్లు,స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, మరియు ఐ ఈ ఆర్ పి లు పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్సస్ హై స్కూల్, ప్రభుత్వ డైట్ కళాశాల,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైట్ నందు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న డీఈఓ బిక్షపతి పేర్కొన్నారు.ఈ శిక్షణ తరగతులకు జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు విధిగా పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.మూడు విడుతలుగా నిర్వహించనున్న శిక్షణ తరగతులకు 3173 టీచర్లు పాల్గొననున్నారని ఆయన తెలిపారు.జిల్లాలోని అన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలని రాబోయే విద్యా సంవత్సరానికి ఎన్రోల్మెంట్ పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ బిక్షపతి కోరారు.సమ్మర్ క్యాంపులను ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

తల్లికి చికిత్స చూసేందుకు వచ్చి కుమారుడు అదృశ్యం

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) : నిమ్స్ దవాఖానలో ఉన్న తన తల్లిని చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. పంజాగుట్ట పోలీసలు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జల్లాకు చెందిన ఎండి అహ్మద్ పాషా ఈ నెల 9న నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న తన తల్లిని చూసేందుకు వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి వస్తానంటూ చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేదు. వెంటనే ఫోన్ చేయగా, తాను ఎక్కడ ఉన్నది స్పష్టంగా చెప్పలేకపోయాడు. మరికొద్ది సేపటికి వేరే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ తాను శ్రీనగర్‌కాలనీలోని సాయిబాబా గుడిలో ఉన్నట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా, కనిపించలేదు. మరో సారి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాధితుడి మానసిక స్థితి సరిగా లేదని, కళ్లు తాగే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు పోలీసుల దృష్టికి తెచ్చారు.

కారులో చెలరేగిన మంటలు

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) : వేగంగా వెళ్తున్న కారులో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం శంషాబాద్ మండలం తొండుపల్లి వద్ద జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన ఉస్మాన్ ప్రస్తుతం ఎల్బీనగర్‌లో నివాసముంటు ఆరునెలల క్రితం టీఎస్11యూబీ 7861 నంబర్‌గల టాటాజెట్ కారును కోనుగోలు చేసి డ్రైవర్ కం ఓనర్‌గా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం నగరంలోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఇద్దరు ప్రయాణికులను తీసుకొని శంషాబాద్ మండలంలోని సమాతమూర్తి స్ఫూర్తి కేంద్రం నుంచి తిరిగి వెళ్తుండగా హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిలో తొండుపల్లి సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ ఉస్మాన్ ఇద్దరు ప్రయాణికులను కిందకు దింపి అతను దిగిపోయాడు. అనంతరం కారులో పూర్తిగా మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చేలోపు కారు పూర్తిగా దగ్ధమైందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా..

- ఎమ్మెల్యే వివేకానంద్

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ ఫామ్ గ్రోవ్‌లో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి అపర్ణ ఫామ్ గ్రోవ్‌లో అధికారులతో కలిసి కాలనీలో మురుగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపర్ణ ఫామ్ గ్రోవ్‌లో మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. మౌళిక వసతుల కల్పనలో భాగంగా మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణా రెడ్డి, కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, డప్పు కిరణ్, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, సీనియర్ నాయకులు షన్ను, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి ఓపెన్ జైలు సూపరింటిండెంట్‌గా వెంకటేశ్వర్లు

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) : చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటిండెంట్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఓపెన్ జైలు సూపరింటిండెంట్‌గా పనిచేసిన సమ్మయ్య రెండు నెలల క్రితం పదవీవిరమణ పొందారు. దీంతో అప్పటి నుంచి చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న రామచంద్రం ఖైదీల వ్యవసాయక్షేత్రం ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల పదోన్నతులలో భాగంగా ఖమ్మం జిల్లా జైలు అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును పదోన్నతి కల్పిస్తు చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటిండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల సంక్షేమానికి చర్యలు తీసుకోవడంతోపాటు సిబ్బంది సహకారంతో జైలు అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వృద్ధుడు మృతి

పాపన్నపేట, మే 11 (జనంసాక్షి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందగా..మరొక వ్యక్తి చికిత్స పొందుతున్నాడు.ఈ విషాద సంఘటన కుర్తివాడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కుర్తివాడ గ్రామానికి చెందిన కర్రోళ్ల శేఖర్(62)స్థానిక హనుమాన్ ఆలయంలో పని చేస్తున్నాడు.ఆదివారం ఉదయం ఆరోగ్య సంబంధిత మందులు తెచ్చుకునేందుకు తన ద్విచక్ర వాహనంపై పాపన్నపేటకు వెళ్తున్నాడు.గ్రామ గేటు వద్దకు రాగానే మిన్ పూర్ వైపు నుండి మెదక్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహన దారుడు కిష్టయ్య ద్విచక్ర వాహనం వేగంగా డీ కొట్టడంతో శేఖర్ కు తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వారిని మెదక్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు శేఖర్ మృతి చెందాడు.దీంతో కుర్తివాడ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. కాగా..మిన్పూర్ ద్విచక్ర వాహనదారుడు కిష్టయ్యకు సైతం తలకు తీవ్ర గాయాలయ్యాయి.మెదక్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలి

- అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కొల్చారం, మే 11 (జనం సాక్షి) : పహల్గాం నేపథ్యంలో దాడి నేపథ్యంలో ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర విజయవంతం కావాలని...రేణుక ఎల్లమ్మ ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ జాతర కార్యక్రమానికి ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తల్లి ఆశీస్సులు పొందారు. ఒగ్గు కళాకారులు ఎల్లమ్మ తల్లి చరిత్ర గానం చేయగా ఎమ్మెల్యే శ్రద్ధగా విన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో పాటు ఆమెతో ఉన్న నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి చల్లని ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలని, పహల్గాం దాడి నేపథ్యంలో భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని తల్లిని వేడుకున్నారు. శత్రుదేశం దాడుల్లో దేశ సైనికులకు అపాయం కలగకుండా, సురక్షితంగా కాపాడాలని ఎల్లమ్మ తల్లిని కోరారు. తల్లి కృపా కటాక్షం తో సైనికులు అమిత బలం పొందాలని వేడుకున్నారు. కొల్చారం లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ఐదవ వార్షికోత్సవం పురస్కరించుకొని గ్రామకంఠంలో ఉన్న దుర్గమ్మ, పోచమ్మలకు ఆదివారం ఘనంగా బోనాలను సమర్పించారు. ఐదవ వార్షికోత్సవం సందర్భంగా కొల్చారం గౌడ సంఘం ఆధ్వర్యంలో అందంగా పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాలను నూతన వస్త్రాలు ధరించిన మహిళలు బోనం నెత్తిపై పెట్టుకొని ప్రధాన వీధుల్లో గుండా ఊరేగిస్తూ అమ్మ దీవించు తల్లి అంటూ దుర్గమ్మ పోచమ్మలకు నైవేద్యంతోపాటు బోనాలను సమర్పించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమా రాజగౌడ్, మాజీ ఎంపీటీసీ అరుణ కృష్ణ గౌడ్, సి డి సి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు వరిగుంతం సంతోష్ కుమార్, బి ఆర్ఎస్ పార్టీ మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, సొసైటీ చైర్మన్ నాగూర్ మనోహర్, మాజీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ సర్పంచ్ కరెంటు ఉమాదేవి రాజ గౌడ్, ఏడుపాయల మాజీ డైరెక్టర్ గౌరి శంకర్, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ గౌడ్, మాజీ ఉపసర్పంచులు చిన్న రాములు, ఎండుగల కృష్ణ, జులకంటి సంగమేశ్వర్, కమ్మరి శ్రీనివాస్, చౌరిగారి భాస్కర్, పాంద్ర వెంకటేశం, రైతు సమితి మాజీ అధ్యక్షుడు గ్యాస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంఘం సభ్యులు రామకృష్ణ గౌడ్ అశోక్ గౌడ్, ఉపేందర్ గౌడ్,లక్ష్మి నారాయణ గౌడ్, యాదగౌడ్,దుర్గ గౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్, రాజా గౌడ్, రాజేందర్ గౌడ్,శేఖర్ గౌడ్, కిరణ్ గౌడ్, నారా గౌడ్ ,శేఖర్ గౌడ్,పాపా గౌడ్, కిరణ్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, రామా గౌడ్,శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ గణేష్ గౌడ్, కృష్ణ గౌడ్,ప్రతాప్ గౌడ్, క్రాంతి గౌడ్, దిక్షిత్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

- శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్

ఆత్మకూర్ (ఎస్), మే 11 (జనంసాక్షి) : పాత్రికేయులు సమాజానికి ఉపయోగపడే మంచి వార్త కథనాలు రాస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర శాసనమండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ స్పోకింగ్ పర్సన్, డాక్టర్ అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూర్ (ఎస్)మండలం నెమ్మికల్‌లో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం(టీజేఎస్) రెండు రాష్ట్రాల స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డు పొందిన సూర్యాపేట ఆంధ్రప్రభ కలెక్టరేట్ రిపోర్టర్ పల్లా పరమేష్ ను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదుగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ నేపథ్యం నుండి ఎదిగి జిల్లాస్థాయి వార్త కథనాలు రాసి రెండు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక కావడం అభినంద నీయమన్నారు. అనంతరం పరమేష్ ను శాలువ, పూల బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి సతీమణి నాగమణి, మనం ఫౌండేషన్ అధ్యక్షులు గంపల నారాయణ, ఆత్మకూర్ (ఎస్) జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత భూపతి రాములు గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జానకి రెడ్డి, మనం ఫౌండేషన్ నిర్వాహకులు గంపల కృపాకర్, మండల కాంగ్రెస్ నాయకులు గంగరబోయిన శ్రీనివాస్, పాత్రికేయులు జలగం మల్లేష్ గౌడ్, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, నెమ్మికల్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'వేద' మా అమ్మ పేరు.. 'వేదాంత' నా కంపెనీ పేరు..

వేదాంత గ్రూప్ వ్యవస్థాపకుడు అనిల్ అగర్వాల్ తన తల్లి స్ఫూర్తితో సాధారణ వ్యక్తి నుంచి ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. బీహార్‌లోని పాట్నాలో జన్మించిన అగర్వాల్, కెరీర్ ఆరంభంలో విఫలమైనప్పుడు నిరాశకు గురయ్యారు.అప్పుడు అమ్మే అండగా నిలిచింది. గుండెల్లో ధైర్యం నింపింది. మాతృ దినోత్సవం సందర్భంగా ఈ తల్లీకొడుకుల అనుబంధం గురించి తెలిపేదే ఈ కథనం.. విజయవంత మైన ప్రతి ఒక్కరి జీవితంలో ప్రారంభ రోజులు పరీక్షగానే ఉంటాయి. ఎవరు అవమానించినా, హేళన చేసినా ఈ పరీక్షలో వారికి తోడుగా నిలిచేది తల్లి మాత్రమే. అలాగే అనిల్ అగర్వాల్‌కూ అమ్మ అండగా నిలిచింది. విజయం వైపు నడిపించింది. "అనిల్.. ముందుకు సాగు.. తలుపులు తెరుచుకుంటాయి" అని తన తల్లి చెప్పిన మాటలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటారాయన.ఈ మాటలు ఆయనలో సంకల్పాన్ని నింపాయి. వేదాంతను స్థాపించి భారత జీడీపీలో 1.4% వాటా సాధించే సంస్థగా నిలిపారు.ప్రస్తుతం వేదాంత ఒక పెద్ద మార్పును చేస్తోంది. 83% ఆమోదంతో డీమెర్జర్‌కి క్రెడిటర్స్ ఆమోదం లభించింది. దీనివల్ల సంస్థ ఐదు స్వతంత్ర విభాగాలుగా విడిపోతుంది. సెప్టెంబర్ 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తవు తుందని అగర్వాల్ ఆశిస్తున్నారు. ఈ డీమెర్జర్ షేర్‌హోల్డర్ల విలువను పెంచి, రుణ భారాన్ని తగ్గిస్తుంది. గత ఐదేళ్లలో వేదాంతలో పెట్టుబడులు 4.7 రెట్ల రాబడిని ఇచ్చాయి.వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యతపై కూడా అగర్వాల్ దృష్టి ఉంది. అనిల్ అగర్వాల్ ఫౌండేషన్ ద్వారా నడిచే నంద్‌ఘర్ కార్యక్రమం బాల్య విద్యను ప్రోత్సహిస్తుంది. మదర్స్ డే సంద ర్భంగా, తల్లుల పాత్రను గౌరవిస్తూ తన తల్లి స్ఫూర్తిని తాజాగా మరోసారి గుర్తు చేసుకున్నారు అనిల్ అగర్వాల్. ఈమేరకు 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. అమ్మ అంటే కేవలం శరీరం మాత్రమే కాదు ఆమె మీ ఉనికే. ఆమె శరీర రూపంలో మనతో లేకపోయినా, ఆమె ఆత్మ శ్వాస మనతోనే ఉంటుంది.కాలం, దేవుడి కృపగా మారి కన్నీళ్లను ఆరబెడుతుంది. అంతు లేని బాధను సానుకూల శక్తిగా మార్చి మనకు బతకడానికి ఒక మార్గాన్ని చూపిస్తుంది.విచారం, కాలంతో పాటు శక్తిగా మారుతుంది, ఎందుకంటే మీ ప్రేమ నిజమైనది.ఉదయం లేచినప్పుడు ఏదో భక్తి గీతం, ఆలోచించ కుండానే నోటిలోకి వచ్చినట్లు, అలాగే అమ్మ జ్ఞాపకం మనసులో వెలుగును నింపుతూ ఉంటుంది.ఖాదీ బట్టల వాసన లేదా అగరబత్తి సుగంధంలో తరచూ అమ్మ ఉనికిని అనుభవిస్తాను.మా అమ్మకు ఇంగ్లీష్ రాదు, కానీ లండన్‌లో ఉంటూ ఆమె ఇంగ్లీష్ వాళ్లతో చక్కగా సంభాషించేది. భావనల భాషకు పదాల అవసరం ఎప్పుడూ ఉండదు.పెద్ద నిర్ణయం తీసుకునే ప్రతిసారీ ఒక క్షణం ఆగిపోతాను. అమ్మ ఆశీర్వాదం కావాలన్నట్లు అనిపిస్తుంది.

అడుగేస్తే ఆఫీస్..!

ఇలాంటి ఇళ్లకే మొగ్గుచూపుతున్న టెక్కీలు

కరోనా తర్వాతి నుంచి గృహ కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. కోవిడ్‌తో వర్క్ ఫ్రం హోమ్ అలవాటైన ఉద్యోగస్తులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపించ డం లేదు. గంటలకొద్దీ ప్రయాణం చేస్తూ.. కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఆఫీసుకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఈ నేప థ్యంలో వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లకు డెవలపర్లు శ్రీకారం చుట్టారు. ఆఫీసులకు చేరువలోనే గృహాలతో పాటు స్కూల్, ఆస్పత్రి, షాపింగ్ మాల్, పార్కు వంటి అన్ని రకాల వాణిజ్య ఏర్పాట్లు ఉండటం వీటి ప్రత్యేకత. దీంతో ఈ తరహా ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది.

పనిచేసే కార్యాలయానికి చేరుకోవడానికి అత్యధిక శాతం మంది తక్కువలో తక్కువ గంటసేపు బస్సుల్లోనో లేదా ఇతరత్రా వ్యక్తిగత వాహనాల్లోనో గడిపేస్తున్నారు. దీంతో విలువైన సమయం వృథా అవుతోంది. కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. అయితే ఈ వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లో ఇల్లు, ఆఫీసు, మాల్, పార్కులు, స్కూల్, ఆస్పత్రి.. ఇలా సమస్త అవసరాలూ ఒకే చోట ఉంటాయి. నడిచి వెళ్లేందుకు అనువైన దూరంలో కార్యాలయం, షాపింగ్ మాల్స్ ఉండాలని కోరుకునే వారి సంఖ్య నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది. 'ఈ మధ్యకాలంలో మా వద్దకు వచ్చే ఐటీ నిపుణులు చాలా మంది ఇలాంటి ఫ్లాట్లే కావాలని అడుగుతున్నారు. అయితే ఈ వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌ల్లో కేవలం అన్ని సౌకర్యాలు ఒకే చోట ఉంటే సరిపోదు. ఆ ప్రాంతం కూడా అభివృద్ధికి చిరునామాగా నిలవాలి. అందుకే ఐటీ, బీపీఓ వంటి వాటితో గచ్చి'చిలి, మాదాపూర్‌లు ఎలా అయితే వృద్ధి చెందాయో అంతకు రెట్టింపు అభివృద్ధి జరుగుతుంది. గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వాక్ టు వర్క్ ప్రాజెక్టులు ఇప్పుడు నగరం చుట్టూ విస్తరిస్తున్నాయి. ఐటీఐఆర్ ప్రాజెక్ట్‌తో వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లకు మరింత ఊపొచ్చింది. ఆదిభట్ల, ఉప్పల్, పోచారం, మహేశ్వరం వంటి శివారు ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతాలకు చుట్టూ 4 కి.మీ. పరిధిలో వాక్ టు వర్క్ ప్రాజెక్టులు నిర్మించేందుకు బిల్డర్లు ముందుకొస్తున్నారు.నగరంలోని మొత్తం రెండు లక్షల మందికి పైగా ఐటీ ఉద్యోగుల్లో అత్యధికులు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోనే విధులు నిర్వహిస్తుంటారు. ఇక్కడికి సిటీ నలువైపుల నుంచి వచ్చే వారు కొందరైతే, ఐదారు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిపోయేవారు మరికొందరు. వాక్ టు వర్క్ ప్రాజెక్ట్‌లతో ఇప్పుడు ఈ దూరం కూడా తగ్గిపోతుంది. ఒకవైపు కార్యాలయాలు, మరోవైపు గృహ నిర్మాణాలు.. ఇంకేం ఎంచక్కా నడుచుకుంటూ ఆఫీసుకు వెళ్లిపోవచ్చు. ఉదయం నడకకు బద్ధకించేవారికి ఇదొక వాకింగ్ గానూ ఉపయోగపడుతోంది. ఆరోగ్యం దృష్ట్యా సైకిల్‌పైనా ఆఫీసులకు కూడా వెళ్లొచ్చు.



స్విగ్గీకి నష్టాలు డబుల్

ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నష్టం రెట్టింపై రూ. 1,081 కోట్లను తాకింది. క్విక్‌కామర్స్‌పై భారీ పెట్టుబడులు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 555 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,046 కోట్ల నుంచి రూ. 4,410 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు మరింత అధికంగా రూ. 3,668 కోట్ల నుంచి రూ. 5,610 కోట్లకు పెరిగాయి. ఫుడ్ డెలివరీ విభాగంలో స్థూల ఆర్డర్ విలువ 18 శాతం అధికమై రూ. 7,347 కోట్లకు చేరినట్లు స్విగ్గీ వెల్లడించింది. నిర్వహణ లాభం ఐదు రెట్లు ఎగసి రూ. 212 కోట్లను తాకింది. స్విగ్గీ స్మార్ట్ సగటు ఆర్డర్ విలువ 13 శాతం మెరుగుపడి రూ. 527కు చేరగా.. 316 డార్క్ స్టోర్లను జత కలుపుకుంది.కాగా స్విగ్గీ ప్రధాన పోటీదారు ఈ మధ్యనే ఎటర్నల్‌గా పేరు మార్చుకున్న జొమాటో నికర లాభాలు కూడా భారీగా పడిపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో సంస్థ నికర లాభాలు 78 శాతం పతనమై రూ39 కోట్లతో సరిపెట్టుకుంది. సంస్థ రెవెన్యూ 64 శాతం పెరిగి రూ.5,833 కోట్లుగా చోటు చేసుకుంది.

వీసీ పెట్టుబడుల జోరు..

న్యూఢిల్లీ: రెండేళ్ల పాటు నెమ్మదించిన ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ (పీఈ-వీసీ) పెట్టుబడులు గతేడాది మళ్లీ జోరందుకున్నాయి. 9 శాతం పెరిగి 43 బిలియన్ డాలర్లకు చేరాయి. సుమారు 1,600 డీల్స్ నమోదయ్యాయి. ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ), బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన 'ఇండియా ప్రైవేట్ ఈక్విటీ రిపోర్ట్ 2025' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆసియా-పసిఫిక్‌లోకి వచ్చిన మొత్తం పీఈ-వీసీ పెట్టుబడుల్లో దాదాపు ఇరవై శాతం భారత్‌లోకి ప్రవహించాయని రిపోర్ట్ వివరించింది. తద్వారా ఈ ప్రాంతంలో పీఈ-వీసీ ఇన్వెస్ట్‌మెంట్లకు రెండో అతి పెద్ద గమ్యస్థానంగా భారత్ స్థానం మరింత పటిష్టమైందని తెలిపింది. దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితుల స్థిరత్వంపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోందని పేర్కొంది. ఇన్వెస్టర్లు పెట్టుబడుల ద్వారా స్వల్ప వాటాలతో సరిపెట్టుకోకుండా సంస్థలను పూర్తిగా కొనుగోలు చేసే ధోరణి పెరిగింది. 2022లో నమోదైన పీఈ డీల్స్ విలువలో సంస్థల కొనుగోళ్ల ఒప్పందాల వాటా 37 శాతంగా ఉండగా 2024లో 51 శాతానికి పెరిగింది. వివిధ రంగాలవ్యాప్తంగా అత్యంత నాణ్యమైన అసెట్స్‌లో నియంత్రణాధికారాలను చేజిక్కించుకో వడంపై ఇన్వెస్టర్లు మరింతగా దృష్టి పెడుతుండటాన్ని ఇది సూచిస్తోంది. గతేడాది వచ్చిన మొత్తం పీఈ-వీసీ పెట్టుబడుల్లో రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలు 16 శాతం వాటా దక్కించుకున్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే డీల్ విలువ 70 శాతం పెరిగింది.ఆర్థిక సేవల విభాగం 25 శాతం వృద్ధి చెందింది. 14 డీల్స్ నమోదయ్యాయి. వీటిలో 100 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే డీల్స్ ఏడు ఉన్నాయి. హెల్త్‌కేర్ విభాగంలోకి కూడా గణనీయంగా నిధులు వచ్చాయి. హెల్తియం వంటి భారీ మెడ్‌టెక్ లావాదేవీల దన్నుతో ఒప్పందాల పరిమాణం 80 శాతం పెరిగింది. ఫార్మా సీడీఎంవోల్లోకి పెట్టుబడులు పెరిగాయి.

ఎస్‌బీఐ జనరల్ కొత్త ఇన్సూరెన్స్ పాలసీ

ముంబై: ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కొత్తగా ఎస్‌బీఐ జనరల్ ఫ్లెక్సీ హెూమ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. సొంతిల్లు లేదా అద్దె ఇంటికి సంబంధించి సమగ్రమైన బీమా రక్షణను ఈ ప్లాన్ అందిస్తుందని ఎస్‌బీఐ జనరల్ తెలిపింది.కస్టమర్లు తమ అవసరాలకు అనుకూలంగా దీన్ని తీసుకోవచ్చని పేర్కొంది.ఇంట్లోని విలువైన వస్తువుల తోపాటు.. ప్రత్యామ్నాయఇంట్లోని విలువైన వస్తువుల తోపాటు.. ప్రత్యామ్నాయ వసతి కోసం అయ్యే వ్యయాలు, ఇంట్లో చోరీల నుంచి రక్షణ ఇలా అన్ని రకాల రక్షణలు ఈ ప్లాన్‌లో అందుబాటులో ఉంటాయి. ఫైర్ కవర్ ఒక్కటి తప్పనిసరిగా ఉంటుంది. మిగిలినవి పాలసీదారులు తమ అవసరాలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చు. ఒక్కసారి ప్రీమియంతో 20 ఏళ్లకు రక్షణ పొందొచ్చని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వెల్లడించింది.

కెనరా బ్యాంక్ కస్టమర్లకు శుభవార్త

ముంబై: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్ రుణ రేట్లను తగ్గించింది. ఏడాది కాలపరిమితికి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 9% చేసినట్లు బ్యాంకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.దీనితో వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేటు భారం తగ్గనుంది.ఇక, ఒకరోజు ఎంసీఎల్ఆర్ 8.20%, ఒక నెల, మూడు, ఆరు నెలల కాలవ్యవధి ఎంసీఎల్ఆర్ 8.25% - 8.80 శాతం శ్రేణిలో ఉండనున్నాయి. కొత్త రేట్లు మే 12 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంకు తెలిపింది. ఆర్‌బీఐ గత నెల రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి ఆరుశాతానికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

పాక్ ప్రధాని వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపాటు



ఇస్లామాబాద్: సరిహద్దుల్లో మూడు రోజులుగా జరుగుతున్న భీకర పోరులో అమెరికా మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్తాన్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంట ల్లోనే పాకిస్తాన్ తన వక్రబుద్ధిని చాటుకుంటూ రెచ్చగొట్టే విధంగా సరిహద్దులో కాల్పులు జరిపింది. అంతటితో ఆగకుండా.. పాక్ ప్రధాని విచిత్రంగా తమదే గెలుపు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత షెహబాజ్ షరీఫ్ పాకిక్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధంలో తాము విజయం సాధించినట్టు పేర్కొన్నారు. తమ దేశాన్ని, తమ పౌరులను రక్షించుకోవడానికి తాము ఏది చేయడానైనా వెనుదిరిగేది లేదన్నారు. పాక్‌ను ఎవరైనా సవాల్ చేస్తే వారిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని వెల్లడించారు. భారత్ తమ దేశంలోని మసీదులు, సామాన్య పౌరులపై డ్రోన్స్, మిస్సైల్స్ తో దాడులు చేసిందని.. అనేకమంది సాధారణ పౌరుల చావుకు భారత్ కారణమైందని మండిపడ్డారు. తమదేశంపై నిరాధార ఆరోపణలు కూడా చేస్తుందని.. భారత్‌కు తగిన బుద్ధి చెప్పామని.. తమ జోలికి వస్తే ఏదైనా చేయగలమని చూపించామంటూ ఓవరాక్షన్ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఇక, ఈ వీడియోపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. పాక్ ప్రధాని తీరును ఎండగడుతున్నారు. అమెరికా మధ్యలోకి రాకపోతే పాకిస్తాన్ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. భారత్ దాడులను తట్టుకోలేక తోక ముడిచి.. ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాకిస్తాన్‌కు ఇంత నష్టం జరిగినా మీది ఎలా గెలుపు అవుతుందని ప్రశ్నిస్తున్నారు.ఇదిలా ఉండగా.. ఒకవైపు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే, మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా, సౌదీ అరేబియా తదితర దేశాలకు పాక్ ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడాన్ని యునైటెడ్ కింగ్‌డమ్, సౌదీ అరేబియా స్వాగతించాయి. ఉద్రిక్తతల నివారణకు ఇది కీలకమైన ముందడుగు అని యూరోపియన్ యూనియన్ పేర్కొంది. ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండేలా అన్ని ప్రయత్నాలు జరగాలని ఆకాంక్షించింది.ఇక, ఈ వీడియోపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. పాక్ ప్రధాని తీరును ఎండగడుతున్నారు. అమెరికా మధ్యలోకి రాకపోతే పాకిస్తాన్ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. భారత్ దాడులను తట్టుకోలేక తోక ముడిచి.. ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాక్ డ్రోన్లు.. తుక్కు తుక్కు

విజయవంతంగా ధ్వంసం చేసిన భారత్

న్యూఢిల్లీ: స్వార్మ్ డ్రోన్లతోపాటు కమికాజ్ డ్రోన్లను భారత్‌లో విధ్వంసానికి పాకిస్తాన్ ప్రయోగించగా భారత్ వాటిని విజయవంతంగా అడ్డుకుని ముక్కలుచెక్కలు చేసింది. పహల్గాం ఉదంతం తర్వాత భారత్, పాక్ మధ్య మొదలైన సైనిక చర్యల పర్వంలో పాకిస్తాన్ ఈ కామికాజి డ్రోన్లను ఉపయోగించడం ఇదే తొలిసారి అని రక్షణరంగ నిపుణులు శనివారం వెల్లడించారు. గతంలో అర్మేనియా-అజర్‌బైజాన్ సాయుధ సంఘర్షణలో, ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ యద్ధంలో ఈ కమికాజ్ డ్రోన్ల వినియోగం ఎక్కువైంది. ఇప్పుడు భారత్ పైకి పాకిస్తాన్ కమికాజ్ డ్రోన్లను పెద్ద ఎత్తున ప్రయోగించడంతో ఈ తరహా డ్రోన్లపై చర్చ మొదలైంది. కమికాజ్ డ్రోన్‌ను ఆత్మాహుతి డ్రోన్‌గా పేర్కొంటారు. బాంబును లేదా క్షిపణిని మోసుకొస్తూ సంబంధిత లక్ష్యంగా బాంబు/క్షిపణిని జారవిడవడం లేదంటే స్వయంగా అదే కూలిపోయి, పేలిపోవడం ఈ కమికాజ్ డ్రోన్ ప్రత్యేకత. మే 8వ తేదీ అర్ధరాత్రి తర్వాత లేహ్ నుంచి సర్ క్రీక్ ఉప్పుకయ్య దాకా 36 వేర్వేరు ప్రదేశాల గుండా సరిహద్దు ఆవలి నుంచి దాదాపు 400 డ్రోన్లు దూసుకొచ్చాయి. దీంతో క్షణాల్లో అప్రమత్తమైన పలు రకాలైన భారత గగనతల రక్షణ వ్యవస్థలు ఈ డ్రోన్లను అడ్డుకుని కూల్చేశాయి. భారత్ ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన సాంకేతికతతో గగనతల రక్షణ వ్యవస్థను పటిష్టం చేసిన కారణంగానే ఈ డ్రోన్లను నిర్వీర్యం చేయగలిగిందని, లేదంటే తీవ్ర నష్టం చవిచూడాల్సి వచ్చేదని రక్షణ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి ఈ డ్రోన్లను కూల్చేశాక వీటి శకలాలను భారత మిలటరీ అధికారులు ల్యాబ్‌లకు తరలించి పరిశీలించడంతో ఇవి కమికాజ్ రకానికి చెందినవని నిర్ధారించారు. పంజాబ్, రాజస్తాన్‌లలో ఈ తరహా డ్రోన్ల శకలాలు లభించాయి.తుర్కియే దేశంలోని అసిస్‌గార్డ్ సోన్‌గర్ డ్రోన్ కంపెనీ ఈ కామికాజి డ్రోన్లను తయారుచేస్తుంది. దీంతో వీటిని పాకిస్తాన్ తుర్కియే నుంచే తెప్పించినట్లు స్పష్టమైంది. శనివారం తెల్లవారుజామున సైతం బైకర్ వైఐహెచ్ఏ- ఐఐఐ కమికాజ్ డ్రోన్లు పంజాబ్, రాజస్తాన్ సరిహద్దుల గుండా భారత గగనతలంలోకి వచ్చాయి. వీటిని ఎయిర్ డిఫెన్స్ గన్స్‌తో నేలమట్టం చేశామని రక్షణ శాఖ అధికారులు ప్రకటించారు. కమికాజ్ అనేది జపాన్ పేరు. జపాన్ వైమానిక దళంలోని ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక దళం ఇది. ఇది ఆత్మాహుతి ఫైటర్ పైలట్ల విభాగం. రెండో ప్రపంచ యుద్ధకాలంలో శత్రుదేశాల యుద్ధనౌకలను పేల్చేసేందుకు జపాన్ పైలట్లు తమ యుద్ధవిమానాలను వాటితో ఢీకొట్టించేవారు. అలా రెండో ప్రపంచ యుద్ధకాలంలో దాదాపు 3,800 మంది కమికాజ్ పైలట్లు ఆత్మాహుతి దాడులతో ఏకంగా 7,000 మంది శత్రుదేశాల నావికా సిబ్బందిని చంపేశారు. ఈ స్ఫూర్తితో తయారుచేసిన డ్రోన్లకు కమికాజ్ అని పేరుపెట్టారు.

పాక్‌కు ఐఎంఎఫ్ రుణంపై విమర్శల వెల్లువ

- **రూ. 8,000 కోట్లకుపైగా నిధుల విడుదలకు ఐఎంఎఫ్ ఓకే**
- **తీవ్రంగా తప్పుబట్టిన అంతర్జాతీయ సమాజం**

న్యూయార్క్: పాకిస్తాన్ దన్నుతో ఉగ్రవాదులు పహల్గాంలో అనాగరిక దాడులకు తెగబడినందుకే సైనిక చర్య చేపట్టామని భారత్ ఓవైపు అంతర్జాతీయ సమాజానికి చెబుతుంటే మరోవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) అదే దాయాదిదేశానికి భారీ సాయం చేయడం వివాదాస్పదమైంది. ఆపరేషన్ సిందూర్‌లో హతమైన ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరపడంతో ఉగ్ర, పాక్ దోస్తీ బట్టబయలైన సమయంలోనే ఇంటర్నేషన్ మానిటరీ ఫండ్ ఇలా నిధులు ఇవ్వడమేంటని పలువురు అంతర్జాతీయ ఆర్థికరంగ నిపుణులు విమర్శలు గుప్పించారు.పాకిస్తాన్‌కు మరో 1 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.8,540 కోట్లు వెంటనే ఇచ్చేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం అంగీకరించడమే ఈ విమర్శలకు అసలు కారణం. ఇటీవలే మరో 1.1 బిలియన్ డాలర్ల విడుదలకు ఐఎంఎఫ్ పచ్చజెండా ఊపడంతో మొత్తంగా పాకిస్తాన్‌కు 2.1 బిలియన్ డాలర్ల నిధుల వరద పారనుందని తెలుస్తోంది. వాతావరణ సంబంధ ప్రాజెక్టులు, పనుల నిమిత్తం పాకిస్తాన్ ఈ నిధులను కోరగా రుణంగా అందజేసేందుకు ఐఎంఎఫ్ ఒప్పుకుంది. అయితే ప్రజాపనుల నిమిత్తం నిధులు ఇస్తున్నాసరే, ఉద్రిక్తతల వేళ నిధుల విడుదల సహేతుకంగా లేదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు.ఇప్పటికే పరస్పర సైనిక చర్యల కారణంగా ఆయుధాల సేకరణ అనేది పాకిస్తాన్‌కు అత్యంత ప్రాధాన్యమైన అంశంగా మారింది. ఈ సమయంలో ఒకేసారి వేల కోట్ల రూపాయల నిధులు వచ్చిపడితే వాటిని సంబంధిత లక్ష్యం కోసం కాకుండా సైనిక సన్నద్ధత, ఆయుధాల కొనుగోలు కోసం దుర్వినియోగం చేసే ప్రమాదముందని నిపుణులు ఆందోళన వెలిబుచ్చారు. సమకాలీన పరిస్థితులను, కనీసం భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న తాజా పరిస్థితులను బేరీజు వేసుకుని అయినా నిధుల విడుదలపై ఐఎంఎఫ్ పునరాలోచన చేస్తే బాగుండేదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్‌కు అదనపు నిధుల విడుదల(ఈఎఫ్ఎఫ్)పై శుక్రవారమే ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సమావేశం జరిగింది. రెసీలెన్స్ అండ్ సస్టేనబిలిటీ ఫెసిలిటీ పథకంలో భాగంగా పాక్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై సమావేశం నిర్వహించారు. ఇందులో సభ్యదేశంగా భారత్ పాల్గొని ఉద్రిక్తత వేళ పాక్‌కు రుణవితరణ ఆపాలని డిమాండ్‌చేసింది. అయితే ఇక్కడ ఐక్యరాజ్యసమితి, భద్రత మండలి తరహాలో ఓటింగ్‌లో గైర్హాజరు వంటి అవకాశం ఉండదు. కేవలం అభ్యంతరం మాత్రమే వ్యక్తంచేయగలం.దీంతో గతంలో ఒప్పుకున్న 7 బిలియన్ డాలర్ల రుణాల్లో భాగంగా కొంతమేర నిధుల విడుదల చేయాలని ఎగ్జిక్యూటివ్ బోర్డ్ నిర్ణయించింది. సైనిక చర్యలో మునిగిన దేశానికి నిధులెలా ఇస్తారని భారత మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వాల్ సిబాల్ తప్పుబట్టారు. ఐఎంఎఫ్ తన చేతులకు అనవసరంగా రక్తం అంటించుకుంటోందని యశ్వంత్ దేశ్‌ముఖ్ విమర్శించారు. పాక్ తన ఆర్థిక సంస్కరణల ఊసే మర్చిపోయి మారణాయుధాల కొనుగోళ్లకు ఈ నిధులను కేటాయించడం ఖాయమని 'అబ్జర్వ్ రీసెర్చ్ ఫౌండేషన్'లో నిపుణుడు సుశాంత్ సరీన్ అన్నారు.గత 35 సంవత్సరాల్లో పాకిస్తాన్ ఇలా 28 రుణాలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఐఎంఎఫ్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ వాటిని సవ్యంగా అమలుచేసిన చరిత్ర ధూర్తదేశానికి లేదని భారత్ ప్రకటించింది. పాకిస్తాన్ భారత్‌పై బాంబులేస్తున్న వేళ ఈ రుణవితరణ ఏవిధంగా హేతుబద్ధం అనిపించుకుంటుందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తంచేశారు.

బ్రహ్మోస్ పనితీరు ఎలా ఉంటుందో పాక్‌కు తెలుసు

సీఎం యోగి

లక్నో: భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ లోని లక్నోలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. 'ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్'లో ఈ కేంద్రాన్ని నిర్మించారు. రాజ్‌నాథ్ సింగ్ వర్చువల్ విధానంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి పాల్గొన్నారు. ఈ యూనిట్‌కు 80 హెక్టార్ల భూమిని యూపీ సర్కార్ ఉచితంగా ఇచ్చింది.ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఇదే రోజున మన శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఢిల్లీలో ఉండాల్సి వచ్చింది. నేను లక్నో ఎందుకు రాలేదో మీ అందరికీ తెలుసు. ఇంత తక్కువ సమయంలో ఈ యూనిట్ సిద్ధం చేసిన వారికి అభినందనలు. 40 నెలల్లోనే ఈ ప్రొడక్షన్ యూనిట్‌ను పూర్తి చేశారు అని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ద్

భారతదేశమంటే పాకిస్తాన్‌కు మోడీ రుచి చూపించారు

బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, మే 11 (జనంసాక్షి)

భారతదేశమంటే ఏంటో పాకిస్తాన్ కు ప్రధాని నరేంద్ర మోడీ రుచి చూపించారని బిజెఎల్పి నేత, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం భారత సైనికులకు ఆత్మస్థైర్యం నింపాలని చిట్యాల గ్రామంలోని లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గంలో అమాయక 26 మంది హిందూ యాత్రికులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని, దానికి జవాబుగా నరేంద్ర మోడీ పాకిస్తాన్ నడి బొడ్డులో భారత సైన్యంతో ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడంతో పాటు వందలాది ఉగ్రవాదులను హత మార్చి పాకిస్తాన్ కు ఘాటుగా జవాబు చెప్పారని ఆయన అన్నారు. దిక్కుతోచని స్థితిలో పాకిస్తాన్ తమ దేశాన్ని బ్రతికించమని,యుద్ధాన్ని ఆపమని అగ్ర దేశాల ముందు యాచించడం జరిగిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఈ యుద్ధంలో భారత సైనికులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి యావత్ దేశమంతా అండగా నిలిచిందని తెలిపారు. భారతదేశం లో ఎప్పటికీ శాంతి కాముకులైనప్పటికీ,దేశం జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రపంచానికి ప్రధాని నరేంద్ర మోడీ చాటి చెప్పారని ఆయన అన్నారు. ఈరోజు భారతదేశమంతా నరేంద్ర మోడీని చూసి గర్వపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావుల రామనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు

సింగరేణి సిఎండిని కలిసిన పరుశురాంపల్లి గ్రామస్థులు

గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పించాలని వినతి

గణపురం, 11 మే (జనం సాక్షి):

భూపాలపల్లి సింగరేణి స్కిల్ డెవలప్ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా సింగరేణి సి ఎం డి బలరాం నాయక్ ను ఆదివారం పరుశురాం పల్లి గ్రామస్థులు కలిసి వినతి పత్రం అందజేశారు. గణపురం పరుశు రాంపల్లి గ్రామానికి అనుకుని ఉన్న సింగరేణి ఓసి త్రీ వల్ల ఎదుర్కునే సమస్యలను ఈ సందర్భంగా వివరించారు. 2002,03 సంవత్సరం అండర్ గ్రౌండ్ ద్వారా బొగ్గు సేకరించడం కోసం పరశురాంపల్లి గ్రామ పరిధిలో సింగరేణి ప్రారంభమైందని ఆ సమయంలో గ్రామానికి పునరావాసం బాధితులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని అన్నారని. క్రమక్రమంగా మా గ్రామంలో వ్యవసాయ భూమిని నేటి వరకు 99 శాతం వరకు పరిహారాన్ని అందించిందని సింగరేణి సంస్థ ఓసి 3 ప్రాజెక్టు కోసం స్వాధీనం చేసుకున్నారన్నారు. ఓసి త్రీ వల్ల బ్లాస్టింగ్ దుమ్ము దూళితో పరశురాంపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గ్రామాన్ని తరలించాలని సీఎండీకి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం డి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

గాయత్రి కో- ఆపరేటివ్ 63 బ్రాంచ్ ప్రారంభం

జగిత్యాల బ్యూరో, మే 11 (జనంసాక్షి)

మంచిర్యాల జిల్లా చెన్నూర్ యందు ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యొక్క 63వ శాఖను ఆదిలాబాద్ మాజీ జెడ్.పి.వైస్ చైర్మన్ మూల రాజరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చెన్నూర్ మాజీ జడ్.పి.టి.సి. బి. కరుణాసాగర్ రావు, చెన్నూర్ మున్సిపాలిటి మాజీ మున్సిపల్ చైర్మన్ అర్చన రాంలాల్ గిల్డా, బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ఎక్సైజ్ కాంట్రాక్టర్ కొరకొప్పుల నర్సగౌడ్, సీనియర్ వ్యాపార వేత్త హీరాలాల్, సీనియర్ వ్యాపార వేత్త తారాచంద్ దెవ, బ్యాంకు పాలక వర్గ సభ్యులు, పుర ప్రముఖలు, సహకార అధికారులు, బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్ గార్లు పాల్గొని బ్యాంకు వివిధ విభాగాలను ప్రారంభించారు.

అనంతరం ఆదిలాబాద్ మాజీ జెడ్. పి. వైస్ చైర్మన్ మూల రాజరెడ్డి మాట్లాడుతూ జగిత్యాల కేంద్రంగా 2000 సంవత్సరంలో యూనిట్ బ్యాంకుగా ప్రారంభించబడిన గాయత్రి బ్యాంకు వినియోగదారులకు పారదర్శక సత్వర సేవలందించాలనే ఉద్యేశంతో కృషిచేస్తూ.. నేడు మల్టీస్టేట్ బ్యాంకుగా రూ.3204.48 కోట్ల వ్యాపారాన్ని సాధించి 8,05,324 వినియోగదారులతో తెలంగాణలోని కో-ఆపరేటివ్ బ్యాంకులలో మొదటి స్థానముకు చేరుకున్నామని అన్నారు. అనంతరం చెన్నూర్ మాజీ జడ్పిటిసి. బి.కరుణాసాగర్ రావు మాట్లాడుతూ.. బ్యాంకు యందు మొబైల్ బ్యాంకింగ్, ఎఇపిఎస్, యుపిఐ. ఎటిఎమ్ సర్వీసులు, ఆర్.టి.జి.ఎస్ వంటి టెక్నాలాజికల్ సేవలతో పాటుగా నిరక్షరాస్యులకు సహాయకంగా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటుచేయడం, ఉదయం 10 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండడం, ఖాతాదారులకు అవసరమైన ఫోటో, జిరాక్స్ ను బ్యాంకు యందే ఉచితంగా అందించడం వంటి చాలా సేవలు వినూత్నంగా ఉన్నాయని వినియోగదారులు తప్పక ఆదరిస్తారని అన్నారు.

చెన్నూర్ మున్సిపాలిటీ మాజీ మున్సిపల్ చైర్మన్ అర్చన రాంలాల్ గిల్డా గారు మాట్లాడుతూ గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ద్వారా 1 లక్ష రూపాయల ప్రమాదభీమా సౌకర్యాన్ని అందిస్తున్నారని, వర్తక, వ్యాపార, ఉద్యోగులకు కావలసిన అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను సత్వరంగా అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఇట్టి సేవలను చెన్నూర్ వాసులు వినియోగించుకొని బ్యాంకును ఆదరించాలని కోరారు. బి.జె.పి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కేవలం 550/-రూపాయలకే సేవింగ్ ఖాతాను ప్రారంబిస్తారని, రైతులు, మహిళలు అందరూ కూడా సేవింగ్ ఖాతాలను ప్రారంబించి ఆర్థిక లావాదేవీలను యుపిఐ (ఫోన్పే, గూగుల్ పే) ద్వారా నిర్వహించడం చాలా సులువుగా ఉంటుందని, గాయత్రి బ్యాంకు చెన్నూర్ శాఖను ఆదరించాలని కోరారు. ఎక్సైజ్ కాంట్రాక్టర్ కోరకొప్పుల నర్సగౌడ్ మాట్లాడుతూ బ్యాంకు యందు ఎటువంటి హిడెన్ చార్జీలు లేకుండా పేద మధ్య తరగతి వినియోగదారుల శ్రేయస్సు కోసం పని చేస్తున్నారని అన్నిరకాల రుణాలను అందిస్తున్నారని సత్వర సేవలకు మారుపేరుగా ఉందని అన్నారు. బ్యాంకు రీజనల్ హెడ్ సి. హెచ్.వంశీకృష్ణ మాట్లాడుతూ.. వినియోగదారులకు ఉ.10 గం నుండి సా. 7 గం వరకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని, కరెంటు ఖాతా కేవలం 1000 బ్యాలన్సుతో వెంటనే ప్రారంభిస్తామని చెన్నూరు ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకొని, అదరించాలని కోరారు. బ్రాంచి హెడ్ పులిశెట్టి రమేశ్ మాట్లాడుతూ ఆధార్ నంబరు ద్వారా నగదు బదిలీ పథకం క్రింద వచ్చు సబ్సిడీ బదలాయింపులను, ప్రభుత్వ పెన్షన్లను పొందవచ్చని, బంగారు ఆభరణాలపై ఋణాలను అందజేస్తామని, రైతులకు, వ్యాపారులకు ఆస్థి తనఖాపై ఋణ సౌకర్యం కల్పిస్తామని, సేవింగ్, కరెంటు ఖాతాలను వెంటనే ప్రారంభిస్తామని వినియోగదారులు బ్యాంకును ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. రుణాలపై ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేవని, డిపాజిట్లపై ఆకర్షణీయ వడ్డీ రేట్లను అందిస్తున్నామని బ్యాంకు పాలక వర్గ సభ్యులైన ముత్యాల లక్ష్మణ్ రెడ్డి, ఎమ్. సౌజన్య, ఎ. రాజిరెడ్డి, ఎ. సత్యం, వై. అశోక్, కె. శ్రీనాథ్, బి.విజయ్, జి.గంగాధర్, వి.మాధవి, ఆర్. సతీష్, ఎస్. రవి కుమార్ గార్లు, మరియు ఇతర సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి)

జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులో శిక్షణ పొందుతున్న పిల్లలకు క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని స్పోర్ట్స్ అడిషనల్ కమీషనర్ యాదగిరి రావు అన్నాడు. ఆదివారం సమ్మర్ కోచింగ్ సందర్భంగా సికింద్రాబాద్, శేరిలింగంపల్లి మరియు కూకట్‌పల్లి జోన్‌ల పార్ట్ టైమ్ కోచ్‌లు మరియు గౌరవ కోచ్‌లతో పాటు సంబంధిత గేమ్స్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి, కోచ్‌ల వారీగా పని తీరును సమీక్షించి, సభ్యత్వ ఆదాయాన్ని మెరుగు పరచాలని ఆదేశించారు. పిజెఆర్ స్టేడియంలో ఇందిరా పార్క్‌లో రోలర్ స్కేటింగ్ పార్ట్ టైమ్ కోచ్‌గా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన శ్రీ నూర్ మొహమ్మద్ , కరాటే గౌరవ కోచ్ శ్రీ లక్ష్మణ్‌లతో పాటుగా విజేతలు మిస్ శ్రావణ పూజితలను అభినందించారు. జిహెచ్ఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంపులను ఉపయోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఒక చక్కని అవకాశం మాని వారు కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, తమలోని దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి కూడా ఈ శిబిరాలు సహాయపడతాయని అడిషనల్ కమిషనర్ పేర్కొన్నారు.

రాములు కుటుంబానికి 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

రాయికల్ మే11 (జనం సాక్షి)

రాయికల్ మండలంలోని వీరపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలి ఏగోలపు రాములు ఉపాధి హామీ పని చేస్తూ ఉండగా గుండె నొప్పి రావడంతో చికిత్స పొందుతూ మరణించిన రాములు కుటుంబాన్ని సమతా సైనిక దళ్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కాయితి శంకర్, ప్రధాన కార్యదర్శి మెట్టు దాసు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టంలో పేర్కొన్నట్లు అన్ని రకాల సౌకర్యాలు పని వద్ద ఏర్పాటు చేయాలని,సరైన సౌకర్యాలు లేక అనారోగ్యానికి గురైనా కార్మికులు ఇబ్బంది పడే అవకాశం ఉందని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేదరికంలో ఉన్న ఏగోలపు రాములు కుటుంబానికి తక్షణమే 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రెసియాతో పాటు,కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ చట్టంలో

పేర్కొన్నట్లు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు టెంట్లు,వైద్య సౌకర్యాలు, సురక్షిత త్రాగునీరు కూలీలకు అందుబాటులో అందు బాటులో ఉంచాలని,ఉన్నతాధికారులు ఉపాధి హామీ పథకం నిర్వహణ కూలీల సౌకర్యాల పట్ల ప్రత్యేకమైన పర్యవేక్షణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రాములు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ పరామర్శలో ముక్కెర నరేష్,చింతకుంట సాయికుమార్, నర్సయ్య ఉన్నారు.

14న రామప్పకు ప్రపంచ సుందరీమణుల రాక

35 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు

మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన

జిల్లా అధికార యంత్రాంగం

ములుగు ప్రతినిధి, మే11 (జనంసాక్షి)

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం ఖ్యాతి ప్రపంచ దేశాలకు మరోసారి విస్తరించనుంది. ఈనెల 14న ప్రపంచ సుందరీమణులు రామప్ప దేవాలయానికి రావడంతో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు ఈ దేవాలయం చారిత్రక వివరాలు తెలుసుకోవడానికి ఊవిళ్ళు ఊరుతున్నారు. గత సంవత్సరం రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో రామప్ప దేవాలయం గొప్పతనం ప్రపంచ దేశాలలో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రపంచ పర్యాటకులు రామప్ప దేవాలయానికి వచ్చి రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని, అబ్బురపరిచే శిల్ప సంపదను తనివితీరా తిలకిస్తున్నారు. ఈ క్రమంలో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి సుమారు 35 దేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీల కంటెస్టెంట్లు సాయంత్రం రానున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు రామప్ప దేవాలయానికి ఎవరిని అనుమతించరు. వీరితో పాటు వ్యక్తిగత సహాయకులు ఫోటో వీడియో గ్రాఫర్లు తదితరులు సుమారు 200 మందికి పైగా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ సుందరిమణులు వస్తున్న సందర్భంగా 14న రామప్ప సందర్శనకు టూరిస్టుల రాకను నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిస్ వరల్డ్ కంటెస్టు 14వ తేదీ సాయంత్రం 5:15 నిమిషాలకు ఆలయానికి మిస్ వరల్డ్ టీం బస్సులో చేరుకుంటారు. 5:20 గంటలకు రామప్పలో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద పూజా సామాగ్రి కొనుగోలు చేసి 5:25 గంట లకు ఆలయం వద్ద గిరిజన నృత్యంతో కళాకారులు స్వాగతం పలకనున్నారు. 5:30 గంటలకు పూజారులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి సాధారంగా దేవాలయంలోకి ఆహ్వానిస్తారు. 5:35 గంటల నుంచి 6:25 గంటల వరకు మూలవిరాట్ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని శిల్పకళా సంపదను తిలకిస్తారు. రామప్ప దేవాలయ విశిష్టత గురించి టూరిజం గైడ్లు అందాల భామలకు వివరిస్తారు. సాయంత్రం 6:30 గంటల కు రామప్ప ఉద్యమంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను అలేఖ్య పుంజాల బృందంతో క్లాసికల్ డాన్స్, రాత్రి 7 గంటలకు పేరిని నృత్య ప్రదర్శన, 7:25 గంటలకు మిస్ వరల్డ్ టీం కంటెస్టులకు ప్రముఖులతో సత్కారం చేయనున్నారు. 7: 35 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం 7:42 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ముగుస్తాయి. రామప్పలో రెండున్నర గంటల పాటు పర్యటించిన అనంతరం మిస్ వరల్డ్ కంటెస్టు రాత్రిపూట భోజనం చేసి హైదరాబాద్ కు తిరుగు ప్రయాణం అవుతారు. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రపంచ సుందరీమణులు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కు చేరుకోవడం జరుగుతుంది. హైదరాబాద్ కు చేరుకున్న అందాల భామలు చార్మినార్ ను సందర్శించుకొని అక్కడి నుండి నేరుగా వరంగల్ లోని భద్రకాళి దేవాలయం ఓరుగల్లు కోట లను దర్శించుకుని, సాయంత్రానికి రామప్ప దేవాలయం చేరు కోనున్నారు. ప్రపంచ సుందరీమణుల రాక కారణంగా మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ జిల్లా అధికారులు పోలీసు యంత్రాంగంతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి, వచ్చే అందాల భామలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే రామప్ప దేవాలయం పరిసరాలు, పాలంపేట ప్రాంతాలలో పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఉంది. పోలీసు, రెవెన్యూ, పంచాయత్ రాజ్, టూరిజం శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ సుందరీమణులకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. రామప్పలో నిర్వహించే ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పటికీ పర్యవేక్షిస్తున్నారు.

అడవి పంది దాడితో ఇద్దరికి గాయాలు

కొత్తగూడ మే 11 (జనంసాక్షి) :

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలనికి సమీపంలో గువ్వల బోడు ప్రాంతం లో అడవిపంది దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడం జరిగింది. కొత్తగూడ నుండి నర్సంపేటకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి పై అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న జాటోత్ లక్ష్మి (40)లపై అడవిపంది దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సహాయంతో నర్సంపేటలోని ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

మూగజీవాల పట్ల ఎంపీ వద్దిరాజు ఔదార్యం

ఖమ్మం (జనంసాక్షి) :

ఆకలితో సఖసఖలాడుతున్న మూగజీవాలకు (కోతులు) రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ తదితరులు ఆహారాన్ని (పండ్లు) అందించారు. అడవుల్లో పండ్లు, ఫలాలు దొరకని పరిస్థితులు తలెత్తడంతో కోతులు ఆకలితో అలమటిస్తూ ఆహారాన్ని వెతుక్కుంటూ రోడ్లపైకి రావడం జరుగుతున్నది. కాగా,ఎంపీ రవిచంద్ర,ఎమ్మెల్సీ మధు, బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్ తదితరులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం దాసుతండాలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ-హరిసింగ్ ఇంట్లో జరిగిన శుభ కార్యానికి హాజరై ఖమ్మం తిరిగి వస్తుండగా రోళ్లపాడు అటవీ ప్రాంతంలో రోడ్డుపై ఆగి కోతులకు అరటి పండ్లు, పుచ్చ కాయలు,నీళ్లు అందించి వాటి ఆకలిని, దాహార్తిని తీర్చి పుణ్యం మూట కట్టుకున్నారు. ఎంపీ రవిచంద్ర ఖమ్మం-ఇల్లందు-కొత్తగూడెం మార్గంలో తరుచూ రాకపోకలు

సాగిస్తుంటారు. ఈ సందర్భాలలో ఎంపీ రవిచంద్ర తన కారులో అరటి పండ్ల గెలలు వేసుకుని వచ్చి ఆ మూగ జీవాలకు ఆహారాన్ని అందించి వాటి ఆకలి తీరుస్తుంటారు. ఇదేమాదిరిగా ఆదివారం ఎంపీ వద్దిరాజు ఎమ్మెల్సీ మధు, బీఆర్ఎస్ సీనియర్ నేత దిండిగాల తదితరులతో కలిసి వాటికి ఆహారాన్ని అందించి తమ విశాల హృదయాన్ని,దయాగుణాన్ని మరోసారి చాటుకున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ యువతకు అవసరం

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

స్కిల్ డెవలప్‌మెంట్ యువతకు అవసరమని, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. ఆదివారం భూపాలపల్లిలోని సింగరేణి ఏరియా వర్క్ షాప్ ఎదురుగా ఉన్న ఎస్.డి.టి.సి ఆవరణలో ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక చొరవతో భూపాలపల్లి ఏరియా సింగరేణి సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ను సింగరేణి సిఎండి ఎన్.బలరాం తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా వేదికలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా చదువుకున్న నిరుద్యోగ యువతకు శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. ఈ ట్రైనింగ్ సెంటర్ లో మొత్తం 38 రకాల కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాల్లో స్కిల్ యూనివర్సిటీ శిక్షణ ఇస్తుందని, స్కిల్ డెవలప్మెంట్‌కి సీఎం రేవంత్ రెడ్డి అధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ పట్టాలు పొంది బయటకు వచ్చిన యువతకు సరైన స్కిల్స్ ఉండటం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా యువత

ఉద్యోగాలకి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేకు సింగరేణి అధికారులు శాలువా కప్పి సన్మానం చేశారు. అంతకుముందు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్క నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌కు మళ్లీ రానన్న మిచెల్

పీఎస్ఎల్ రద్దుతో పాకిస్థాన్‌ను వీడిన విదేశీ క్రికెటర్లు

డిల్లీ: భారత్-పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) అర్ధాంతరంగా రద్దవడంతో విదేశీ క్రికెటర్లు భయాందోళనలతో స్వదేశాలకు తిరిగి వెళ్లారు. బీసీసీఐ ఐపీఎల్‌ను నిలిపివేసినట్లే, పాకిస్థాన్‌లో పీఎస్ఎల్ కూడా ఆగిపోయింది. దీంతో విదేశీ ఆటగాళ్లు వెంటనే దుబాయ్ మీదుగా తమ దేశాలకు బయల్దేరారు. ఈ ప్రయాణంలో వారు తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డరిల్ మిచెల్, "ఇకపై పాకిస్థాన్‌కు మళ్లీ రాను," అని స్పష్టం చేశారు. ఇంగ్లండ్ ఆటగాడు టామ్ కరన్ విమానాశ్రయంలో విమానాలు రద్దవుతాయనే భయంతో కన్నీళ్లు పెట్టుకున్నాడు. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ రిషాద్ హొస్సేన్ ఈ విషయాలను వెల్లడిస్తూ, "దుబాయ్ చేరే వరకు మేము చాలా భయపడ్డాం. మా ఫాస్ట్ బౌలర్ నహీద్ రాణా స్థానువులా మారిపోయాడు. నేను అతడికి ధైర్యం చెప్పాను. మిచెల్, సామ్ బిల్లింగ్స్, కుశాల్ పెరీరా, టామ్ కరన్ లాంటి వారు హడలిపోయారు. దుబాయ్ చేరగానే మిచెల్ పాకిస్థాన్‌కు తిరిగి రానని చెప్పాడు. కరన్‌ను విమానాశ్రయంలో ఇద్దరు ముగ్గురు ఓదార్చారు," అని తెలిపారు.

విజేతగా భారత్

97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి

- ఫైనల్‌లో శ్రీలంకపై భారీ విజయం
- ఫైనల్‌లో మంధాన అద్భుత శతకం

భారత్ స్థిరమైన బ్యాటింగ్, బౌలింగ్‌తో టోర్నమెంట్‌లో ఆధిపత్యం

వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో స్మృతి మంధాన (116) సూపర్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 245 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో, 97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి మోగించింది. తద్వారా నిరుడు ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

ముక్కోణపు సిరీస్‌లో లీగ్ దశ నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో పంజా విసిరింది. బలమైన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించి ఆసియా కప్ ఓటమికి బదులు తీర్చుకుంది. ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ స్మృతి మంధాన(116) రికార్డు సెంచరీతో విరుచుకు పడగా.. బౌలర్లు లంక బ్యాటర్లకు దడ పుట్టించారు. అమన్‌జీత్ కౌర్ (3-54) నిప్పులు చెరగగా.. మిడిల్ ఓవర్లలో స్నేహ్ రానా(4-38) వికెట్ల వేట కొనసాగించింది. దాంతో, ఆతిథ్య లం 245 పరుగులకే ఆలౌటయ్యింది. విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది. లీగ్ దశలో శ్రీలంకను ఓడించి.. ఆ తర్వాతి పోరులో ఓడిన భారత్ ఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు ప్రతీకా రావల్(30), స్మృతి మంధాన(116 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత హర్లీన్ డయోల్(47), జెమీమా రోడ్రిగ్స్(44) కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (41)లు లంక బౌలర్లను ఉతికేశారు. మిడిలార్డర్ మెరుపులతో ప్రత్యర్థికి 343 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. ఛేదనలో అమన్‌జోత్ కౌర్ చెలరేగడంతో శ్రీలంక టాపార్డర్ విఫలమైంది.

స్మృతి సెంచరీ.. భారీ స్కోర్ చేసిన భారత్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ ఇండియా బ్యాటర్లలందరూ రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (116, 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్ లు) శతకంతో ఆకట్టుకుంది. హర్లీన్ డియోల్ (47, 56 బంతుల్లో), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (41బీ 30 బంతుల్లో), జేమీమా రోడ్రిగ్స్ (44బీ 29 బంతుల్లో), ప్రతీకా రావల్ (30) రాణించారు. అమన్ జ్యోత్ కౌర్ (18), రిచా ఘోష్ (8), దీప్తి శర్మ (20బి) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో దేవ్మీ విహంగా 2, సుగందికా కుమారి 2, మదార 2, ఇనోకా రణవీర ఒక వికెట్ పడగొట్టారు.

మలుపు తిప్పిన రానా

లంక ఓపెనర్ హాసినీ పెరీరా(0)ను డకౌట్ చేసిన అమన్‌జోత్.. ఆ తర్వాత డేంజరస్ విష్మీ గుణరత్నేను బౌల్డ్ చేసింది. ఓపెనర్ల వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ చమరి ఆటపట్టు(51), నీలాక్షి డిసిల్వా(48) ఆదుకున్నారు. వీళ్లిదరూ 50 ప్లస్ భాగస్వామ్యంతో భారత బౌలర్లను విసిగించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని స్నేహ్ రానా విడదీసింది. ఆటపట్టును బౌల్డ్ చేసిన తను మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత సమరవిక్రమ(26), అనుష్కా సంజీవని(28)లు పోరాడినా రానా తిప్పేయడంతో లంక ఆలౌట్ అంచున నిలిచింది. ఈ ఆల్‌రౌండర్ అనుష్క వికెట్ తీయడంతో లంక 245 పరుగులకే కుప్పకూలింది. దాంతో, భారత జట్టుకు 97 పరుగుల భారీ విజయం సొంతమైంది.

భారత మహిళల క్రికెట్ జట్టు ఇటీవల అద్భుతమైన విజయాలతో వార్తల్లో నిలిచింది. తాజా సమాచారం ప్రకారం, 2025 మే 11న జరిగిన మహిళల ట్రై-నేషన్ సిరీస్ ఫైనల్‌లో శ్రీలంకను 97 పరుగుల తేడాతో ఓడించి టీమ్ ఇండియా విజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత జట్టు ట్రై-నేషన్ సిరీస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అంతకు ముందు, జనవరి 2025లో ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ సాధించింది. మూడో వన్డేలో 304 పరుగుల భారీ తేడాతో గెలిచి, మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 435 పరుగులు చేసి, వన్డే క్రికెట్‌లో భారత జట్టు (పురుషులు, మహిళలు కలిపి) అత్యధిక స్కోరు రికార్డును సృష్టించింది. స్మృతి మంధాన మరియు ప్రతికా రావల్ శతకాలతో మెరిశాయి.

ఇంగ్లండ్ పర్యటనకు భారత 'ఏ' జట్టు సిద్ధం

ఐపీఎల్ 18వ సీజన్‌ను పునరుద్ధరించే పనిలో నిమగ్నమైన బీసీసీఐ, అంతర్జాతీయ క్రికెట్‌పైనా దృష్టి సారించింది. జూన్‌లో ఇంగ్లండ్ పర్యటన కోసం భారత 'ఏ' జట్టును పంపనుంది. 'ఇంగ్లండ్ లయన్స్'తో సిరీస్ కోసం జట్టు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం.

ఐపీఎల్‌లో రాణిస్తున్న కరుణ్ నాయర్, బెంగాల్ ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ జట్టులో ఉండనున్నారు. అభిమన్యు ఈశ్వరన్ సారథిగా ఎంపికైనట్లు తెలుస్తోంది. తనుష్ కొతియాన్, బాబా ఇంద్రజిత్, ఆకాశ్ దీప్, ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్‌లను సీనియర్ జట్టులోకి పరిగణించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మే 13న జట్టు పేర్లను బీసీసీఐ ప్రకటించనుంది.

మే 13 నాటికి ఆటగాళ్లు సిద్ధం కావాలి

ఐపీఎల్ 2025 పునఃప్రారంభానికి బీసీసీఐ సన్నాహాలు



భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారంతో సరిహద్దు ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ 2025ను తిరిగి ప్రారంభించేందుకు బీసీసీఐ చర్యలు చేపట్టింది. పంజాబ్ కింగ్స్ మినహా అన్ని ఐపీఎల్ జట్ల ఆటగాళ్లు మే 13 (మంగళవారం) నాటికి తమ హోం గ్రౌండ్లలో అందుబాటులో ఉండాలని ఫ్రాంచైజీలకు బీసీసీఐ మౌఖికంగా సూచించింది. త్వరలో కొత్త షెడ్యూల్‌ను ప్రకటించి, ఐపీఎల్‌ను పునఃప్రారంభించే యోజనలో బీసీసీఐ ఉన్నట్లు సమాచారం.

విదేశీ ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలను తెలియజేయాలని ఫ్రాంచైజీలను బీసీసీఐ కోరింది. దీంతో, శుక్రవారం స్వదేశాలకు వెళ్లిన విదేశీ ఆటగాళ్లను తిరిగి భారత్‌కు రప్పించేందుకు ఫ్రాంచైజీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మే 13 నాటికి ఆటగాళ్లు సిద్ధమైతే, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మే 25 నాటికి ఐపీఎల్‌ను ముగించాలని బీసీసీఐ లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన 12 లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్‌లతో త్వరగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తోంది.

పంజాబ్ కింగ్స్‌కు తటస్థ వేదిక కేటాయించే అవకాశం ఉంది, ఎందుకంటే ధర్మశాల, చండీగఢ్‌లోని వారి హోం వేదికలు ప్రస్తుత పరిస్థితుల్లో అనుకూలంగా లేవు. అయితే, ఈ తటస్థ వేదికను ఇంకా ఖరారు చేయలేదు, అయితే అహ్మదాబాద్ ఒక ఎంపికగా పరిగణనలో ఉంది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను మిగిలిన మ్యాచ్‌లకు వేదికలుగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. భారత ప్రభుత్వం నుంచి భద్రతా ఆమోదం లభిస్తే, మే 15 లేదా 16 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందని జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం (మే 11) బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో కొత్త షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని రిపోర్టులు సూచిస్తున్నాయి.

ట్రిపుల్ సెంచరీ హీరో బాబ్ కౌపర్ కన్నుమూత

ఆస్ట్రేలియా క్రికెట్‌లో విషాదం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్ బాబ్ కౌపర్ (84) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. క్రికెట్ ఆస్ట్రేలియా ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించి, ఆయన మృతిపట్ల సంతాపం తెలిపింది. "మొదటి తరం క్రికెటర్ బాబ్ కౌపర్ మృతి మమ్మల్ని కలిచివేసింది. ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఆయనకు అపార గౌరవం ఉంది. 1966లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌పై ఆయన సాధించిన ట్రిపుల్ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 1960వ దశకంలో ఆయన బ్యాటింగ్ ఆస్ట్రేలియా మరియు విక్టోరియా జట్టు విజయాలకు కీలకమైంది," అని క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ మైక్ బైర్డ్ పేర్కొన్నారు.

ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన కౌపర్, విక్టోరియా తరఫున 66 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 53.00 సగటుతో 4,611 పరుగులు సాధించారు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 27 టెస్టుల్లో 2,061 పరుగులు, 36 వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా ముద్రవేశారు. 1966లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌పై 12 గంటలపాటు బ్యాటింగ్ చేసి 589 బంతుల్లో 307 పరుగులు సాధించిన ట్రిపుల్ సెంచరీ ఆయన కెరీర్‌కు మైలురాయి. 20వ శతాబ్దంలో ఆస్ట్రేలియా తరఫున టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డు నెలకొల్పారు. కౌపర్‌కు భార్య డేల్, కూతుళ్లు ఒలీవియా, సెరా ఉన్నారు.

10 మంది బ్యాటర్లు రిటైర్డ్ ఔట్

మహిళల టీ20లో అరుదైన రికార్డు

బ్యాంకాక్: మహిళల టీ20 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో శనివారం యూఏఈ-ఖతార్ మ్యాచ్‌లో అసాధారణ ఘటన చోటు చేసుకుంది. యూఏఈ జట్టులో 10 మంది బ్యాటర్లు రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగారు. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో యూఏఈ మొదట బ్యాటింగ్ చేసి 16 ఓవర్లలో 192/0 స్కోరు సాధించింది. ఓపెనర్లు ఈషా ఓజా (113* 55 బంతుల్లో 14×4, 5×6), తీర్థ సతీష్ (74* 42 బంతుల్లో 11×4) మెరుపు ఇన్నింగ్స్‌లతో రాణించారు. వర్షం ముప్పు కారణంగా ఈ స్కోరు సరిపోతుందని భావించిన యూఏఈ, 10 మంది బ్యాటర్లను రిటైర్ చేసి ఇన్నింగ్స్ ముగించింది.

యూఏఈ బౌలర్లు మిచెల్లీ బోథా (3/11), కేటీ థాంప్సన్ (2/6) అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఖతార్ 11.1 ఓవర్లలో కేవలం 29 పరుగులకే ఆలౌట్ అయింది. ఖతార్ ఇన్నింగ్స్‌లో ఏడుగురు డకౌట్ కాగా, యూఏఈ ఇన్నింగ్స్‌లో రిటైర్డ్ ఔట్‌ల కారణంగా 8 మంది డకౌట్‌గా నమోదయ్యారు. దీంతో మ్యాచ్‌లో మొత్తం 15 డకౌట్లు సంభవించి, ప్రపంచ రికార్డు నెలకొంది. యూఏఈ 163 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే మ్యాచ్‌లో ఇద్దరికి మించి రిటైర్డ్ ఔట్ అయిన సందర్భాలు లేనప్పుడు, 10 రిటైర్డ్ ఔట్‌లతో యూఏఈ చరిత్ర సృష్టించింది.

రాజన్న ఆలయ విస్తరణలో అడ్డంకుల్లేకుండా చూడాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- శ్రీ భూనిలా సహిత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణంలో పట్టువస్త్రాలు సమర్పణ

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 11 (జనంసాక్షి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివా రం శ్రీ బూనీల సహిత శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈఓ వినోద్ అందచేశారు. కన్యాదాతలుగా రాచకొండ రామాచార్యులు సంధ్యారాణి దంపతులు వ్యవహరించగా రాజన్న ఆలయ అర్చకులు విజయ సింహాచారి,రామకృష్ణ చారి హర్షవర్ధ నా చారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కళ్యాణ తంతు నిర్వహించారు. కరీంనగర్ లోని సప్తగిరి కాలనీకి చెందిన సజ్జప్ప కళాక్షేత్రం,సజ్జప్ప కూచిపూడి డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ లోని చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాడు వారిని ప్రభుత్వ విప్ అభినందించారు. నాంపల్లి గుట్టపై ఐదు రోజులపాటు జరిగే కళ్యాణ మహోత్సవానికి దాతలుగా తోపుచెర్ల శ్రీనాథ్ స్వాతి దంపతులు,భక్తుల దాహార్తిని తీర్చేందుకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి జల ప్రసాదం పేరిట రాసమడుగు నర్సింగారావు ముస్తాబాద్ అందజేశారు. భక్తుల సౌకర్యార్థ ఆలయం మెట్ల వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.

సనాత ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా స్వామీ వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటున్నాన మన్నారు. శ్రీ లక్ష్మి నరింహస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టే పనులు రాజన్న ఆలయ విస్తరణ ఎలాంటి నిర్విఘ్నులు తలెత్తకుండా ఉండాలనీ మోక్కడం జరిగిందన్నారు. నాంపల్లి గుట్టపై కళ్యాణం సందర్భంగా ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు సంతోషం వ్యక్తం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేష్, డిఈ మహిపాల్ రెడ్డి, సూపరిడెంట్లు వెంకటరాజు, పూజిత, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్చార్జి నరేందర్ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేడుకల్లో సుమారు 1500పైగా భక్తులు పాల్గొనగా కళ్యాణ అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సౌదీలో యువకుడికి రోడ్డు ప్రమాదం.. కేటీఆర్ భరోసా

సౌదీలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి కేటీఆర్ అండగా నిలిచారు. సౌదీలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా సిరిసిల్ల వ్యక్తి మంద మహేష్ గాయపడ్డాడు. ఇక ఈ ప్రమాదంపై స్పందించి మంద మహేష్‌కు అండగా ఉంటానని హామీ ఇచ్చారు కేటీఆర్. పనికి వెళ్తున్న సమయంలో తీవ్ర రోడ్డు ప్రమాదంలో గాయపడి, అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు మంద మహేష్. ఇక ఈ ప్రమాదంపై స్పందించి సొంత ఖర్చులతో మంద మహేష్‌ను ఇండియాకు తెప్పించి, మెరుగైన వైద్యం చేయిస్తానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు కేటీఆర్. మంద మహేష్ స్వస్థలం సిరిసిల్ల నియోజకవర్గంలోని మండేపల్లి గ్రామం అని చెబుతున్నారు. కంపెనీ బస్సులో పనికి వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందగా.. మంద మహేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఇక తాజాగా సౌదీలో చికిత్స పొందుతున్న మందం మహేష్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడారు కేటీఆర్. అధైర్యపడొద్దు... నాలుగు ఐదు రోజుల్లోనే సొంత ఖర్చులతో నిన్ను స్వస్థలానికి తీసుకువస్తాను అని భరోసా ఇచ్చాడు.

చివరి నిమిషంలో...

కాల్పుల విరమణ ప్రకటనతో విమానం నుంచి దిగిన రికీ పాంటింగ్

విదేశీ ఆటగాళ్లను ఒప్పించిన పంజాబ్ కోచ్

భారత్-పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 2025 వారం రోజులపాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో చాలా మంది విదేశీ ఆటగాళ్లు మరియు సిబ్బంది స్వదేశాలకు తిరిగి వెళ్లారు. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ కూడా ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు విమానం ఎక్కాడు. అయితే, భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటన వెలువడిన వెంటనే, ఆయన తన నిర్ణయాన్ని మార్చుకొని చివరి నిమిషంలో విమానం నుంచి దిగి ఢిల్లీలోనే ఉండాలని నిశ్చయించుకున్నాడు.

ఈ సమయంలో పంజాబ్ కింగ్స్ జట్టులోని విదేశీ ఆటగాళ్లు మార్కస్ స్టాయినిస్, ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్, జేవియర్ బార్ట్‌లెట్‌లు స్వదేశాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యా రు. విషయం తెలుసుకున్న పాంటింగ్ వారితో మాట్లాడి, కాల్పుల విరమణ ప్రకటన గురించి వివరించి, భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పాడు. భారత్‌లోనే ఉండేలా వారిని ఒప్పించడంలో విజయం సాధించాడు. ఈ విషయాన్ని పంజాబ్ కింగ్స్ వర్గాలు ధ్రువీకరించాయి. "విదేశీ ఆటగాళ్లకు యుద్ధం లాంటి పరిస్థితులు కొత్త. అందుకే వారు ఆందోళన చెందడం సహజం. స్టాయినిస్ నేతృత్వం లో వారంతా వెంటనే స్వదేశాలకు వెళ్లాలనుకున్నారు. వారి ఆందోళనను మేం అర్థం చేసుకున్నాం. కానీ, కాల్పుల విరమ ణ ప్రకటన తర్వాత పాంటింగ్ వారిని ఒప్పించి భారత్‌లోనే ఉండేలా చేశాడు. ఇది అసాధారణ నాయకత్వ లక్షణం," అని పంజాబ్ కింగ్స్ సీఈఓ సతీష్ మీనన్ తెలిపారు.

పంజాబ్ జట్టు రెగ్యులర్ ప్లేయింగ్ XIలో ఉండే సౌతాఫ్రికా ఆటగాడు మార్కో యాన్సెన్ మాత్రం దుబాయ్ మీదుగా స్వదేశానికి వెళ్లిపోయాడు. అయినప్పటికీ, దుబాయ్ నుంచి భారత్‌కు తిరిగి రావడం సులభమైన ప్రయాణం కావడంతో అతడు తిరిగి జట్టుతో చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్‌కు చెందిన మెజారిటీ భారతీయ మరియు విదేశీ ఆటగాళ్లు జట్టుతోనే ఉన్నారు, ఇది ఐపీఎల్ పునఃప్రారంభానికి జట్టును బలమైన స్థితిలో ఉంచుతుంది.ఈ సంఘటన పాంటింగ్ నాయకత్వ లక్షణాలను మరోసారి హైలైట్ చేసింది. అతడు జట్టును ఒక్కటిగా ఉంచడంతో పాటు, ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2025 పునఃప్రారంభమైతే, శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలో, పాంటింగ్ మార్గదర్శకత్వంలో పంజాబ్ కింగ్స్ తమ మొదటి ఐపీఎల్ టైటిల్‌ను సాధించే దిశగా బలమైన అడుగులు వేయవచ్చు.

తినే తిండిలో మట్టి పోస్తున్నారు

- ఇబ్రహీంపట్నం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చివేతపై సీపీఎం ఆగ్రహం
- చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వెంటనే పున ప్రారంభించాలి
- సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ

ఇబ్రహీంపట్నం, (జనం సాక్షి): పెద్దచెరువు కట్ట వద్ద ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూల్చివేయడాన్ని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఈ చర్యను "మత్స్యకారుల జీవనాధారంపై దాడి"గా అభివర్ణించారు. ఈ కేంద్రాన్ని వెంటనే పునర్నిర్మించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 32 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల అభివృద్ధికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు జాన్ వెస్లీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, తెలంగాణ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. సామేల్, కె. జగన్‌లతో కలిసి కేంద్రాన్ని సందర్శించారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ, మత్స్యకార సంఘాలతో చర్చించకుండా, సమాచారం ఇవ్వకుండా 9 ట్యాంకులను కూల్చివేయడం దుర్మార్గమని విమర్శించారు. దీనివల్ల మత్స్యకారులకు తీవ్ర నష్టమని, రాష్ట్రం ఏటా ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.400 కోట్ల విలువైన చేప పిల్లలను దిగుమతి చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. సిబ్బంది నియామకం, స్థల కబ్జాల నివారణతో స్థానిక ఉత్పత్తిని పెంచవచ్చని సూచించారు. మత్స్యకారుల సమస్యలపై ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నట్లు, మే 15న మత్స్యకారుల మహా ధర్నాకు సీపీఎం మద్దతు ప్రకటించారు. లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ, కేంద్రం కూల్చివేత అధికారుల నిర్లక్ష్యమని, జిల్లా మత్స్య సొసైటీలకు ఆర్థిక నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల మార్కెట్ పేరుతో కాంట్రాక్టర్లు, అధికారులు కమీషన్ల కోసం పనికిమాలిన స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. జనసాంద్రత ఉన్న ప్రాంతంలో మార్కెట్ నిర్మించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ జంగయ్య, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తెలు ఇస్తారి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చనమోని రాము, గుడాల బిక్షపతి, దుస వెంకటేష్, బోళ్ల నర్సింహ, మైలారం యాదయ్య, పొన్నల బిక్షపతి, పోచమోని క్రిష్ణ, బి. యాదగిరి పాల్గొన్నారు.

రైతు జితేందర్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు మే 11(జనంసాక్షి) : విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో చెరుకు తోట దగ్ధమైన ఘటనా స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి సందర్శించారు.ఆదివారం పెద్దేముల్ మండల కేంద్రం రైతు జితేందర్ రెడ్డి కి చెందిన మూడున్నర ఎకరాల చెరుకు తోట శనివారం సాయంత్రం విద్యుత్ షాక్కు గురై పూర్తిగా కాలిపోయింది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పట్నం మహేందర్ రెడ్డి హటాహుటిన చెరుకు తోటను సందర్శించారు. రైతు జితేందర్ రెడ్డి స్థానిక నాయకులు నర్సింలు తదితరులు కలిసి పొలాన్ని సందర్శించారు. ప్రమాదానికి సంబంధించిన అంశాన్ని తెలుసుకున్నారు. స్థానిక తహసిల్దార్ తో మాట్లాడి నష్టపోరు అందించేలా చర్యలు తీసుకోవాలని వెంటనే కలెక్టర్కు నివేదిక అందించాలని తాను కలెక్టర్ గారితో మాట్లాడుతానని చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తుందని అధైర్య పడవద్దని జితేందర్ రెడ్డి కి హామీ ఇచ్చారు. తాండూర్ ట్రాన్స్ కో డీఈఈ భాను ప్రకాష్, ఎడి తదితరులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రైతు ప్రభుత్వంగా తాము రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తామని మహేందర్ రెడ్డి అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
12 మే 2025

గ్రామసభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జిఓ 7 ప్రకారమే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి
- ప్రభుత్వ సొమ్మును ఇష్టానుసారం కార్యకర్తలకు పంచిపెడితే ఊరుకునేది లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ 7 ప్రకారం గ్రామ సభలోనే జరగాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు.

నిజామాబాద్ జిల్లాలో 1లక్ష 80 వేల మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారన్నారని, కాంగ్రెస్ నేతలు ఇళ్లలో కూర్చోని 70 వేల మంది అర్హులను ఎంపికచేశారని, అందరికీ ఇల్లు వస్తాయని అందరినీ నమ్మించారని తెలిపారు. గ్రామసభలో 70 వేల మందిలో చాలామంది అనర్హులైన వారికి ఇచ్చారని ప్రజలు గొడవ చేశారని, అయినా కాంగ్రెస్ నేతలు సిఫారసు చేసిన వాళ్ళకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 70 వేల మంది అర్హులు అని వాళ్లే చెప్పి, ఇప్పుడు 17 వేల మందికి ఇస్తున్నట్లు ప్రకటించారని, ఈ 17 వేల మందిని గ్రామ సభలో కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇంటిలో కూర్చుని ఎంపిక చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎవరు అర్హులో దరఖాస్తు చేసుకున్న వారిలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిన జీ.ఓ నంబర్ 7 ప్రకారం అర్హుల జాబితా గ్రామ సభలో పెట్టి ఎంపిక చేయాలని ఉందని, అర్హత జాబితా తర్వాత లబ్ధిదారులను గ్రామ సభ ద్వారా అంగీకారం తెలిపిన వాళ్లకు జిల్లా కలెక్టర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఒక్క గ్రామ సభ పెట్టలేదని, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లలో జాబితా ఫైనల్ అవుతున్నదని తెలిపారు. ఇంటికి రూ. 50 వేలు ఇచ్చిన వాళ్ళకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ జీ ఓ 7 ప్రకారమే గ్రామ సభలో చేసిన సిఫారసులనే కలెక్టర్ ఫైనల్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయంగా ఇల్లు రావాల్సిన వాళ్లకు గులాబీ కార్యకర్తలు అండగా నిలవాలని, ఇందిరమ్మ ఇళ్ళు రాని వాళ్ళతో తహశీల్దార్ కార్యాలయం,గ్రామ పంచాయతీ ల ముందు నిరసన తెలపాలని కోరారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రూ. లక్ష నుంచి 4 లక్షలు ఇస్తామని చెప్పారని, రాజీవ్ యువ వికాస్ కూడా కాంగ్రెస్ కార్యకర్తలకు, డబ్బులు ఇచ్చిన వాళ్లకు ఇవ్వబోతున్నారని, 6500 కోట్ల రూపాయలు నేరుగా కాంగ్రెస్ నేతల జేబులు నింపేందుకు ఈ పథకం తీసుకున్నారని, పదేళ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే రాజీవ్ యువ వికాస్ పథకం, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మినరల్ డెవలప్ మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్ బహిరంగంగా చెప్తున్నారని, 12 వేల కోట్ల ఇందిరమ్మ ఇళ్లు, రూ.6500 కోట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సొమ్ము దారాదత్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల సొమ్ము ఎవడిదని కాంగ్రెస్ పార్టీ నేతలు జేబులో నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నిధులు మీ పార్టీ కార్యకర్తలు కు ఇచ్చుకుంటే అభ్యంతరం లేదని, ఇది తెలంగాణ ప్రజల సొమ్ము అర్హులైన పేద ప్రజలకే చెందాలని, రాజీవ్ యువ వికాస్, ఇందిరమ్మ ఇళ్ల లిస్ట్ గ్రామ సభల్లోనే ఫైనల్ చేయాలని డిమాండ్ చేశారు.

వడ్ల కొనుగోలు మందకొడిగా సాగుతున్నదని, రైస్ మిల్లర్లు ఆన్‌లోడ్ చేయడం లేదని, సన్నవు వడ్లు తీసుకోవడం లేదని తెలిపారు. 10 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ చేయాలని, 7 లక్షల 50 మెట్రిక్ టన్నులు సేకరణ చేశారని, ఇంకా 1లక్ష 50 మెట్రిక్ టన్నులు కల్లాల్లో ఉన్నాయని, 1లక్ష 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లారీల్లో ఉన్నాయని తెలిపారు. 45 రోజులు అయినా కొనుగోళ్లు పూర్తి కావడం లేదని, రూ.500 సన్న వడ్లకు బోనస్ ఇస్తామన్నారని, ఇప్పటికి 45 రోజులైనా ఒక్క రైతుకు బోనస్ అందలేదని, అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు పై సీఎం ఒక్కసారి కూడా రివ్యూ పెట్టలేదని, అందాల పోటీల కోసం పదిసార్లు రివ్యూ పెట్టిన రేవంత్ రెడ్డి బుద్ధి తెచ్చుకుని వరి ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ జెడ్పి చైర్మన్ విఠల్ రావు,నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,సత్య ప్రకాష్,సుదాం రవిచందర్,నవీద్ ఇక్బాల్ బీఆర్ఎస్ సీయర్ నాయకులు రాజగౌడ్,ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ గురించి మాట్లాడితే గుంజీలు తీయిస్తా

- ఈటలా.. నల్లికుంట్ల రాజకీయాలు మానుకో
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : సిఎం రేవంత్ రెడ్డి గురించి కానీ.. కాంగ్రెస్ పార్టీ గురించి కానీ మళ్ళీ ఇంకో సారి లూజ్ కామెంట్స్ చేస్తే నడిరోడ్డులో బట్టలు విప్పి గుంజీలు తీయిస్తా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. గాంధీభవన్‌లో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ ఇప్పటికైనా నల్లి కుట్ల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఈటల రాజేందర్ లిమిట్స్ దాటి మాట్లాడుతున్నారని, అందుకే తాను లిమిట్స్ దాటి సమాధానమిస్తున్నానని అన్నారు. ఈటెల రాజేందర్...ఎప్పుడైనా సీఎం దగ్గరకి పోయి తన పార్లమెంట్ పరిధిలో సమస్యలు ఎప్పుడైనా చెప్పారా? అని ప్రశ్నించారు. రేవంత్ మీద ఇప్పటికీ చాలా సార్లు నోరు జారాడని, ఈటెల కేంద్ర మంత్రి కావాలని... బీజేపీ అధ్యక్షుడి కావాలని కలలుకన్నాడని, సీఎం నీ తిడితే ఏదో ఒక పదవి వస్తుంది అని అనుకుంటున్నాడని, ఈటల రాజేందర్ భాషలో మార్పు రావాలని, ఆయన తన పరిధి దాటి మాట్లాడుతున్నాడని, ఓ సీనియర్ నాయకుడి లెక్క లేవు.. ఎంపీ లెక్క మాట్లాడటం లేదని అన్నారు. పదవి లేకపోవడంతో సైకోలాగా తయారయ్యాడని, ఈటెల ఎప్పుడూ కులం చెప్పుకోదు... ఈ మధ్య కుల రాజకీయాలు చేస్తున్నాడని, గాండు రాజకీయం చేస్తున్నాడని అన్నారు.

ఇండిగో ఏయిర్‌లైన్స్‌పై కేఏ పాల్ ఫిర్యాదు

ముంబై (జనంసాక్షి) : ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్‌కు ముంబై విమానాశ్రయంలో ఊహించని పరిణామం ఎదురైంది. టర్కీ పర్యటనకు సిద్ధమైన తనను, తన బృందాన్ని ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది విమానం ఎక్కకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై కేఏ పాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ సీఈఓ మరియు సంబంధిత సిబ్బందిపై ముంబైలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శాంతి చర్చల కోసం తాను టర్కీ వెళుతుంటే విమానం ఎక్కనివ్వలేదని కేఏ పాల్ సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. ముంబై నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో తాము టర్కీకి ప్రయాణించాల్సి ఉందని, అయితే, విమానం ఎక్కేందుకు ప్రయత్నించిన సమయంలో ఇండిగో సిబ్బంది తమను అడ్డుకున్నారని ఆరోపించారు. తమ ప్రయాణాన్ని అక్రమంగా, చట్టవిరుద్ధంగా అడ్డుకున్నారంటూ, ఈ మేరకు ఆయన ముంబై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ సీఈఓతో పాటు, తమను అడ్డుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. తాను 37 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు చేస్తున్నానని, తాజాగా పాక్ తో ఉద్రిక్తతలపై ట్రంప్, అమెరికా సెనేటర్లతో కూడా ఫోన్ లో మాట్లాడానని, ఇప్పుడు టర్కీ వెళుతుంటే అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాచుపల్లి తహసీల్దార్ నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదు

- హైడ్రాకు ముడిపెడుతూ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరం
- బాచుపల్లిలో ఈటల వాఖ్యలపై వివరణ ఇచ్చిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్, మే 11 (జనంసాక్షి) : బాచుపల్లి తహసీల్దార్ ఇచ్చిన నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదు అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసలు ఈ విషయం గురించి కూడా తనకు కానీ హైడ్రా అధికారులకు గానీ తెలియదని స్పష్టం చేసారు. ఇదే విషయాన్ని మేడ్చల్ – మల్కాజగిరి కలెక్టర్‌తో కూడా మాట్లాడానని ఆయన తెలిపారు. ఆ నోటీసులు ఎందుకు ఇచ్చారో తహసీల్దార్‌ను అడగాలని కలెక్టర్‌ను కోరినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతీ నోటీస్ ను , ప్రతీ కూల్చివేతను హైడ్రాకు ఆపాదించి ప్రజల్ని ఆందోళనకు భయ భ్రాంతులకు గురిచేయడం దురదృష్టకరమని, బడా భూ కబ్జా దారుల మీద హైడ్రా కఠినంగా వుంటూ సామాన్యులకు అండగా వుంటుందని, కలెక్టర్‌కు తెలియకుండానే తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని మల్కాజిరి ఎంపీ ఈటల రాజేందర్ ఒకవైపు చెబుతూనే ఎంతో నిబద్ధతో పని చేస్తున్న హైడ్రా ను దోషిగా నిలబెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు దురదృష్టకరమని తెలిపారు. ఈటల రాజేందర్ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిగానూ , అయోమయానికి గురిచేసేవిగా ఉన్నాయని తెలిపారు. హైడ్రా పనితీరుపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉన్న తరుణంలో ఈటల రాజేందర్ లాంటి వారు హైడ్రాపై ఆరోపణలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేయడం సబబు కాదని సూచించారు. సచివాలయంలో ఈటల కలిసినప్పుడు కూడా హైడ్రా కార్యకలాపాలపై చర్చ వస్తే స్పష్టంగా వివరించానని, జూలై, 2024 కంటే ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేసానని తెలిపారు. అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా తొలగించదని, పేదలు, సామాన్యులకు హైడ్రా ఇబ్బంది పెట్టదని, హైడ్రా పని తీరుపైన ప్రజలు ఎంతో స్పష్టతతో ఉన్నారని... అనవసరమైన ఆరోపణలు చేసి అయోమయానికి ఎవరినీ గురి చేయ వద్దని హైడ్రా కమిషనర్ కోరారు.

14న పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదో మహాసభ

- మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

కరీంనగర్ (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో పీస్ కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్ర కుమార్ ఆధ్వర్యంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదోవ మహాసభ జిల్లా కరపత్రాలను వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 14న ఫిలిం భవన్ లో జరిగే సభకు ఉదయం 10 నుంచి రెండు గంటల వరకు వక్తలు, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పౌర హక్కుల సంఘం అధ్యక్షులు తెలంగాణ, నారాయణ రావు పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, వీక్షణం ఎడిటర్ ఎన్ వేణు, మాదన కుమారస్వామి రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసంగిస్తారు. కగార్ ఆపరేషన్ ఆపాలి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి అనే అంశంపై మాట్లాడుతారు. ఈ కరపత్ర ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిక్స్ చంద్ర చూడు మాట్లాడుతూ ఆదివాసీల పై జరుగుతున్న మారణ హోమాన్ని ఆపాలని మావోయిస్ట్ ల సమస్య శాంతి భద్రతసమస్య కాదు అని అది సామాజిక సమస్య మాత్రమే అని అన్నారు అట్లాగే మావోయిస్టులతో శాంతి చర్చలుకేంద్ర ప్రభుత్వం జరపాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ మావోయిస్టులు శాంతి చర్చలు జరపాలని గత నెల రోజుల నుంచి మూడు లేఖలు రిలీజ్ చేశారని, నిన్నటికి నిన్న మా వైపు నుండి 6 నెలల వరకు కాల్పులు చేయమని కాల్పుల విరమణ ప్రకటించారని, అన్ని వామపక్ష, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ మేరకు ప్రభుత్వం దిగివచ్చి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కరపత్ర ఆవిష్కరణకు పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీపతి పుల్ల సుచరిత, నారా వినోద్, సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, గడ్డం సంజీవ్ , ఈ సీ మెంబర్ లక్ష్మణ్, వెంకటి, సంపత్, బండారి రాయలింగు, నక్క సత్యనారాయణ, సభ్యులు సత్తన్న, బండి శంకరన్న, పోసన్న, అంజన్న, పోగుల శేఖర్, రైతు సమస్యల సాధన నాయకుడు ఎలేసంవెంకటేశం, గూడూరు లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్ రెడ్డినే అసలైన కాంగ్రెస్ వాది

- మంత్రి దామోదర రాజనర్సింహ సంచలన వ్యాఖ్యలు

జగిత్యాల (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అని, అసలైన కాంగ్రెస్ వాది ఆయనే అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల జగిత్యాల జిల్లా పర్యటన నిమిత్తం శనివారం రాత్రి ధర్మపురి విచ్చేసిన మంత్రి రాజనర్సింహా ఆదివారం ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైద్య సేవలు, ఆసుపత్రుల బలోపేతంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికి ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి రాజానర్సింహ చేరుకొని కొంత సేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకరులు జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిల మధ్య వార్ నడుస్తుందన్న ప్రశ్నలకు మంత్రి రాజానర్సింహ సమాధానమిస్తూ మేము జీవన్ రెడ్డి అన్న శిష్యులం, ఆయన కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు, పెద్ద అసెట్ అంటూ వ్యాఖ్యానించారు. అసలు, సిసలైన కాంగ్రెస్ వాది జీవన్ రెడ్డి, మేము ఆయన శ్రేయోభిలాషులం. పార్టీలో అందరికంటే సీనియర్ నాయకులు, పార్టీకి మంచి సలహాలు, సూచనలు ఇస్తారు. మంచి ఆలోచనపరుడని జీవన్ రెడ్డి గురించి మంత్రి రాజానర్సింహ మాట్లాడారు. మేము ఆయన కంటే పార్టీలో జూనియర్లమని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి గురించి పార్టీ ఆలోచిస్తుందని, ఆయనకు మంచి జరగాలనే ప్రయత్నం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, నక్క జీవన్, రఘువిర్ గౌడ్, గుండా మధు, గిరిధర్, బొల్లి శేఖర్, నాగరాజు, తదితరులున్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలు రద్దు

- నిలిచిన 100 విమాన సర్వీసులు

న్యూఢిల్లీ (జనంసాక్షి) : భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే విమాన సర్వీసులను ఆదివారం రద్దు చేశారు. ఎయిర్‌పోర్టు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అదేవిధంగా దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోగల 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మొత్తం 100 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దేశీయ విమాన సర్వీసుల్లో 52 అవుట్ గోయింగ్ సర్వీసులు, 44 ఇన్ కమింగ్ సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా ఒక అంతర్జాతీయ అవుట్ గోయింగ్ విమాన సర్వీసు రద్దయ్యింది. ఈ విషయాన్ని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (డయల్) వర్గాలు వెల్లడించాయి. అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టు కార్యకలపాలు సాధారణంగానే సాగుతున్నాయని, అయితే ఎయిర్‌స్పేస్ డైనమిక్స్‌లో మార్పులు, పెరిగిన భద్రతా చర్యలవల్ల.. కొన్ని విమానాల షెడ్యూళ్లు, సెక్యూరిటీ చెక్ పాయింట్ ప్రాసెసింగ్ వేళలు ప్రభావితమయ్యాయని డయల్ పేర్కొంది.

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని డయల్ ఆపరేట్ చేస్తోంది. ఇది దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. శనివారం భారత్–పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. అయితే ఈ అంగీకారం కుదిరిన కాసేపటికే పాకిస్థాన్ మాట తప్పింది. ఆర్ఎస్ పుర సెక్టార్‌లో భారత సైన్యంపై దాడికి పాల్పడింది. ఈ దాడిని తిప్పికొట్టే క్రమంలో ఇద్దరు ఆర్మీ జవాన్‌లు, ఒక ఎయిర్‌ఫోర్స్ జవాన్, ఒక బీఎస్ఎఫ్ ఎస్ఐ వీర మరణం పొందారు.

ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం... ఆయనకు మతి తప్పింది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈటలను తాను ఒక మర్యాదస్తుడిగా భావించేవాడినని, కానీ ఆయన ఇటీవలి మాటలు చూస్తుంటే, మతి తప్పినట్లుగా ఉందని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలనుకుంటే మీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవాలి తప్ప, మా ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తే పదవి వస్తుందనుకోవడం మీ అవివేకానికి నిదర్శనం. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో మీరు ఈ స్థాయికి దిగజారతారని మేము ఊహించలేదు. దయచేసి మీ పిచ్చి వాగుడు, ప్రేలాపనలు ఆపండి" అని హితవు పలికారు. ముఖ్యమంత్రిని 'శాడిస్ట్, సైకో' వంటి పదాలతో దూషించడంపై స్పందిస్తూ, "మాకు కూడా అంతకుమించిన భాషలో సమాధానం చెప్పడం వచ్చు, అది గుర్తుంచుకోండి. ముప్పై ఏళ్ల రాజకీయ అనుభవం ఉండి 'నా కొడకా' వంటి పదాలు వాడుతున్నారంటే మీ మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. మీ నీచ రాజకీయ ప్రయోజనాల కోసం మా ముఖ్యమంత్రిపై దిగజారుడు భాష ఉపయోగిస్తే సహించే ప్రసక్తే లేదు" అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. ఈటల రాజేందర్ తన అనుచిత పదజాలాన్ని మానుకోకపోతే, తాము కూడా అంతకంటే తీవ్రమైన భాషను ఉపయోగించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

దిల్‌రాజు ఇంట్లో అనిత విగ్రహం

- మహిళా దినోత్సవం సందర్భంగా ఫోటో విడుదల చేసిన కూతురు హన్షిత

హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు కూడా తమ తల్లులకి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సినీ సెలబ్రిటీలు, క్రీడా కారులు సైతం తమ తల్లులకి విషెస్ తెలియజేస్తున్నారు. భారతదేశం, యునైటెడ్ స్టేట్స్, కెనడాతో సహా అనేక దేశాలలో ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకుంటుండడం మనం చూస్తూనే ఉన్నాం. 1908లో అమెరికన్ కార్యకర్త అన్నా జార్విస్ తన తల్లి దాతృత్వ ప్రయత్నాల నుండి ప్రేరణ పొంది, మొదటి మదర్స్ డే వేడుకను నిర్వహించినప్పుడు ఈ సంప్రదాయం మొదలైంది. అప్పటి నుండి, ప్రతిచోటా తల్లుల అపారమైన ప్రేమ, బలం, త్యాగం గురించి జరుపుకోవడానికి ఇది ఒక ప్రత్యేక సందర్భంగా మారింది అని చెప్పాలి.

ప్రముఖ సెలబ్రిటీలందరు కూడా తమ తల్లులతో దిగిన ఫొటోస్‌ని షేర్ చేస్తూ వారికి విషెస్ తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే దిల్ రాజు కూతురు చనిపోయిన తన తల్లికి విగ్రహం చేయించి ఇంట్లో పెట్టుకొని ఆ విగ్రహంతో ఫొటోలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ విషెస్ తెలిపింది. అమ్మ అనిత అంటే హన్షితకు ఎంత ప్రేమ అంటే%ఠ% ఏకంగా ఇంట్లో విగ్రహం పెట్టే అంత అని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. . ఫోటోలో హన్షిత కుమార్తె, దిల్ రాజు మనవరాలిని కూడా చూడొచ్చు. కాగా, దిల్ రాజు మొదటి భార్య అనిత కొన్నాళ్ల క్రితం గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి హర్షితా రెడ్డి తన తల్లి జ్ఞాపకాలలోనే బ్రతుకుతుంది.

అనిత మరణించిన కొద్ది రోజులకి దిల్ రాజు నిరాడంబరంగా తన రెండో వివాహాన్ని చేసుకొన్నారు. కరోనా లాక్‌డౌన్ పరిస్థితులు కావడంతో అతి తక్కువ మందే ఈ పెళ్లికి హాజరయ్యారు. మొదటి భార్య అనిత మరణాంతరం ఆయన ఒంటరిగా ఉంటున్నతనకి తోడుగా ఉండేందుకు జీవిత భాగస్వామి అవసరమని కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు ఆయన పెళ్లికి సిద్ధమైనట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. దిల్ రాజు వివాహం చేసుకొన్న అమ్మాయి అసలు పేరు వైఘారెడ్డి. అయితే ఇద్దరి జాతకాలను బట్టి వధువు పేరును తేజస్వినిగా మార్చుకొన్నారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. వైఘారెడ్డి దిల్ రాజు కుటుంబంలోని అతి దగ్గరి ఫ్యామిలీకి చెందిన వారుగా చెప్పారు. ఈ దంపతులకి కొడుకు జన్మించగా, ఆ బుడతడి ఫోటోలు అప్పుడప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తుంటాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370